ఆదివారం వార్త

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 288 పేజీలు: 8+4 వెల: 6.50



సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం

KAPIL GROUP కపిల్ చిట్స్ 45 years

Visit Us: www.kapilchits.com

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

sricharanamedia.in


## 'తెలంగాణ రైజింగ్'తో కొత్త పుంతలు

### సమగ్ర భవిష్యత్తును నిర్మిద్దాం

### ఎస్‌హెచ్‌జిలు, ఎంఎస్‌ఎంఇలను ప్రోత్సహించండి

### ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో డి. సిఎం భట్టి



మంగళవారం ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో డి. సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్18:** 2047 తెలంగాణ రైజింగ్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించబోతోంది, అన్ని రకాల పాలసీలను ప్రకటిస్తామని ఈ భారీ కార్యక్రమంలో బ్యాంకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన బేగంపేటలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించిన బ్యాంకర్స్ 47వ >>2



## మావోయిస్టు అగ్రనేత హిడ్మా హతం

### భార్య రాజే సహా మరో నలుగురు ఎన్‌కౌంటర్

**చర్ల, నవంబర్ 18, ప్రభాతవార్త:** మూడు రాష్ట్రాల పోలీసు బలగాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కొరకరాని కొయ్యాగా మారిన మావోయిస్టు అగ్రనేత కేంద్రకమిటీ సభ్యుడు పిఎల్ జి 1 బెటాలియన్ కమాండర్ మాడివి హిడ్మా ఆలియాస్ సంతోష్ ఆంధ్రప్రదేశ్ లోని మారేడుమిల్లి టైగర్ జోన్ అటవీప్రాంతంలో మంగళవారం మావోయిస్టులకు గ్రేంహడ్స్ బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందాడు. ఈ ఎన్ కౌంటర్‌లో ఆయన భార్య మడకం రాజే (సబ్ జోనల్ కమిటీ) సభ్యురాలు, లక్మల్ ఆలియాస్ చైతు మల్లు(మల్లలు) కమ్లు (కమ్లేష్) మృతిచెందారు. మారేడు మిల్లి అటవీప్రాంతంలోని నల్లూరి జలపాతం సమీపంలో మావోయిస్టు ఉన్నా రన్న నిఘా వర్గాల సమాచారం మేరకు ఆ ప్రాంతంలో కూబింగ్ ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలకు మావోయిస్టు తారసపడటంతో కాల్పులు జరిగాయి.ఈ కాల్పుల్లో సెంట్రల్ కమిటీ సభ్యుడు హిడ్మాతో పాటు ఆయన భార్య రాజేతో పాటు మరో నలుగురు మృతిచెందారు.హిడ్మాపై కోటి రూపాయల రివార్డు ఉండగా ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా పువ్వర్తి (పువ్వారు) గ్రామంలో 1981 జన్మించాడు.10 తరగతి వరకు చదివిన హిడ్మా గ్రామంలోని వచ్చి మావోయిస్టులు ఆలపించే విప్లవ >>2

### హిడ్మాపై కోటి రూపాయల రివార్డు, రాజేపై 50 లక్షలు

### మరో 30 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

### విజయవాడ, ఏపిలోని వివిధ ప్రాంతాల్లో 57 మంది అరెస్టు



## అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మొద్దు..

### మావోయిస్టులకు కేంద్రమంత్రి బండి సంజయ్ సలహా

**వేములవాడ టౌన్, ప్రభాతవార్త:** అర్బన్ నక్సల్స్ మాయలో పడి మావోయిస్టులు మోసపోయి ప్రాణాలు కోల్పోవద్దని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి >>2

# చేయూత ఇవ్వండి

### గుజరాత్‌కు ఇచ్చిన సహకారాన్నే తెలంగాణకూ కోరుతున్నాం

### రాష్ట్ర ప్రాజెక్టులకు త్వరగా అనుమతులివ్వాలి

### రాజకీయం ఎన్నికల సమయంలోనే చేయాలి

### పట్టణాభివృద్ధి మంత్రుల సమావేశంలో సిఎం రేవంత్



మంగళవారం హైదరాబాద్ పట్టణాభివృద్ధి మంత్రుల సమావేశంలో జ్ఞాపికను అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో కేంద్రమంత్రి ఖట్టర్, ఏపి మంత్రి నారాయణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్18:** ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా భారత్ ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ కూడా భాగస్వామ్యం కావాలని బలంగా ఆకాంక్షిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి సంపూర్ణ సహకారం, మద్దతు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డ్యూల పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల ప్రాంతీయ సదస్సును కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, దేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాల పూర్తి చేసుకునే 2047 నాటికి ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు నడిపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు తమ వంతుగా భాగస్వామ్యం కావడానికి తెలంగాణ ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతోందని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. దేశం ప్రగతిలో మెట్రోపాలిటన్ నగరాలు ఎన్నో రకాలుగా తోడ్పాటునందిస్తున్నాయి.దేశంలో వ్యవసాయ రంగంతో పాటు పట్టణీకరణ కూడా చాలా ముఖ్యమైన అంశం. ప్రత్యేకించి మెట్రోపాలిటన్ సిటీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన పాలసీని తీసుకురావాలి అని చెప్పారు. బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదగడంలో 10 శాతం మేరకు తెలంగాణ నుంచి దోహదపడాలని నిర్దేశించాం. ఆ లక్ష్యాల సాధన కోసం తెలంగాణ రైజింగ్ 2047 బృహత్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. డిసెంబర్ 9 వ తేదీన ఆ విజన్ డాక్యుమెంట్ ను ప్రజలకు అంకితం చేయబోతున్నాం అని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలని నిర్దేశించుకున్నాం. ఆ లక్ష్యాల సాధనకోసం రాష్ట్రంతలపెట్టిన ప్రాజెక్టులకు >>2

ప్రతిమహిళా సంఘానికి ఒక్కో బస్సు: ప్రభుత్వం 7



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్‌పాటిల్‌తో భేటీ అయిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## 'మారువేషం'తో బనకచర్ల!

### టెండర్లు రద్దు చేసినా కొత్త పేరుతో నిర్మాణానికి ఎపి సన్నాహాలు

### ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకోండి

### కృష్ణా జలాల సత్వర పంపిణీకి ట్రిబ్యునల్ విచారణ వేగంగా జరపాలి

### గోదావరి, కృష్ణ పెండింగ్ ప్రాజెక్టులకు వెంటనే అనుమతులివ్వండి

### ఢిల్లీలో జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ

**హైదరాబాద్,నవంబరు 18,ప్రభాతవార్త:** పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు వివరణాత్మక ప్రణాళిక నివేదిక (డిపిఆర్) తయారించడానికి పిలిచిన టెండర్లు తెలంగాణఒత్తిడికి తలొగ్గి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంరద్దుచేసుకొన్నా, మరొక కొత్త పేరుతో ఈ ప్రాజెక్టును చేపట్టే అవకాశం ఉందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు.కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో న్యూఢిల్లీలో మంగళవారం >>2



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

## ఇద్దరు కార్మికులు సజీవ దహనం

### జడ్చర్లలో జిన్నింగ్ మిల్లు వద్ద ఘటన

**జడ్చర్ల,నవంబరు 18 ప్రభాతవార్త:** జిన్నింగ్ మిల్లుఅగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు కార్మికులు సజీవ దహనం కావడంతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం జడ్చర్ల మండల పరిధిలోని గొల్లపల్లి వద్ద ఉన్న సలసర్ బాలాజీ జిన్నింగ్ >>2

## తెలంగాణకు 'జల్' అవార్డుల పంట

### పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్18:** జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు-2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం- 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒకపట్టణ స్థానికసంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు.క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు.మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు >>2



రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న పిఆర్ కమిషనర్ సృజన


గర్భాశయ కేన్సర్‌కు యేటా 3.50 లక్షల మంది మృతి

హెచ్‌పివి వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నా కట్టడికాని వైరస్

2 నిమిషాలకు ఇద్దరు మహిళలు మృతి



3

అయ్యప్ప దర్శనానికి గం.16 క్యూలైన్లలో 2 లక్షల మందికిపైగా భక్తులు



3

షేక్ హసీనాను భారత్ అప్పగిస్తుందా?

బంగ్లా వినతిపై స్పందించని వైనం

ప్రస్తుతం భారత్‌లో ఉన్న హసీనా



5




మంగళవారం పత్తికొనుగోళ్లపై సమీక్షలో మంత్రి తుమ్మల

## నేటి నుండి పత్తి కొనుగోళ్లు యధాతథం

### సిసిఐ, జిన్నింగ్ మిల్లుల చర్చలు సఫలం

### వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు జరిపేందుకు మిల్లర్లు అంగీకరించారని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ నెల 19 నుండి పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభం అవుతాయన్నారు. ఈ మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మధ్య హైదరాబాద్‌లో >>2

## ఐ బొమ్మ గోల్‌మాల్‌పై ఇడి వల

### వివరాలు ఇవ్వాలని పోలీసులకు లేఖ

### వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

### నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడి

### కస్టడీ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా



**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలను, ఓటిటి కంటెంట్లను పైరసీ చేస్తూ బెట్టింగ్ యాప్‌లతో కుమ్మక్కైన ఐ బొమ్మ వెబ్‌సైట్ వ్యవహారంలో మంగళవారం నాడు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో నిజాలను నిగ్గుతేల్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) రంగంలో దిగింది. దీనికి సంబంధించిన అన్ని వివరాలను తమకు ఇవ్వాలని ఈడీ అధికారులు సిటీ పోలీసు అధికారులను కోరుతూ లేఖ రాశారు. మరోవైపు ఈ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి రిమాండు రిపోర్టులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. ఇమ్మడి రవి పైరసీ తయారు చేయడంలో ఆరితేరాడని, ఇతన్ని అరెస్టు చేయకపోయి వుంటే మరింత ప్రమాదకారిగా మారివుండే వాడని, ప్రాథమిక విచారణలో నిందితుడు తన నేరాలను అంగీకరించాడని పోలీసులు తెలిపారు. కాగా రవి కస్టడీ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో జరిగిన విచారణ బుధవారానికి వాయిదా పడింది.

తెలుగుతో పాటు అనేక భాషల సినిమాలను, ఓటిటి కంటెంట్లను విడుదలకు ముందే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పైరసీ చేస్తూ సినీ రంగాన్ని తీవ్ర సంక్షోభంలో నెట్టిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి వ్యవహారంలో బెట్టింగ్ యాప్స్ వుండడం, క్రిప్టో కరెన్సీ లావాదేవీలు బయట పడడంతో ఇందులోని నిజాలను రట్టు చేసేందుకు ఈడీ రంగంలో దిగింది. బెట్టింగ్ యాప్స్‌ల అక్రమాలపై ఈడీ దేశ వ్యాప్తంగా పలుచోట్ల కేసులు నమోదు చేసి విచారిస్తుండడం తెలిసిందే. ఈడీ విచారణకు హాజరైన వారిలో సినీ తారలతో పాటు క్రికెటర్లు కూడా వుండడం విదితమే. ఈ విచా రణ ఇంకా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఐ బొమ్మ వ్యవహారం రట్టవగా ఇందులో బెట్టింగ్ యాప్స్ పాత్ర వుండడంతో దీనికి సంబంధించిన పూర్తి వివరాలను తమకు ఇవ్వాలని ఈడీ అధికారులు సిటీ పోలీసులకు లేఖ రాశారు. అవసరం అయితే దీనిపై తాము వేరుగా కేసు నమోదు చేసి, రవిని అరెస్టు చేసి, కస్టడీలోకి తీసుకుని అతన్ని మరింతగా విచారించేందుకు ఈడీ అధికారులు రెడీ అవుతున్నారు.ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో రవి వుండగా అతని అక్రమాలపై ఈడీ అధికారులు ఇప్పటికీ మీడియాలో వచ్చిన వివరాలు, అతనిపై సిని వర్గాల వారు చేసిన ఫిర్యాదులను తీసుకుని పరిశీ లిస్తున్నారు. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి రిమాండు రిపోర్టులో కీలక >>2



మంగళవారం శాసన మండలి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సిఎం రేవంత్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ తదితరులు

## మండలి భవన మరమ్మతు పనులను పరిశీలించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్18:** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి భవన మరమ్మతు పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, ఆర్ అండ్ బి శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. శాసనమండలి భవన మరమ్మతులకు సంబంధించి సిఎం పలు సూచనలు చేశారు. అసెంబ్లీ, శాసనమండలి భవనాలు ఒకేఆవరణలో వేరువేరుగా ఉండాలని పేర్కొన్నారు. శాసనమండలి భవనంలో సముదాయాన్ని పూర్తిగా పరిశీలించారు.

## 'మారువేషం'తో బనకచర్ల!

>> సమావేశమైన తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృష్ణా గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో సుదీర్ఘకాలం నుంచి పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు.కృష్ణ గోదావరి నది జలాల్లో తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌ను కోరారు. జలశక్తి మంత్రిత్వశాఖతో సమావేశం అనంతరం ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టులో స్టే ఉన్నప్పటికిని కర్ణాటక ఆల్మట్టి డ్యాం ఎత్తును 524.25 మీటర్ల వరకు నిర్మించేందుకు ప్రయత్నిస్తోంది ముందుకు వెళ్లకుండా కర్ణాటకను కేంద్ర ప్రభుత్వం కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వంకు విజ్ఞప్తిచేశామని అన్నారు. కర్నాటక ప్రభుత్వం తీసుకొచ్చిన జివోను కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖకు అందజేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన కీలకమైన ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ ఆయన అభ్యర్థించారు. పోలవరం నుంచి గోదావరి వరద జలాల మళ్లింపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ చర్యచేపట్టినా ఎగువ రాష్ట్రాలు కర్ణాటక మహారాష్ట్ర తమ వాటాలను గుర్తు చేస్తున్నాయనీ,ఆంధ్రప్రదేశ్ వరదల జలాల తరలింపును సాకుగా చూపి కర్ణాటక మహారాష్ట్ర నీటిమళ్లింపులకు పాల్పడితే దిగున ఉన్న తెలంగాణకు నష్టం జరుగుతుందనీ తన ఆందోళనను జలశక్తి మంత్రిత్వశాఖ ముందుకు పెట్టానని ఉత్తమ్ వివరించారు. పోలవరం నుంచి వరద జలాలను తరలించే ఎపి ప్రయత్నాలను కేంద్రమే నిలువరించాలనీ కృష్ణానది సహజన న్యాయసూత్రాలకు అనుగుణంగా తెలంగాణకు అత్యధిక వాటా ఇవ్వాలని ఆయన సూచించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు డిపిఆర్ ను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి సమర్పించామని తెలిపారు. 90 టిఎంసిల నీటి కేటాయింపులుగాను మొదటి దశలో మైనర్ ఇరిగేషన్లు పొదుపు కింద ఉన్న 45 టిఎంసిలకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరానని చెప్పారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పై లేవనెత్తిన అభ్యంతరాలను ఇప్పటికే నివృత్తి చేసామని, వెంటనే అనుమతులు ఇవ్వాలని జలశక్తి మంత్రికి చెప్పానని తెలిపారు. తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ మధ్య కృష్ణా జలాల పునః పంపిణీ పై ట్రిబ్యునల్ 2 విచారణ త్వరగా పూర్తయ్యేలా కేంద్రం చొరవ చూపాలని అన్నారు. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన సాగునీటి సత్వర ప్రయోజన కార్యక్రమం కింద తెలంగాణలో ప్రాణహిత చేవెళ్ల, నారాయణపేట కొడంగల్ సమీకృత సీతారామ, సీతమ్మ సాగర్ పాలమూరు రంగారెడ్డి చిన్న కాళేశ్వరం మోడీ కుంట వాగు, చనఖాకోరాటా ప్రాజెక్టుల పూర్తి చేసేందుకు కేంద్రం తోడ్పాటును అందించాలని కోరినట్లు తెలిపారు.

## పత్తి కొనుగోళ్లు యధాతథం

>> మంగళవారం జరిగిన మిల్లర్ల చర్చలు సఫలం అయ్యాయని తెలిపారు. పత్తి కొనుగోళ్ల సమస్యలపై సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా, జిన్నింగ్ మిల్లర్ల అసోషియేషన్‌తో జరిగిన చర్చలు జరిగాయని చెప్పారు. ఈ రోజు సచివాలయంలో సీసీఐ సిఎండి, లలిత్ కుమార్ గుప్తా, జిన్నింగ్ మిల్లర్ల అసోషియేషన్‌తో సమావేశమై సమస్యలపై చర్చించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. రైతుల సమస్యలను రెట్టింపు చేసేలా జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సమ్మెకు దిగడం సమంజసం కాదని సామరస్యంగా కేంద్రంతో పోరాడుదామన్నారు. జిన్నింగ్ సమస్యలపై కేంద్రానికి ఒక నివేదిక పంపాల్సిందిగా సూచించారు. జిన్నింగ్ మిల్లుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రయత్నాలు చేస్తుందని చెప్పారు. బుధవారం నుండి పత్తి కొనుగోళ్ళు యధాతథంగా ప్రారంభించాలని జిన్నింగ్ మిల్లులను కోరారు. అన్ని జిల్లాలలో నోటిఫై చేసిన మిల్లులను తెరవాలన్నారు. అదేవిధంగా కేంద్రం కొనకపోయినా మొక్కజొన్న 18 నుండి 25 క్వింటాళ్లకు పెంచి కొనుగోళ్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా నాఫెడ్ సేకరించే సోయా చిక్కుడు పరిమితిని కూడా ఎకరానికి 6.72 నుండి 10 క్వింటాళ్లకు పెంచాల్సిందిగా మార్క్ ఫెడ్ అధికారులను విజ్ఞప్తి చేశారు. ఇక తేమశాతం అనే మరో కఠిన నిబంధన పెట్టి, రైతులకు ఊపిరిసలపకుండా చేసింది. జిన్నింగ్ మిల్లుల విభజించి, జిన్నింగ్ మిల్లర్లను కూడా ఇబ్బందులకు గురిచేసిందన్నారు.

## నేటి నుంచి కోటి చీరెల పంపిణి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్18:** కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందిరా గాంధీ జయంతి నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు.

## ఇద్దరు కార్మికులు సజీవ దహనం

>> మిల్లులో చోటు చేసుకుంది. మండల పరిధిలోని గొల్లపల్లి వద్ద ఉన్న సలసర్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది కార్మికులు నిత్యం పనిచేస్తుంటారు. అందులో భాగంగానే మంగళవారం అనుకోకుండా అగ్ని ప్రమాదం సంభవించింది. ఇదే సమయంలో మిల్లులోని బయటికి గాలి ఊద్చే పైపులైన్ లో చెత్త ఇరుక్కుందని వాటిని తొలగించేందుకు ఒడిశా రాష్ట్రానికి చెందిన పప్పు 26, బీహార్ రాష్ట్రానికి చెందిన హరేందర్ 23 వెళ్లారు. ఈ క్రమంలో అటుపక్క అంటుకున్న మంటలు ఒక్కసారిగా ఎగిసిపడడంతో ఇద్దరు అగ్నికి ఆహుతి అయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఇద్దరికీ ఇటీవలే వివాహం అయిందని తోటి కార్మికులు తెలిపారు. ఈ ఘటనతో బీహార్, ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు కంపెనీ యజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ యజమాన్యం పై దాడికి దిగారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పోలీసులు అదనపు బలగాలను కంపెనీ వద్దకు రప్పించారు. పోలీసులు భారీ ఎత్తున మోహరించి నిరసన కారులను చెదరగొట్టారు.



మంగళవారం న్యూఢిల్లీలో 'జల్ భాగీరథి అవార్డ్సు' కార్యక్రమాన్ని కుండలో నీరు పోసి ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ముర్ము

### వారం - వర్జ్యం

**19-11-2025, బుధవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, కార్తీకమాసం, దక్షిణాయణం శరద్ ఋతువు, శుక్లపక్షం**
చతుర్దశి ఉ.9.44
స్వాతి ఉ.7.59, విశాఖ కార్తె
వర్జ్యం : మ.2.17-4.05
దు.ఉ.11.31-12.36
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** పట్టుదల, ఓర్పుతో ముందుకుసాగుతారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** సంఘంలో మీ మాటకు గౌరవం లభిస్తుంది. నూతన ఉద్యోగాలలో ప్రవేశిస్తారు. ఆచితూచి నిర్ణయాలు తీసుకొంటారు.

**మిథునం:** నూతన ప్రయత్నాలకు సన్నిహితులు సహాయ సహకారాలు లభిస్తాయి. దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కర్కాటకం :** వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.వాహన సౌఖ్యం కలదు.

**సింహం:** నూతన పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి. పోటీ పరీక్షలలో పాల్గొంటారు. చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలలో ఆశించిన నిర్ణయాలు తీసుకోవడం మంచిది.జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలు సకాలలో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు.క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. బంధువుల కలయిక. సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

**ధనుస్సు:** సంతాన విషయంలో కొంత ఆందోళన చెందుతారు. దైవ సంబంధిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** నిర్మొహమాటమైన మీ మాటల వల్ల సన్నిహితులు దూరమవుతారు. మెలుకువలో వ్యవహరించండి. సోదరుల కలయిక.

**కుంభం:** విదేశాలలో ఉన్న మిత్రుల నుండి కానుకలు అందుకుంటారు. సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**మీనం :** నూతన వ్యాపార యత్నములను, కొద్ది కాలం వాయిదా వేయడం మంచిది. వివాదాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మావోయిస్టు అగ్రనేత హిడ్మా హతం

>> గీతాల పట్ల ఆకర్షితుడై 16 ఏళ్ల చిరుప్రాయంలోనే ఉద్యమ బాట పట్టాడు.పిఎల్ జిఏ సభ్యుడిగా ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించిన సుక్మా బీజాపూర్ దంతెవాడ జిల్లాలలో పనిచేసి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు అయ్యాడు.ఉద్యమంలోనే ఉన్న అగ్రనేత మల్లోజులు ఆశన్న బస్వరాజ్ వంటి అగ్రనేతల వద్ద హిందీ ఇంగ్లీష్ బాషలతోపాటు మందుపాతర తయారీ రాకెట్ లాంఛర్ల వినియోగం వంటి వాటిపై శిక్షణ తీసుకున్నాడు.అంతే కాకుండా శత్రువులను టార్గెట్ చేసి పని సునాయాసంగా అమలుపర్చడంలో దిట్టగా పేరుగడించాడు.మావో ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న పిఎల్ జిఏ బలగాలకు మిలటరీ ఛీఫ్ గామారి యుద్ధతంత్రంలో ఆరితేరాడు.అందుకే అతిపిన్న వయస్సులోనే కేంద్రకమిటి సభ్యుడు అయ్యాడు.హిడ్మా నేతృత్వం వహించిన 26 ఎన్ కౌంటర్లలో అన్నిటిలో అధిపత్యం చెలాయించాడు.2010లో దంతెవాడ జిల్లాలో 76 మంది సిఆర్పీఎఫ్ బలగాలకు చంపిన ఘనటలో 2013లో జిరామ్ లోయలో సల్వాజుడుం నేత సిజి కాంగ్రెస్ అగ్రనాయకుడు మహేంద్ర కర్మ కేంద్రమంత్రి సుక్లా వంటి అగ్రనేతలు ప్రయాణిస్తున్న వాహనంపై దాడిలో 2021లో సుక్మా బీజాపూర్ జిల్లాల సరిహద్దులో 22 మంది భద్రతా బలగాలను మట్టుబెట్టిన ఘటనలో ప్రధాన సూత్రదారిగా ఉన్నాడు.ఇన్ని ఘటనల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న హిడ్మా ఆ సమయంలో పోలీసులకు సవాల్ విసిరాడు.నేను దక్షణ బస్తర్ ప్రాంతంలోనే ఉంటా అవసరమైతే ఎదుర్కోండి అని సవాల్ విసిరాడు.దీంతో హిడ్మా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మోస్టు వాంటెడ్ నేతగా మారాడు.

**హిడ్మా లక్ష్యంగా కూబింగ్**

హిడ్మాను పట్టుకోవడమా లేదా అంతం చెయ్యడమా అనే లక్షంతో గత రెండేళ్లుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశేషంగా కృషిచేస్తున్నాయి.దట్టమైన దండకారణ్యంలో ధర్మల్ ఇమేజింగ్ సిస్టం ద్వారా హిడ్మా కదలికలపై నిఘా పెట్టారు.స్వగ్రామం పువ్వర్తితోపాటు గర్రిగుట్టలు మరో 125 గ్రామాలపై కన్నేసి సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.హిడ్మాను పట్టుకోవడం కోసం డ్రోన్లు శాటిలైట్ సిస్టం (ధర్మల్ ఇమేజింగ్ సిస్టం) వంటి వాటిని వాడారు అంటే అర్థం చేసుకోవాలి.ధర్మల్ ఇమేజింగ్ సిస్టం (కెమెరా) దేశ సరిహద్దులో వినియోగిస్తారని తెలిసింది.శత్రువులు ఎక్కడ ఉన్నారు వారి కదలికలు ఎలా ఉన్నాయి అనే ఆధారంగా ఆపరేషన్ చేపట్టవచ్చును ఇటీవల వీటిని ఆధారం చేసుకొని అగ్రనేతల ఎన్ కౌంటర్లు జరిగినట్లు తెలుస్తుంది.

**ఆంధ్రా ఒరిస్సా బోర్డర్లపై నిఘా**

చత్తీస్‌గఢ్ లో రోజురోజుకు హిడ్మతో పాటు మరి కొందరిపై అగ్రనేతలపై నిఘా ఎక్కువ అవ్వడంతోపాటు వారి స్థావరాలైన కర్రిగుట్టలు అబూజ్ మఢ్ ప్రాంతాలను భద్రతా బలగాలు తరచూ చుట్టుముట్టుతున్నాయి.ఈ నేపద్యంలో మావోయిస్టు అగ్రనేతలు హిడ్మా దేవ్ జీ వంటి నేతలు ఇక్కడ ఉండటం సేఫ్ కాదని ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ ( ఏవోబి) మకాం మార్చుతున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది.అప్రమత్తమైన కేంద్ర హోంశాఖ చత్తీస్‌గఢ్ తెలంగాణా ( ఏవోబి ) ప్రాంతాలలో హైలర్ట్ ప్రకటించింది.ఈ క్రమంలో ఏవోబిలోని మారేడుమిల్లి అటవి ప్రాంతంలో మావోయిస్టుల ఉణికి పసిగట్టి కూబింగ్ చేపట్టగా గ్రేహాండ్స్ బలగాలకు మంగళవారం ఉదయంలో మావోయిస్టులు తారసపడటంతో కాల్పులు జరిగాయి.గ్రేహాండ్స్ బలగాల కాల్పుల్లో హిడ్మాతోపాటు మరో ఐదుగురు మృతిచెందారు.హిడ్మా మృతితో దండకారణ్యం దిగాలుగా ఉంది.మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం కోసం మారేడుమిల్లికి బయలు దేరినట్లు తెలిసింది. మావోయిస్టు మోస్టు వాంటెడ్ నేత హిడ్మాను నవంబర్ 30 నాటికి హతం చెయ్యాలని కేంద్ర బలగాలకు హోంశాఖ మంత్రి అమిత్ షా డెడ్ లైన్ విధించారు.ఆయన ఇచ్చిన గడువు కన్నా ముందే హిడ్మాను ఎన్ కౌంటర్ చేసారు.

**తల్లి కోరిక తీరకుండానే అనంతలోకానికి..**

ఇంటికి రా బిడ్డా నిన్ను చూడాలని ఉంది.లేదంటే ఈ ముసలి వయస్సులో నిన్ను వెతుక్కుంటు నేనే అడవిలోకి వస్తాను..ఇక్కడే ఉంది ఏదో ఒక పని చేసుకొని బ్రతుకుదాం అని హిడ్మా తల్లి వేడుకుంది.చత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ హిడ్మా స్వగ్రామం పువ్వర్తి చేరుకొని హిడ్మా తల్లితో ముచ్చటించారు.లొంగిపోవాలని కోరారు.ఆమె సహపంక్తి భోజనం చేసారు.ఇది జరిగిన 10 రోజులు గడిచిన తర్వాత మారేడుమిల్లి అటవి ప్రాంతంలో కొడుకు మరణవార్త విన్న తల్లికి తీవ్ర విషాదానికిలోనైంది..

**అసలేం జరిగింది..**

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా మృతిపై మేధావుల్లో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దండకారణ్యంలో అణువణువు తెలిసిన వ్యక్తి సుమారు రెండున్నర దశాబ్దాలుగా ఎదురులేని శక్తిగా భద్రతా బలగాలను ముప్పుతిప్పులు పెట్టిన నేత అనేక ఎన్ కౌంటర్ల నుండి తృటిలో తప్పించుకోని తనకు ఎటువంటి పట్టులేని ఏవోబి ( మారేడుమిల్లి ) ఏరియా ఆ ప్రాంతం గురించి అంతగా తెలియని వ్యక్తి దండకారణ్యాన్ని వీడి ఏవోబి లోకి ఎందుకు వెళ్లాడు.షెల్టర్ తీసుకోవడానికి వెళ్లాడా..? లేక అక్కడ నుండి నల్లమలకా.. లేదా దేశం దాటి నేపాల్ కి వెళ్తున్నాడా అనే సందేహాలు మేధావి వర్గాలు విశ్లేషకుల్లో ఉత్పన్నం అవుతున్న ప్రశ్న అయితే హిడ్మా దళంలో 100 నుండి 200 మంది వరకు సభ్యులు ఉంటారు.వీరందరూ ఎక్కడ ఉన్నారు సేఫ్ జోన్ కి వెళ్లేందుకు విజయవాడ వచ్చారా వచ్చిన సమయంలో నిఘా వర్గాలకు సమాచారం అందటంతో వీరందరినీ అదుపులోకి తీసుకున్నారా అదుపులో ఉన్నవారిలో హిడ్మా ఉండటంతో హిడ్మాతో పాటు మరో 5గురిని ఎన్ కౌంటర్ చేసారా అన్న సందేహాలు పలువురిలో కలుగుతున్నాయి.. విజయవాడ పోలీసులకు ఓ ఇంట్లో పట్టుబడిన 27 మంది పట్టుబడినట్లు చెప్తున్నారు.మిగిలిన సభ్యులు ఎంత మంది ఉన్నారు.ఇంకా ఎక్కడ ఉన్నారు.అసలేం జరిగింది అన్నదానిపై మావోయిస్టులు నోరువిప్పితే ఈ ఎన్ కౌంటర్ పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎపిలోని వివిధ ప్రాంతాల్లో మొత్తంగా 57 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు సమాచారం.

## మెట్రో, మూసీ, త్రిబులార్‌కు అమృత్ యోజన నిధులు: కేంద్ర మంత్రి ఖట్టర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్18:** హైదరాబాద్ మెట్రో రైల్, మూసీ సుందరీకరణ ప్రాజెక్టు, ఆర్ఆర్ఆర్‌కు కేంద్రంఅన్ని విధాలా సహకరిస్తుందని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్ లాల్ కట్టర్ తెలిపారు. ఇందుకోసం అమృత్ యోజన నిధులు మంజూరు చేస్తామన్నారు. దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల పురపాలక శాఖ మంత్రుల సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై కేంద్ర మంత్రి సమీక్ష జరిపారు. ప్రధానమంత్రి అవాస్ యోజన, అమృత్ యోజన పథకం సహా పలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ నుంచి ఎల్‌అండ్‌టి వైదొలిగిందని, ఇకపై కేంద్ర ప్రభుత్వం ఇందులో భాగస్వామ్యం కానుందన్నారు. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం కింద హైదరాబాద్ మెట్రోలో కేంద్రం చేరుతుందన్నారు. కాగా, దేశ వ్యాప్తంగా మెట్రోకు విశేష ఆదరణ లభించడంతో ఎక్కువ రాష్ట్రాలు మెట్రోను కోరుతున్నాయని ఆయన చెప్పారు. అయితే, భూసేకరణ పూర్తయిన ప్రాజెక్టులకు సంబంధించి ముందుగా ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నామని కేంద్రమంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో రెండో దశ మెట్రో విస్తరణకు పూర్తిగా సహకరిస్తామని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ హామీ ఇచ్చారు. ఇక మూసీ ప్రాజెక్ట్ పనులకు కూడా నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. అమృత్ యోజనలో భాగంగా నగర ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. పిఎం ఆవాస్ యోజనకుసంబంధించిన గృహాల మంజూరుకూడా ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేస్తామని కట్టర్ వెల్లడించారు.

## ఐ బొమ్మ గోల్‌మాల్‌పై ఇడి వల

>> విషయాలు ఇదిలావుండగా ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి రిమాండు రిపోర్టులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. రవిని శుక్రవారం రాత్రి కూ కట్‌పల్లిలో తన స్నేహితుడి ఇంట్లో వుండగా అరెస్టు చేయడం తెలిసిందే. అనంతరం అతన్ని చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించడం విదిత మే. దీనిపై సోమవారం నాడు సిటీ కొత్వాల్ సినీ ప్రముఖులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి రవి అక్రమాలను వెల్లడించారు. కాగా ర వి అక్రమాల గురించి పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండు రిపోర్టు తాజాగా వెలుగు చూసింది. ఇందులో రవి గోల్‌మాల్‌పై పోలీసులు అనేక విషయాలను వెల్లడించారు. రవి తన గోల్‌మాల్ తన కార్యకలాపాల కోసం ఐ బొమ్మ, బప్పం టివిల పేరుమీద మొత్తం 17 వెబ్‌సైట్లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ఐ బొమ్మ పేరిట ఐబొమ్మ, ఐబొమ్మ నెక్సాస్, ఐబొమ్మ మార్కెట్, ఐబొమ్మ వన్ వుండగా బప్పం టివి పేరిట బప్పం టివి, బప్పం సిసి, బప్పం కొ ఇన్, బప్పం నెట్, బప్పం ఓఆర్‌జి, బప్పం ఈయు వుంది, కాగా ఇమ్మడి రవి పైరసీ సినిమాలు ఉచితంగా తన టివిలలో చూపినందుకు వినియోగదారుల వ్యక్తిగత వివరాలను వారికి తెలియకుండా కాజేయడం తెలిసిందే. ఇలా కోట్లాది మంది వివ రాలను ఇతను కాజేసి వాటిని బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులకు ఇచ్చి దండిగా డబ్బులు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో రవి అనేక మంది బెదిరించాడని, దీనికి సంబంధించి తమ వద్ద వున్న వివరాలను పోలీసులు కోర్టుకు అందజేశారు. కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించడంతో రవి భారత పౌరసత్వం వదులుకుని కరే బియన్ పౌరసత్వం తీసుకున్నాడని ఇదంతా అతన్ని నేర ప్రవర్తను సూచిస్తుందని పోలీసులు వివరించారు. ఇతన్ని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని, అక్రమాలపై మరింతగా విచారించాలని పోలీసు లు కోరారు. దీనిపై మంగళవారం నాడు నాంపల్లి కోర్టులో విచారణ జరగగా విచారణను న్యాయమూర్తి బుధవారానికి వాయిదా వేశారు.

## అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మొద్దు..

>>బండి సంజయ్ కుమార్ అన్నారు.అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో కుటుంబ సభ్యులతో కలిసి జల్సా చేస్తున్నారనీ, ఏ పార్టీ అధికారంలో ఉన్నా పైరవీలు చేసుకుంటూ ఆస్తులు కూడగట్టుకుని కార్లలో తిరుగుతున్నారనీ,వాళ్ల మాటలు నమ్మిన అమాయకులు తుపాకీ పట్టుకుని అడవుల్లో తిరుగుతూ తిండీ తిప్పలేక ప్రాణాలు కోల్పోతున్నారనీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అర్బన్ నక్సల్స్ చెప్పేదొకటి. చేసేదొకటి,వారి మాటలు నమ్మి మోసపోవద్దనీ, మంచి ఆలోచనలతో సమాజంలోకి వచ్చి, ప్రజలకు సేవ చేయలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవడానికి మరో నాలుగు నెలల సమయం మాత్రమే ఉందని వచ్చే మార్చినాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. మంగళవారం వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి సి ఎస్ ఆర్ నిధులతో కొనుగోలు చేసిన కోటిన్నర విలువైన వైద్య పరికరాలను అందించారుఈ సందర్భంగా మావోయిస్టు నేత హిడ్మా ఎన్ కౌంటర్ పై స్పందిస్తూ....తుపాకీ ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదు. తుపాకీ పట్టుకుని అమాయకులైన దళిత, గిరిజనులను పోలీసులను చంపారనీ,జాతీయ జెండా ఎగరేయొద్దని నక్సలైట్లు బీజేపీ నేతలను ఎంతోమందిని కాల్చి చంపారనీ అన్నారు.మావోయిజాన్ని అంతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఇప్పటికైనా మావోయిస్టులు లొంగిపోయి ప్రజా స్రవంతిలో కలవాలని కోరారు. వచ్చే మార్చి నాటికి దేశంలో మావోయిస్టుల అంతం తథ్యమని అన్నారు. మావోయిస్టులలో తుపాకీ వీడి జనంలోకి వచ్చే వారికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందనీ,బుల్లెట్ ను నమ్ముకుంటే ప్రాణాలు తీసుకోవడం మినహా మీరు సాధించేదేమీ లేదనీ, బ్యాలెట్‌ను నమ్ముకుంటే అధికారంలోకి రాగలమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు.

## 'తెలంగాణ రైజింగ్'తో కొత్త పుంతలు

>> త్రైమాసిక సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా 13 శాతం జీడీపీ పెరుగుదల టార్గెట్ గా 2047 రోడ్ మ్యాప్ ను విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం 10 శాతం చొప్పున పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యుత్తు సరఫరా లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. మొదటి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమాలు చేసిందో వివరించాం రెండవ సంవత్సరం చేసిన కార్యక్రమాలు వివరించడం తోపాటు తెలంగాణ రాష్ట్రం పట్ల మా కల ఏంటి, ఆ కలను సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలతో ముందుకు పోతున్నాం అనేది తెలంగాణ రైసింగ్ ఉత్సవంలో వివరించబోతున్నామని తెలిపారు. బ్యాంకులు ఈ ఏడాది తొలి అర్థభాగంలో 49.45శాతం ప్రాధాన్య రంగ రుణాలను సాధించాయి. క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 130.18శాతంగా ఉండటం తెలంగాణ ఆర్థిక ప్రయాణంపై ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా చూపిస్తుందనీ తెలిపారు. ఈ వేగం ప్రోత్సాహకరం, కానీ ఇదే సమయంలో మనం మరింత ఎత్తుకు చేరే బాధ్యత కూడా మనపై ఉందని గుర్తు చేశారు.ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక చర్యలు తీసుకుంది రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ, రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటలు ఉచిత విద్యుత్. వీటికి మీ భాగస్వామ్యం కలిస్తే, మరింత ప్రతిఘటనశీలమైన, వాతావరణ మార్పులకు సిద్ధమైన వ్యవసాయ రంగాన్ని నిర్మించగలం అరే డిప్యూటీ సీఎం విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మహిళలు తమ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించేందుకు ఎక్కువ పరిమితులు, వేగవంతమైన రీపేట్ ఫైనాన్స్ అందించాలి అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ఒక శక్తివంతమైన వేదిక. దీనిని పూర్తిస్థాయిలో వినియోగించి మహిళా ఆధారిత ఆర్థిక మార్పును వేగవంతం చేయాలని బ్యాంకులను కోరుతున్నాను అన్నారు. ఎంఎస్ఎంఈలు తెలంగాణలో ఉపాధి మరియు ఆవిష్కరణలకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. ఇప్పటివరకు ఎంఎస్ఎంఈల కోసం ఏసీపీ లక్ష్యాలలో 50.23శాతం సాధించినప్పటికీ, వర్కింగ్ క్యాపిటల్ కొరతలు, రుణాల ప్రక్రియలో ఆలస్యం అనేక సంస్థలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి అని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు.

## చేయూత ఇవ్వండి

>> కేంద్రం అనుమతులు మంజూరు చేస్తే మరింత వేగంగా ముందుకు వెళ్లగలం అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి ప్రత్యేకత ఉంది. మిశ్రమ సంస్కృతి, మంచి వాతావరణం కలిగి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలన్నారు. ఇప్పుడా ప్రస్తావన విషయానికి వెళ్లను కానీ, అభివృద్ధి విషయంలో తెలంగాణకు కేంద్రం సహకారం, మద్దతు ఉండాలి అని కోరారు. ప్రధానంగా మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, నగరానికి గోదావరి జలాల తరలింపు, కాలుష్య నివారణలో భాగంగా ప్రస్తుతం నగరంలో డీజిల్‌తో నడుస్తున్న 3 వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, సివరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు వంటి అనేక ప్రాజెక్టులు చేపట్టాం అని చెప్పారు. దేశంలో ఏర్పడిన జీసీసీల్లో 70 శాతం హైదరాబాద్ లో నెలకొల్పాయి. జీసీసీలు, డేటా సెంటర్లు, ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ నగరం ఒక హబ్ గా మారింది. వీటికి అనుగుణంగా ఇప్పుడు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం అని చెప్పారు. హైదరాబాద్ ను న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ లాంటి నగరాలతో పోటీ పడాలని భావిస్తున్నామని చెప్పారు. పెట్టుబడుల కోసం చైనా ప్లస్ 1 గమ్యస్థానాల కోసం దేశాలు అన్వేషిస్తున్న దశలో మెట్రోపాలిటన్ నగరాల్లో ఎయిర్ పోర్టులు, విద్యుత్, నీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గుజరాత్‌కు మోడీ ఇచ్చిన సహకారాన్నే మేము కోరుతున్నామన్నారు. మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, తాగునీటి సమస్య, కాలుష్య నియంత్రణ వంటి అనేక విషయాలపై దృష్టిని సారించి రాష్ట్రానికి సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు మాట్లాడొచ్చు. రాజకీయాలు ఇప్పుడు అసందర్భం అభివృద్ధిపైనే దృష్టి సారించాలన్నారు. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ప్రభుత్వాలు వేరైనప్పటికీ విధానాలను అమలు చేయడంలో మార్పులేదు. కాకపోతే వాటిని మరింత పదును పెట్టి అమలు చేయడం జరిగిందని ముఖ్యమంత్రి చెప్పారు.పట్టణాభివృద్ధి విషయంలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న అంశంపై పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖల సమావేశం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు కేంద్ర మంత్రి కట్టర్‌కు అభినందనలు తెలియజేశారు.ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పదించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అతి త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు.

## 'జల్' అవార్డుల పంట

>> జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి.కేటగిరీ3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీశ్‌కు కూడా అవార్డు దక్కింది. ఈ మేరకు పౌర సంబంధాల అధికారి, తెలంగాణ సమాచార కేంద్రం న్యూఢిల్లీ ద్వారా ఈ ప్రకటన విడుదల చేశారు.అవార్డుల వివరాలివే...శ్రీజన, ఐఏఎస్, పీఆర్, ఆర్డీ కమిషనర్,కే.అశోక్ కుమార్ రెడ్డి, ఎండీ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్,రాజర్షి షా, ఐఏఎస్, కలెక్టర్, ఆదిలాబాద్,జే.శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్, నల్గొండ,కుమార్ దీపక్, ఐఏఎస్, కలెక్టర్, మంచిర్యాల,సత్యశారద, ఐఏఎస్, కలెక్టర్, వరంగల్,అభిలాష అభినవ్, ఐఏఎస్, కలెక్టర్, నిర్మల్,రిజ్వాన్ భాషా షేక్, ఐఏఎస్, కలెక్టర్, జనగామ,జితేష్ వీ పాటిల్, ఐఏఎస్, భద్రాద్రి కొత్తగూడెం,బి.విజయేందిర, ఐఏఎస్, కలెక్టర్, మహబూబ్ నగర్ అవార్డులు పొందారు.

# మావోయిస్టులను ఫేక్ ఎన్‌కౌంటర్ చేయడం విచారకరం


## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** మావోయిస్టులను ఫేక్ ఎన్‌కౌంటర్స్ చేయడం విచారకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్టగా ఉన్నాయని మండిపడ్డారు. మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు కూడా ఇందులో పావులుగా మారారని కూనంనేని విమర్శించారు. మంగళవారం మారేడుమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్, అంతకంటే ముందు మావోయిస్టులపై జరిగిన ఎన్‌కౌంటర్స్ మొత్తం ఫేక్ ఎన్‌కౌంటర్స్ అని కూనంనేని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్స్‌తో మనుషులను చంపుకునే వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. మావోయిస్టులు ఏదైనా నేరాలు చేసివుంటే వారిని అరెస్టు చేసి చట్టబద్ధంగా విచారణ జరిపించాలని.. కానీ ఇలాంటి ఫేక్ ఎన్‌కౌంటర్‌లు చేయడం విచారకరమన్నారు. మావోయిస్టులపై జరుగు తున్న ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# గర్భాయశయ కేన్సర్‌కు యేటా 3.50 లక్షల మంది మహిళలు మృతి

## హెచ్‌పివి వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నా కట్టడికాని వైరస్

## ప్రతి రెండు నిమిషాలకు ప్రపంచంలో ఇద్దరు మహిళలు చనిపోతున్నట్లు అంచనా..



**న్యూఢిల్లీ, నవంబరు 18:** క్యాన్సర్ వ్యాధుల్లో అత్యంత ఎక్కువగా వ్యాపిస్తున్న సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి కారణంగా యేటా ప్రపంచ వ్యాప్తంగా 3.50 లక్షలమంది చనిపోతున్నారు. ఈ మహమ్మారిని నియంత్రించి కట్టడి చేసేందుకు హెచ్‌పివి వ్యాక్సిన్‌లు అమలులోకి వచ్చినప్పటికీ ఏటా ఈ వ్యాధి బారిన పడుతున్నవారు, మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలను ఈ క్యాన్సర్ మహమ్మారి పట్టిపీడిస్తోంది. 2018 లోనే ఈ వ్యాధి నిర్మూలనకోసం ప్రపంచ గర్భాశయ కేన్సర్ నిర్మూలన దినోత్సవాన్ని ప్రకటించినట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అథనామ్ గేబ్రియేసస్ ప్రకటించారు. అనేక దేశాలు ఇపుడు హెచ్‌పివి వ్యాక్సినేషన్‌కు ప్రాధాన్యతనిస్తున్నాయని, పాప్‌స్మియర్ పరీక్షలతో వీటిని గుర్తించేవీలున్నందున మహిళల్లో కూడా చైతన్యం అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

భవిష్యత్తులో సర్వైకల్ కేన్సర్ రహిత ప్రపంచాన్ని సృష్టించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు చికిత్సలో వినియోగించే హెచ్‌పివి వ్యాక్సిన్ నిజానికి మానవాళిలో వచ్చే పాపిల్లోమా వైరస్‌ను కట్టడిచేస్తుంది. ఈ వైరస్‌వల్లనే సర్వైకల్ క్యాన్సర్ వస్తుందని తేలింది. ప్రతి వెయ్యిమంది వ్యాక్సినేషన్ చేసిన చిన్నారల్లో 17.4 మంది చనిపోతున్నారు. వ్యాక్సిన్ ఊటమి గావి ప్రకటించిన తర్వాత 2025 చివరి నాటికి 8.6 కోట్లమంది చిన్నారులకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు చెప్పారు. భారత్‌లో కూడా 2023-24లో 80వేలకు పైగా సర్వైకల్ క్యాన్సర్ కేసులు గుర్తించారు. కేంద్ర బడ్జెట్‌లో దశల వారీగా వ్యాక్సిన్ కోసం నిధులు కూడా కేటాయించారు. జాతీయ సాంకేతిక సలహాగ్రూప్ సార్వత్రిక వ్యాధినరోధక కమిటీ (ఎన్‌ట్యాగీ) సిఫారసులను అనుసరించి 9-14 ఏళ్లమద్యవసున్న బాలికలకు హెచ్‌పివి వాక్సినేషన్‌ను చేయించాలని నిర్ణయించినట్లు భారత్ ప్రకటించింది. హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను సార్వత్రిక వ్యాధినిరోధక టీకా కార్యక్రమంలో చేర్చారు. సిక్కిం, బీహార్‌లలో మాత్రమే ఈ వ్యాక్సినేషన్ ప్రారంభించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఈ వ్యాక్సినేషన్ చేయాలనినిర్ణఇంచారు. ఈ వ్యాక్సిన్ వేయడంవల్ల సుమారు పదిలక్షలమందిని మృత్యువుబారినుంచి తప్పించగలిగినట్లు డబ్ల్యుహెచ్‌ఒ వెల్లడించింది. అంతేకాకుండా 8.6 కోట్లమంది బాలికలు ఈ మహమ్మారి బారినపడకుండా రక్షించగలిగామని చెపుతోంది.

వ్యాక్సిన్ కూటమి డబ్ల్యుహెచ్‌ఒ, యునిసెఫ్, ప్రపంచ బ్యాంకు, వ్యాక్సిన్ తయారీ పరిశ్రమలు, టెక్నికల్ ఏజెన్సీలు, సివిల్‌సొసైటీ, గేట్స్ ఫౌండేషన్ ఇతర ప్రైవేటు రంగ భాగస్వాముల సాయం తీసుకోవడంద్వారా విస్తృత కార్యా చరణను అమలుచేయవచ్చని డబ్ల్యుహెచ్‌ఒ సూచించింది. వ్యాక్సిన్ కూటమి గావి సిఇఒ డా.సానియా నిష్తర్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిల గర్భాశయ కేన్సర్‌వల్లనే చనిపోతున్నట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు.

# అయ్యప్ప దర్శనానికి 16 గంటలు సమయం

## క్యూలైన్లలో పెరుగుతున్న రద్దీ

## దర్శనం కోసం 2 లక్షల మందికిపైగా భక్తులు

**తిరువనంతపురం, నవంబరు 18:** కేరళ పవిత్ర పుణ్యక్షేత్రం శబరిమలైకు భక్తులు పోటెత్తారు. సుమారు రెండులక్షలమందికిపైగాభక్తులు ఇపుడు శబరిమలైలో అయ్యప్ప దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. మంగళవారం నాటికి దర్శనానికి 16 గంటలు సమయం పడుతోంది. కిలోమీటర్లమేర భక్తులు పడిగాపులు కాస్తున్నట్లు తేలింది. ఆన్‌లైన్ స్లాట్‌లో 70 వేలటికెట్లను విడుదలచేసారు. ఆఫ్‌లైన్‌లో మరో పాతికవేలమందికి అవకాశం ఇచ్చారు. అయితే రెండులక్షలమందికిపైగా ప్రస్తుతం శబరిమలైలో అయ్యప్పభక్తులు స్వామి దర్శనార్థం ఎదురుచూపులు చూస్తున్నారు. తాగడానికి కనీసం నీళ్లు తినడానికిఆహారం లేకుండా గంటల తరబడి క్యూలైన్‌లో ఉండటంతో కొందరు భక్తులు సొమ్మసిల్లి పడిపోతున్నారు. క్యూలైన్లవద్ద ఎక్కడా కూడా ఆలయ సిబ్బంది, పోలీసులు కనిపించడంలేదు. ఎక్కడ తోపులాట జరుగుతుందోనని భక్తులు భయపడిపోతున్నారు. తెలుగురాష్ట్రాలనుంచే అత్యధికంగా భక్తులు శబరిమలైకు చేరారు. ఆలయ అధికారులు కనీస ఏర్పాట్లుచేయలేదని భక్తులు నిరసన తెలుపుతున్నారు. ముందురోజు రికార్డుస్థాయిలో 1.25 లక్షలమంది భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. స్పాట్ బుకింగ్‌కారణంగానే రద్దీ పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు టిడిబి అధికారులు చెపుతున్నారు. నీలక్కల్,పంపాబేస్, శబరిమలై సన్నిధానం మొత్తం క్రిక్కిరిసిపోయింది. ఇసుకవేస్తే రాలనంతగా భక్తులు కనిపించారు.

# ఎసిబి వలలో చిక్కిన టేక్మాల్ ఎస్ఐ

## రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడడంతో బిల్డింగ్‌పై నుంచి దూకి పరుగులు




టేక్మాల్ ఎస్ఐ రాజేష్

**టేక్మాల్, నవంబరు 18, ప్రభాతవార్త:** అవినీతి నిరోధక శాఖకు మెదక్ జిల్లా టేక్మాల్ ఎస్సై రాజేష్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంగళవారం టేక్మాల్ మండల పరిధిలోని హసన్ మహమ్మద్‌పల్లిలో హార్వెస్టర్ బ్యాటరీ చోరీ ఘటనలో కేసు మాఫీ విషయంలో రూ.50వేల లంచం తీసుకుంటూ టేక్మాల్ ఎస్సై ఎసిబికి పట్టుబడ్డారు. మెదక్ అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ సుదర్శన్ మాట్లా డుతూ వరి కోత యంత్రం బ్యాటరీ టూల్‌బాక్స్‌ల దొంగతనం జరిగిందని ఆ కేసు మాఫీ విషయంలో ఈనెల 13న టేక్మాల్ ఎస్ఐ లంచం డిమాండ్ చేసినట్లు ఓ ఫిర్యాదు వచ్చిందన్నారు. ఈ మేరకు ఎసిబి పోలీసులు రంగ ప్రవేశం చేసి విచారణ ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాజేష్‌కు బాధితుడు పాండునాయక్ రూ.30 వేలను అందజేస్తున్న క్రమంలో అవినీతి శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే వారి నుంచి తప్పించుకునేందుకు రాజేష్ పోలీస్‌స్టేషన్ భవనం పైనుంచి దూకి స్టేషన్ గోడదూకి పారిపోయాడు. అవినీతి ఎస్సై ఎసిబికి దొరకడంతో టేక్మాల్ మండల ప్రజలు పోలీస్ స్టేషన్ ముందు టపాసులు పేల్చి సంబరాలు చేసుకోవడం గమనార్హం.

# డిజిటల్ విశ్వవిద్యాలయంగా అంబేద్కర్ వర్సిటీ

## సిఎం సమక్షంలో బిఆర్ఎఒయు-సిఒఎల్ ఒప్పందం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 18, ప్రభాతవార్త:** కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ విద్యారంగంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం(బీఆర్ ఏఓయూ) మరో కీలక అడుగు వేసింది. ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ (ఐడియా)ను స్థాపించడానికి కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సీఓఎల్)తో అవగాహన ఒప్పందం చేసుకొంది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు, సీఈఓ ప్రొఫెసర్ పీటర్ స్కాట్ మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో సంతకం చేశారు. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి ఐడియా అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేయనుంది. టెక్నాలజీ ఎనేబుల్డ్ లెర్నింగ్, కృతిమ మేధస్సులో మైక్రోక్రెడెన్షియల్స్ ద్వారా ఫ్యాకల్టీ అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బ్లూప్రింట్‌ను రూపొందించడం, వర్చువల్ ల్యాబ్ లకు మద్దతు, ప్రాంతీయ డిజిటల్‌లెర్నింగ్ కన్సార్టియం తదితర అంశాలు ఇక్కడికి రానున్నాయి. తెలంగాణలో విద్యా ఆవిష్కరణలకు ఇది మార్గదర్శిగా ఉంటుందని ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. సీఓఎల్ మద్దతుతో భారతదేశ డిజిటల్ విద్యా ఉద్యమానికి నాయకత్వం వహించడానికి బీఆర్ఏఓయూ సిద్ధం అవుతోందని ఆయన స్పష్టం చేశారు. వర్సిటీలో ఏఐ ఆధారిత డిజిటల్ ల్యాబ్స్ ఏర్పాటు, సమగ్ర లెర్నింగ్ మెనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్ఎంఎస్) అభివృద్ధి, విద్యార్థుల ప్రాక్టికల్ అనుభవాన్ని



సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న విసి ప్రొఫెసర్ చక్రపాణి, ప్రొఫెసర్ పీటర్ స్కాట్, చిత్రంలో కేశవరావు ఉన్నారు

పెంపొందించడానికి వర్చువల్ ల్యాబ్స్ రూపకల్పన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ పెడగోగీలో భారీ స్థాయిలో ఫ్యాకల్టీ శిక్షణా కార్యక్రమాలు, తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల కోసం ఏకరీతి డిజిటల్ సౌకర్యాల ప్రామాణీకరణ, ఉద్యోగావకాశాలకు అనుగుణంగా మైక్రో-క్రెడెన్షియల్స్, తాజా నైపుణ్య కోర్సులు రూపకల్పన అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రొఫెసర్ పీటర్ స్కాట్ మాట్లాడుతూ కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్, ఓపెన్ లెర్నింగ్, టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను విస్తృతం చేయడానికి తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. కేరళ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జగతిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ భాగ స్వా మ్యం దేశంలోని అన్ని డిజిటల్ యూనివర్సిటీలకు మార్గదర్శక మన్నారు. ప్రభుత్వ సలహాదారు డా. కే. కేశవ రావు, వర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ ప్రొపె సర్ పుష్పచక్రపాణి, ప్రొఫెసర్ రవీంద్రనాథ్, ప్రొఫెసర్ పల్లవి, ప్రొపె సర్ ఆనంద్ పవార్, రిజిస్ట్రార్ డా. ఎల్.వి.కె. రెడ్డి తదితర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వర్సిటీ ఉపకులపతిని అభినందిస్తూ, హైదరా బాదుకు ప్రపంచస్థాయి విద్యా సదుపా యాన్ని తీసుకురావడంలో చేసినయత్నాన్ని ప్రశంసించారు.

# 'మోడీస్ మిషన్' పుస్తక రచయిత ప్రధాని మోడీతో భేటీ!

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ప్రధానిమోడీ వ్యక్తిగత చరిత్రకు సంబంధించి ఆయన చేపట్టిన విధివిధానాలపై ప్రముఖ రచయి బెర్జిస్‌దేశాయి వెలువరించిన మోడీస్ మిషన్ పుస్తకాన్ని ప్రధానికి బహూకరించారు. ఈ సందర్భంగా మోడీ తన సోషల్‌మీడియా ఖాతాలో స్పందించారు. గతనెలలోనే ఈ పుస్తకాన్ని ముంబయిలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, డిప్యూటిసిఎం ఏక్‌నాథ్ షిండే, మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్‌ల సమక్షంలో విడుదల చేసారు. అసాధ్యమైన నిర్ణయాలు తీసుకుని సుసాధ్యంచేసిన వ్యక్తి నరేంద్ర మోడీ అని ఈసందర్భంగా మహారాష్ట్ర గవర్నర్ ప్రధానిమోడీని ప్రశంసించారు. ప్రధానిమోడీ జీవితాన్ని మాత్రమేకాకుండా ఒక వ్యక్తి విలువలు, ఆత్మనిర్భరత, దేశ అభివృద్ధి, జాతి పునర్నిర్మాణానికి చేస్తున్న కృషి ఉన్నత విలువలకు అద్దంపడుతుందని అన్నారు. ఆనాటి వేదికపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండేలు కూడా మోడీ జీవనశైలిని ప్రశంసించారు. పుస్తకాన్ని విడుదలచేసిన తర్వాత రచయిత బెర్జిస్‌దేశాయి ప్రధానిమోడీని మర్యాదపూర్వకంగా మంగళవారం కలుసుకున్నారు.




# అల్‌ఫలా వర్సిటీ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

## వర్సిటీ కేంద్రాలపై ఇడి ఆకస్మిక సోదాలు

**ఫరీదాబాద్, నవంబరు 18:** దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనపై అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎర్రకోట కారు పేలుడు కేసు దర్యాప్తు ముఖ్యంగా అల్ ఫలాహ్ యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నది. అందులో పనిచేస్తున్న పలువురు వైద్యులు ఢిల్లీ పేలుడు కేసులో అరెస్టైన విషయం తెలిసిందే. దాడి ప్లాన్ వెనుక వారి హస్తం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో దర్యాప్తు అధికారులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇక అరెస్టైన వైద్యులంతా హర్యానాలోని అల్‌ఫలాహ్ విశ్వవిద్యాలయానికి చెందిన వారు కావడంతో ఈ కేసు దర్యాప్తు వర్సిటీ చుట్టే తిరుగుతోంది. ఈ వర్సిటీ ఉగ్రకార్యకలాపాలకు అడ్డా అంటూ ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇక దర్యాప్తులో భాగంగా అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయ నిధులపై అధికారులు దర్యాప్తు ముమ్మురం చేశారు. ఇందులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మంగళవారంఉదయం ఢిల్లీ సహా దాదాపు 25 ప్రదేశాల్లో దాడులు చేశారు. ఓఖ్లాలోని అల్ ఫలాహ్ వర్సిటీ ఆఫీస్, యూనివర్సిటీ ట్రస్టీలు, సంబంధిత వ్యక్తులు, వర్సిటీకి సంబంధం ఉన్న సంస్థల్లో సోదాలు చేపట్టారు. విశ్వవిద్యాలయం నిధులపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వ ఆదేశాలతో ఈడీ ఈ మేరకు సోదాలు చేపట్టింది. విశ్వవిద్యాలయానికి అందుతున్న నిధులు, వాటి మూలాలపై దర్యాప్తును షురూ చేసారు.

# ప్రభాకర్‌రావుకు సుప్రీంలో మరోసారి ఊరట

## డిసెంబరు 9 వరకు మధ్యంతర బెయిల్ మరోసారి పొడిగింపు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో మలుపు

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టులో మరోసారి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు ఇంతకు ముందు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను సర్వోన్నత న్యాయస్థానం పొడిగించింది. ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో మంగళవారం వాద నలు జరిగాయి. ప్రభాకర్ రావుకు ఇచ్చిన మధ్యంతర బె యిల్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా, అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహాతా వాదనలు వినిపిస్తూ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు పోలీసుల విచారణకు సహ కరించడం లేదని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన మొదటి ముద్దాయిగా వున్నారని, ట్యాపింగ్‌కు సంబంధించిన అన్ని ఆధారాలను ఆయ న ధ్వంసం చేశారని, పోలీసు అధికారిగా తనకున్న అధికారాలను దుర్వినియోగం చేశారని, సహచర పోలీసు అధికారులచేత కాని పనులు చేయించా రని, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలో అన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయని వారు సుప్రీం కోర్టుకు తెలిపారు.

అప్పట్లో రాజకీయ నేతలే కాకుండా జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్‌లను కూడా ట్యాపింగ్ చేశారని వారు వాదించారు. సుప్రీం కోర్టులో లభించిన మధ్యంతర బెయిల్‌ను ఆయన దుర్వినియోగం చేశారని, దీనిని వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. దీనిపై ప్రభాకర్ రావు తరపున వాదించిన న్యాయవాది ఫోన్ ట్యాపింగ్ కేసులో తన క్లయిం ట్ పాత్ర ఏమీ లేకున్నా పోలీసులు అనవసరంగా ఇరికించారని తెలిపారు.

ఇప్పటికే అనేకసార్లు ప్రభాకర్ రావు సిట్ ఎదుట విచారణకు హాజరయ్యా రని, పోలీసులు గంటల తరబడి అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చారని, పొంతనలేని ప్రశ్నలు అడిగినా ఆయన ఓపికగా జవాబులు ఇచ్చారని ఆయన తెలిపారు.

ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీం కోర్టు ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను డిసెంబరు తొమ్మిదవ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు ప్రభాకర్ రావుకు వున్న మధ్యంతర బెయిల్‌ను పొడిగించిచడంతో పాటు ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదే సమయంలో పోలీసుల విచారణకు ప్రభాకర్ రావు సహకరించాలని, ఆయనను పోలీసులు విచారించుకోవచ్చని ఆదే శించింది.

# రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన సర్వేయర్, చైన్‌మన్

# సికిందరాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 18, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్ కిరణ్, చైన్‌మెన్ భాస్కర్లను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంపై డిమార్కేషన్ చేయకుండా ఉండేందుకు లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డిఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ మండల పరిధిలోని మినిస్టర్ రోడ్ లోని ఓ స్థలం పార్కు స్థలమో కాదో సర్వే చేసి చెప్పాలంటూ జీహెచ్ఎంసీ అధికారులు మండల సర్వేయర్ కాలువ కిరణ్ కు సూచించారు. ఈ స్థలాన్ని ఫిర్యాదు దారుడు హోటల్ కు లీజుకు ఇచ్చాడు. దీంతో సర్వేయర్ కిరణ్ ఫిర్యాదు దారుడు వద్దకు వెళ్లి ఈ స్థలం సరిహద్దు విభజన సర్వే చేయాల్సి ఉందని, తనకు జీహెచ్ఎంసీ అధికారులు సూచించారంటూ యజమానికి తెలిపాడు. తాను సర్వే చేయకుండా కోర్టు కేసు ఉందని, జీహెచ్ఎంసీ అధికారులకు చెబుతానని, దానికి గాను తనకు 3లక్షలు ఇవ్వాలని సర్వేయర్ డిమాండ్ చేసాడు. తాను అంత మొత్తం ఇచ్చుకోలేనని చెప్పడంతో రెండు లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. మంగళవారం సాయంత్రం ఆ వ్యక్తి తాను డబ్బు తీసుకుని వచ్చానని చెప్పగా కారులో ఉండండి నేను వేరొకరిని పంపిస్తానని కిరణ్ వారికి చెప్పాడు. కిరణ్ అప్పటికే నిజామాబాద్ వెళ్లేందుకు బోయిన్ పల్లి బస్టాప్ వరకు వెళ్లిపోగా ఏసీబీ అధికారులు అతన్ని వెంబడించారు. డబ్బు తీసుకునేందుకు చైన్‌మెన్ మేకల భాస్కర్ వచ్చి డబ్బు తీసుకుని జేబులో పెట్టుకుని వెళుతుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సర్వేయర్ కిరణ్ సూచన మేరకే తాను డబ్బు తీసుకున్నానని అతను ఏసీబీ అధికారులకు చెప్పాడు. అప్పటికే కిరణ్‌ని వెంబడిస్తూ వెళ్లిన మరో బృందం ఆయనను అదుపులోకి తీసుకుంది. ఇద్దరినీ అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. అలాగే నిజామాబాద్‌లోని కిరణ్ నివాసంలో కూడా మరో బృందం సోదాలు జరుపుతుంది. నిందితులు ఇద్ద రూ అయ్యప్ప మాల ధారణలో ఉండి కూడా లంచం తీసుకోవడం గమనార్హం.

# సంగారెడ్డి జిల్లాలో రైసు మిల్లులపై విజిలెన్స్ దాడులు

## నల్లబజారుకు తరలించిన రూ.10.24 కోట్ల సిఎంఆర్ ధాన్యం

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్సపురం యూనిట్ సంగారెడ్డి జిల్లాలోని కడ్పల్ గ్రామంలోని స్రామాట్ ఫుడ్ ఇండస్ట్రీ, మార్డీ గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రోస్ ఇండస్ట్రీస్‌లో సోమ వారం అర్ధరాత్రి వరకు తనిఖీలు నిర్వహించి రూ.10,24,23,777 విలువ కలిగిన సిఎంఆర్ ధాన్యం అక్రమంగా నల్లబజారుకు తరలించారని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తెలంగాణ డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో ఆర్‌సిపురం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ సంగారెడ్డి జిల్లా, సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామం లోని స్రామాట్ ఫుడ్ ఇండస్ట్రీస్ లో సోమవారం అర్ధరాత్రి నుంచి న ఆకస్మిక తనిఖీ సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి నిర్వహించి కస్టమ్ మిల్లింగ్ కోసం రబీ, ఖరీఫ్ 2024-24లో ఇచ్చిన 40,834.98 క్వింటాళ్ల ధాన్యం మళ్ళించారని గుర్తించారు. మిల్లులో ఉండాల్సిన బస్తాల కంటే 1,02,087 బస్తాలు నిల్వ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.9,47,37,153 ఉంటుందని వివరించారు. రెండో నిఘా బృందం కల్హేర్ మండలం, మార్డి గ్రామం లోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేశారు. అక్కడ ఖరీఫ్ 2024-25 సీజన్‌కు సంబంధించిన 3313 క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యం 8283 బస్తాలు నిల్వ తక్కువగా ఉన్నట్లు కనుగొన్నారు. దీని విలువ సుమారు రూ.76,86,624 ఉంటుందని తెలిపారు. మిల్లర్‌పై తదుపరి చర్యలు ప్రారంభించేందుకు సంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల అధికారులకు మెమో జారీ చేశారు.

# టిజి టెట్-2026పై టి-శాట్‌లో ప్రత్యేక ప్రసారాలు

## 44 రోజులు 200 ఎపిసోడ్స్ డిజిటల్ కంటెంట్ ప్రసారాలు

## పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2026 నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో టీజీ టెట్-2026కి సంబంధించిన ప్రత్యేక ప్రసారాలను టి-సాట్ ప్రసారం చేయనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం సచివాలయంలో టి-సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నాణ్యమైన కంటెంట్ అందిస్తున్న టి-సాట్‌ను అభినందించారు. ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్షకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలని సూచించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి-సాట్ నెట్‌వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్య ర్థులకు ఉపయోగపడుతుందని మంత్రి గుర్తుచేశారు. గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్-2026 పరీక్ష కోసం టి-సాట్ నెట్‌వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు మెరుగైన వసతు ల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేశారన్నారు.

కేంద్ర గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడికీ తప్పనిసరి అయిన నేపథ్యంలో టెట్‌కు హాజరయ్యే అభ్య ర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక కం టెంట్ అందిస్తున్నామని సీఈవో తెలిపారు. ప్రభు త్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్‌తోపాటు 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్‌లో సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయన్నారు. టెట్‌కు అవసరమైన సబ్జెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్‌తోపాటు ఇంగ్లీష్, తెలుగు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమవుతాయన్నారు. టెట్ పేపర్-1, 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టి-సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి నిరుద్యోగ అభ్యర్థులకు సూచించారు. టెట్ అర్హత పరీక్ష కోసం టి-సాట్ నెట్‌వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టి-సాట్ శాటిలైట్ ఛానళ్లతోపాటు, టి-సాట్ యాప్, యూట్యూబ్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

# జిఓ 317 ఉపాధ్యాయ బదలీ దరఖాస్తులు 6,500

## అర్హత కలిగినవి 3,700

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 317 జీఓతో బదలీ అయి.. నష్టపోయిన ఉపాధ్యాయులకి తాత్కాలికంగా డిప్యూటేషన్ పేరుతో బదలీలను చేపట్టాలని భావించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను అక్టోబర్ 26 వరకు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా 317 జీఓ ద్వారా బదలీ అయిన ఉపాధ్యాయుల నుంచి తాత్కాలిక బదిలీ(డిప్యుటేషన్) కోసం సుమారు 6,500 దరఖాస్తులు అందినట్టు తెలిసింది. వచ్చిన దరఖాస్తులను ఆయా డీఈఓలు పరిశీలించగా.. వచ్చిన దరఖాస్తుల్లో సుమారు 3700 వరకు అర్హత కలిగిన దరఖాస్తు లున్నట్టు అధికారులు గుర్తించారు. బదిలీల్లో స్పౌజ్, మ్యుచివల్ తదితర కేటగిరీల కింద లబ్ధిపొందిన వారు, 2021లో 317 జీఓ జారీ చేసిన అనంతరం పదోన్నతులు పొందిన వారు తాత్కాలిక బదిలీకి అనర్హులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అర్హత పొందిన దరఖాస్తులను పరిశీ లించి ఉమ్మడి జిల్లాలో వారు కోరుకున్న జిల్లా పరిధిలో ఖాళీల ఆధారంగా తాత్కాలిక బదిలీకి ఆదేశాలను వారం 10రోజుల్లో జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పుడు చేయనున్న బదలీల్లో గరిష్ఠంగా మూడేళ్లపాటే బదలీ చేస్తారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.
PUB/1453
ఇ-టెండర్ ఆహ్వానిస్తూ ప్రకటన (https://ireps.gov.in ద్వారా)
భారత రాష్ట్రపతి తరపున CE/C-IV/SC నిర్మాణ సంస్థ, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు ఈక్రింది పనులకు ఇ-టెండరు ఆహ్వానిస్తున్నారు.
క్ర.సం. 1. టెండర్ ఆహ్వానిస్తూ ప్రకటన నం: 29-CAO-C-SC-2025 తేది : 11.11.2025. పనిపేరు: దక్షిణ మధ్య రైల్వే కన్‌స్ట్రక్షన్-విజయవాడ డివిజన్: SW : 1. రాయనపాడు మరియు విజయవాడ స్టేషన్ మధ్యలో LC No.150 బదులుగా కొత్త రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదన. SW : 2. గొల్లప్రోలు యార్డు దగ్గర LC No.433 బదులుగా కొత్త రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదన. SW : 3. తుని మరియు గుల్లిపాడు స్టేషన్ మధ్యలో LC No.450 బదులుగా కొత్త రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదన. SW : 4. LC No.433 (గొల్లప్రోలు యార్డు దగ్గర) వద్ద మరియు LC No.450 (తుని మరియు గుల్లిపాడు మధ్య) వద్ద పబ్లిక్ క్రాసింగ్ కొరకు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి (FOB) నిర్మాణ ప్రతిపాదన-సంబంధించి.
వివరాలు : అంచనా ధర: రూ. 187,94,88,437.24. బయానా: రూ. 95,47,500.00. పూర్తి చేయు కాలం : 24 (ఇరవై నాలుగు) నెలలు. తెరచు తేదీ: 04.12.2025, 15:00గం.లు.
i) బిడ్ డాక్యుమెంట్ కొరకు మరియు ఇతర వివరాలకు దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.inకు లాగిన్ అవ్వండి.
ii) టెండర్ ముగింపుకు ముందు పీరియడ్ పదిహేను రోజులు టెండర్ దాఖలు పీరియడ్‌లో టెండర్‌దారులు వారి ఆఫర్‌లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చును.
iii) టెండర్‌దారులు టెండర్‌దాఖలు కాలం యొక్క ప్రారంభం యొక్క తేదీ వరకు ఏవైనా సవరణకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ అయినవి) పరిశీలించుకొనవలెను.
చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, (కన్‌స్ట్రక్షన్), సికింద్రాబాద్.
A1848
తదుపరి టెండరు నిబంధనలు /వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

వార్త

సరిదిద్దకుండా వదిలేసిన తప్పులను మించిన ఆపదలు మరేమీ ఉండవు.

-స్వామి వివేకానంద

# సౌదీలో చిదిమేసిన రోడ్డు ప్రమాదం!

అవాంఛనీయ సంఘటనలు, అనుకోని దుర్ఘటనలు ఎదురైతే ఇక మిగిలేది శోకమే. ప్రమాదాలు జరిగి కుటుంబ సభ్యులు యావత్తూ మరణించినా, ఆ కుటుంబానికి సాన్నిహిత్యమున్న వారు మరణించినా ఇంటిల్లిపాదీ శోకసముద్రంలో మునిగిపోతే ఆ సన్నివేశాలు గమనించిన వారెవరికైనా హృదయం ద్రవించక మానదు. సంఘటన స్థలం సౌదీ అరేబియా. మక్కా నుంచి మదీనా మార్గమధ్యంలో ముషహరత్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి 1.30 ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సొకటి 45 మంది ప్రయాణికులను పొట్టన పెట్టుకుంది. ఆ ప్రమాదంలో వారంతా అగ్నికీలలకు సజీవ దహనమయ్యారు. వారిలో ఇద్దరు కర్ణాటక వాసులూ మృత్యువాతపడ్డారు. ప్రయాణికులందరూ భారతీయులే. అదీ ముఖ్యంగా దాదాపు అందరూ మక్కా యాత్రికులే. దైవ సన్నిధానికి వచ్చిన వారు తాము తొక్కిసలాటలో చనిపోతామనో, తాము ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదాలకు గురవుతుందనో అనుకుని బయలుదేరరు. అపశకునం మాటలు మాట్లాడుకోకుండా ఆ దైవం దివ్యానుగ్రహంతో తీర్థయాత్రలకు శ్రీకారం చుడతారు. కానీ విధి మరోలా జీవితాలతో ఆటలాడుకుంటోంది. భక్తి భావం నిండుగా గుడులు, గోపురాలు, మసీదులకు వెళ్తే అక్కడ అనుకోని తొక్కిసలాటలు ఎదురు చూస్తుంటాము. పరాయివ్యక్తిని నమ్మితే మోసం కాటేస్తుంది. ఎన్నో ఆధునిక సాంకేతిక వనరులు అందుబాటులో ఉన్నా అప్రమత్తంగా ఉన్నా, అనుకోని అవాంతరాలు, అంతరాయాలు, చివరికి ఎలా వెళ్లి ఎలా ఇళ్లు చేరుతామో అంచనాకందదు. అయినా అనుకున్నట్లుగా అంతా జరుగదు. సౌదీ దుర్ఘటనలో బుగ్గిపాలైన వారి మృతదేహాలు గుర్తుపట్టేందుకు కూడా మిగల్లేదు. వారిని గుర్తించాలంటే డిఎన్ఎ టెస్టుల వల్లే సాధ్యం. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఉమ్రా యాత్రకు హైదరాబాద్ నుంచి 54 మంది బయలుదేరారు. వారిలో 8 మంది అదృష్ట వశాత్తూ మక్కాలో ఆగిపోయారు. అదే వారికి అదృష్టానికి దారి చూపింది. బస్సు ఎక్కలేకపోయారు. వారు మాత్రమే సురక్షితంగా ఉన్నారు. బస్సెక్కిన వారంతా మృతజీవులే. ఒక్కరంటే ఒక్కడే మృత్యుంజయుడిగా మిగిలారు. చెప్పాలంటే హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తమ మూడుతరాల వ్యక్తుల్ని కోల్పోయింది. ఆ ఇంటి పెద్ద నసీరుద్దీన్, ఆయన భార్యతో సహా 8 మంది పెద్దలు, పది మంది మనవలు, మనవరాళ్లు దుర్మరణం పాలయ్యారు. చితిలో భస్మాన్ని డిఎన్ఎకి పంపిన తర్వాతే వారెవరో గుర్తించగలిగేది. ఇలా ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడం అత్యంత విషాదకర సంఘటన. ఎవరికైనా మనసు కలచివేస్తుంది. మక్కా యాత్రే తమ అంతిమ ఆఖరి మజిలీయని వారు అనుకొని ఉండరు. ఈ మధ్యకాలంలో తొక్కిసలాటలు, అగ్నిప్రమాదాలు, ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అప్పుడే కలికాలం వచ్చేసిందనుకునే రోజుల్ని చూస్తున్నాము. అందుకే ఎన్నడూలేని దుస్సంఘటనలను ప్రతిరోజూ చూస్తున్నామా? అనిపిస్తుంది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, అతివేగం ప్రమాదకరమని అన్నివేళలా హెచ్చరిస్తూనే ఉన్నా జరుగరాని విషాదాలు జరిగిపోతూనే ఉన్నాయి. భారతదేశంలో జరిగే ప్రమాదాలకే మనం బెంబేలెత్తిపోతున్నాం. అతివేగం, అమిత నిర్లక్ష్యం పేరిట ఇచ్చే నినాదాలు వ్యర్థమైపోతున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి ప్రయాణాల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగేవి నడిరోడ్డు మీదనే, చీకటిలోనే. ఆ సమయానికి బస్సుల్లో ప్రయాణికులు గాఢ నిద్రలోనే ఉంటారు. నిద్రలోనే గాల్లో కలిసిపోయే ప్రయాణికులు ప్రాణాలు ఎన్నో. భారత కాలమానం ప్రకారం సౌదీలో ప్రమాదం జరిగిన సమయం సోమవారం తెల్లవారుఝాము. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొని బస్సుకు నిప్పంటుకోగానే బస్సులోని 45 మంది అగ్నికి ఆహుతయ్యారు. ఆ సమయానికి అందరూ నిద్రలోనే ఉన్నారు. 2019లో ఒకబస్సు మరో భారీ వాహనాన్ని ఢీకొని 35మంది, 2023 నుంచి మక్కా నుంచి వెళ్తున్న మరో బస్సు బ్రిడ్జిని ఢీకొట్టగా మంటలో చిక్కుకోగా 20 మంది మృత్యువాతపడ్డారు. నెలరోజుల క్రితం కర్నూలు శివారుల్లో ప్రైవేటు బస్సు మోటారు సైకిల్‌ను ఢీకొనగాగా రేగిన అగ్ని జ్వాలాలలకు ప్రయాణికులు పూర్తిగా దగ్గమయ్యారు. 15 రోజుల్నాడు చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని మరచిపోలేము. బస్సు డ్రైవర్ ఏమరుపాటుగా ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని విశ్లేషిస్తున్నా అతనిప్పుడు బతికిలేడు. కనుక నిజాలు తెలియవు. నిజానికి భారతీయ రోడ్లపై ప్రమాదాలకు, సౌదీలో రోడ్లకు మధ్య జరుగుతున్న ప్రమాదాలను విశ్లేషించాలంటే సాపత్యం ఉండదు. ఒకసారి ఆ ప్రాంతానికి వెళ్లిన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ చెబుతున్న దానిని బట్టి మక్కాలో బస్సులు, కార్లు గంటకు 180కి.మీ వేగంలో వెళ్తుంటాయి. అదే నిజమైతే అతివేగం నుంచి కట్టడి సాధ్యం కాదేమో. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ఏ దేశంలోనైనా అతివేగాన్ని అరికట్టడం అత్యంత అవసరం. ప్రతి ముస్లిం తమ జీవితకాలంలో ఒకసారైనా మక్కా యాత్రకు వెళ్లిరావాలని తలపోస్తారు. ఈ యేడాది తెలంగాణ నుంచి 9వేల మందికిపైగా మక్కాకు బయలుదేరారు. నాలుగు ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు వారి ప్రయాణపు ఏర్పాట్లు చూసాయి అనీసజావుగానే జరిగాయి. కానీ ఊహించని ప్రమాదానికి విగత జీవులౌతారని ఎవరూ అనుకొని ఉండరు. అందులో ప్రయాణించిన వారు హైదరాబాద్‌లోని 8 కుటుంబాలకు చెందినవారు. కుటుంబ పెద్దలు కోల్పోయిన వారూ ఉన్నారు. అలాంటి కుటుంబాల ఆలనా పాలనా చూసుకునేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అవసరం.

> పేదరికం కారణంగా ఇంతవరకూ ఏ దేశం సమిసిపోలేదు. అవినీతి కారణంగానే దేశాలు నేలమట్టమయ్యాయి.



నాని పాల్కీవాలా

> ఓరిమికి అపారమైన శక్తి ఉంది. దండించే అధికారం ఉన్నా దండించకపోవడం నిజమైన ఓర్మి.



ఎమ్.కె.గాంధీ

# అసైన్డ్ భూములు కార్పొరేట్లకు అప్పగింత!

**రాష్ట్రంలోకార్పొరేట్, కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ముమ్మరం చేయచూస్తున్నారు. లీజుకి తీసుకున్న భూముల్లో తమ ఇష్టం వచ్చిన పంటలను కార్పొరేట్లు పండిస్తారు. ఫలితంగా ఆహార పంటల కొరత ఏర్పడుతుంది. ఏదేశమైనా, రాష్ట్రమైనా భూసంస్కరణలు అమలు జరపకుండా పారిశ్రామిక అభివృద్ధిని సాధించలేవు. రాష్ట్రంలో భూసంస్కరణల అమలు బూటకంగా మారి పేదలకుభూమి దక్కలేదు. భూసంబం ధాల్లో మౌలికమైన మార్పులు రాలేదు. పాలక ప్రభుత్వాలు పేదలకు భూములు పంచకుండా, అసైన్డ్ భూములు, నిషేధిత భూములు, చిన్న, సన్నకారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టే రాష్ట్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ, లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు, నిషేధిత 22ఎ భూములు, మిగులు భూములు, అటవీ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని గ్రామీణ పేదలు, పేద రైతులు ఉద్యమించాలి.**

బొల్లిముంతసాంబశివరావు

అసైన్డ్ చట్టసవరణకు చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. ఈ చట్టసవరణతో తమ భూములను రైతులు లీజుకి ఇచ్చుకోవచ్చని, లీజు ద్వారా 30నుంచి 40 వేలు పొందవచ్చని రైతాంగాన్ని మభ్యపెడుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ఇక నుంచి కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూములు కేటాయిస్తుంది. ఆయా కంపెనీలు రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రివర్గం నిర్ణయం ప్రకటించింది. ప్రైవేట్ కంపెనీలకు లీజుకు ఇచ్చేందుకు 26,43,500 ఎకరాలను గుర్తించారు. న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఇడిసిఎపి) రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేసే రూరల్ బోర్డు ద్వారా లీజు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పినవారు, విస్తరణ అవసరాలకు భూములు తీసుకోవచ్చని చెప్పింది. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లోనూ కంపెనీలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. కంపెనీలు ప్రైవేట్ భూములను లీజుకి తీసుకుని ఉంటే, ఆ భూ యజమానులు ప్రయోజనం పొందేలా విధివిధానాలు రూపొందించారు. లీజు కింద అసైన్డ్ రైతులు పొందినట్లే ఏడాదికి లీజు డబ్బులు పొందవచ్చు. కౌలుకి ఇచ్చిన రైతుకుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నిబంధనల్లో పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు నికర ఆదాయం వస్తుందని చెప్పటమంటే, రైతులను మోసగించడమే. అధికారం చేతులు మారకముందు నుంచి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన వ్యవసాయకూలీలు (వీరిలో ఎక్కువ మంది దళితులు ఉన్నారు), పేద రైతులు బంజరు, పోరంబోకు భూములు, సముద్ర తీర భూములు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఈభూములకు పట్టాలు ఇవ్వాలని కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయకూలీ సంఘం అనేక ఆందోళనలు చేశాయి. ఆందోళనల ఫలితంగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూములకు డిపట్టాలు ఇవ్వటం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన కొన్ని భూములు వెంటనే సేద్యానికి అనుకూలంగా లేకపోవడంతో, అలాంటి భూములు అన్యాక్రాంతం అయ్యాయి. భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం బలంగా ముందుకు రావడంతో ఆనాటి ప్రభుత్వం 9/1977 లో అసైన్డ్ చట్టం చేయడం జరిగింది. ఈ చట్టంలో అసైన్డ్ భూములు అమ్మటం, కొనటం నేరం. అలా చేసినవారు శిక్షలకు గురౌతారు. అన్యాక్రాంతమైన భూమి తిరిగి గుర్తించడానికి ఇవ్వటం అలా కాని పక్షంలో అర్హులైన మరో లబ్ధిదారునికి ఇవ్వాలి. ఈచట్టం చేసిన తర్వాత కూడా కొందరు బడాబాబులు అసైన్డ్ భూములు కబ్జా చేయటం జరిగింది. 2002లో అసైన్డ్ భూములు అమ్ముకోవటానికి అవకాశం కల్పిస్తూ జీవో తీసుకువచ్చే ప్రయత్నం చేయగా తీవ్ర వ్యతిరేకత వల్ల ఉపసంహరించుకుంది. అసైన్డ్ ఉన్నా భూములు కబ్జాఅవుతున్నా, దాన్ని నివారించకుండా, రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ చట్టాన్ని సవరిస్తూ 2006లో ఆర్డినెన్స్ జారీచేసి శాసనసభ ఆమోదం పొందింది. చట్టంలోని 4వ సెక్షన్, బిక్లాజు సవరణ ద్వారా అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని తిరిగి పేదలకే ఇవ్వాలనే నిబంధన నుంచి మినహాయింపు పొంది అమ్మేహక్కు, ఇష్ట



మైనవారికి ఇచ్చే అధికారం ప్రభుత్వం పొందింది. ఈ చట్ట సవరణ పేదలను భూములకు దూరం చేయడమే కాకుండా సెజ్లకు కట్టబెట్టే చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూముల లెక్కలు తేల్చేందుకు జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తూ రెవిన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు రెవిన్యూ ప్రత్యేక కార్యదర్శి, ఏపీల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జీవో 104 జారీచేశారు. ఈ జిల్లా కమిటీకి ఇన్‌చార్జ్ మంత్రి చైర్మన్‌గా ఉంటాడు. జిల్లాకి చెందిన మంత్రులు సభ్యులుగా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారు. ఈక్రమంలో నిషేధిత 22ఎ జాబితా నుంచి తొలగించిన భూములు 13,59,000 ఎకరాలు ఉన్నాయని, ఇందులో 13,57,000 లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం వెరిఫై చేసిందని చెబుతున్నారు. నిషేధిత 22ఎ భూములంటే ప్రభుత్వ యాజమాన్యం, చట్టపరమైన వివాదాలు, సీలింగ్ పరిమితుల కారణాలవల్ల రిజిస్ట్రేషన్ కాకుండా నిషేధించబడిన భూములు. ఈభూములు అమ్మడం, కొనడం, రుణం కోసం తనకా పెట్టడం సాధ్యంకాదు. ఇవి రిజిస్ట్రేషన్ చేయబడవు. అలాంటి భూములను నిషేధం నుంచి తొలగించి వాటిని లీజుకి ఇచ్చుకోవచ్చని పేర్కొంది. అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైతే, ఆ భూములు తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకే పంపిణీ చేయాలి. కాని కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధమైన చర్యలు తీసుకుంది. అన్యాక్రాంతం పేరుతో అసైన్డ్ భూములను, నిషేధం నుంచి తొలగించిన 22ఎ భూములు 13.59,000 ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. కార్పొరేట్లకు ఆ భూములను 99 సంవత్సరాల లీజుకి ఇవ్వటం అంటే, శాశ్వతంగా భూములు వారికి కట్టబెట్టటమే. పేదలను భూములకు దూరం చేసి వారిని కూలీలుగా మార్చడమే. గతంలో చంద్రబాబు ప్రోద్బలంతో కుప్పంలో కాంట్రాక్ట్ వ్యవసాయానికిభూములు ఇచ్చిన రైతులకు వచ్చిన చేదు అనుభవాలు ఇంకా వారిని వెంటాడుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాగుకి యోగ్యమైన భూమి కోటి, లక్ష ఎకరాలు. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 37 శాతం ఉంది. సాగు యోగ్యంగాని భూమి మూడు లక్షల ఎకరాలు ఉంది. సాగు భూమి సేద్యం చేసేవారికి చెందాలి. దేశంలో, రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా సేద్యం చేయని పరాన్న బుక్కులైన భూస్వాముల వద్ద భూమి బంధించబడి ఉంది. 1973లో చేసిన భూసంస్కరణల చట్టం ద్వారా మిగులు భూమి 18 లక్షల ఎకరాలు. దాన్ని కుదింపులతో 7.9 లక్షలుగా తేల్చారు. అందులో 6.46 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 5.92 లక్షల ఎకరాలను 4లక్షల,79 వేలమందికి పంపిణీ చేసినట్లు పాలకులు లెక్కలు చెబుతున్నారు. దీన్ని గమనిస్తే భూసంస్కరణల చట్టం ఎంత బూటకంగా అమలు జరిగింది తెలుస్తున్నది. చంద్రబాబునాయుడు భూసంస్కరణలకు, చిన్న రైతుల వ్యవసాయానికి వ్యతిరేకం. వ్యవసాయం దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. దాన్ని ఆచరణలో పెట్టడానికే లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలుఅమలు చేస్తున్నారు. ఆ విధంగా రాష్ట్రంలో కార్పొరేట్, కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ముమ్మరం చేయ చూస్తున్నారు. లీజుకి తీసుకున్న భూముల్లో తమ ఇష్టం వచ్చిన పంటలను కార్పొరేట్లు పండిస్తారు. ఫలితంగా ఆహార పంటల కొరత ఏర్పడుతుంది. ఏదేశమైనా, రాష్ట్రమైనా భూసంస్కరణలు అమలు జరపకుండా పారిశ్రామిక అభివృద్ధిని సాధించలేవు. రాష్ట్రంలో భూసంస్కరణల అమలు బూటకంగా మారి పేదలకుభూమి దక్కలేదు. భూసంబంధాల్లో మౌలికమైన మార్పులురాలేదు. పాలక ప్రభుత్వాలు పేదలకు భూములు పంచకుండా, అసైన్డ్ భూములు, నిషేధిత భూములు, చిన్న, సన్నకారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టే రాష్ట్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ, లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు, నిషేధిత 22ఎ భూములు, మిగులు భూములు, అటవీ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని గ్రామీణ పేదలు, పేద రైతులు ఉద్యమించాలి. ●

# ఊబకాయులలో నానాటికీ పెరుగుతున్న గుండె జబ్బులు!


బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రపంచవ్యాప్తంగా గడిచిన నాలుగు దశాబ్దాల్లో ఊబకాయుల సంఖ్యరెట్టింపు అవుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. ఎందుకంటే ఇలా మానవాళి ఓ పద్ధతి పాడు లేకుండా ఇష్టానుసారం తమ ఒళ్లను పెంచుకుంటూ పోతేమాత్రం ప్రాణాంతకర వ్యాధులు అయిన గుండె జబ్బులు టైపు 2 డయాబెటీస్ బారిన పడే అవకాశాలు మూడు రెట్లు అధికం అని ఎంతో అనుభవాజ్ఞులు, తల పండిన డాక్టర్లు సైతం సెలవిస్తుండటాన్ని బట్టి స్థులకాయం అనేది మానవాళి జీవితాలను ఎంతటి ప్రమాదకర పరిస్థితులలోకి నెట్టి వేస్తున్నదో మనం ఇట్టే ఊహించవచ్చు. ముఖ్యంగా జంక్ ఫుడ్స్‌ను ఎక్కువగా తీసుకుంటుండటం, వేళ కానీ వేళల్లో భోజనానికి ఉపక్రమించడం, తాము చేసే పనిలో పూర్తిగా నిమగ్నం అయ్యి, పీకలదాకా కూరుకుపోయి భోజనాన్ని సైతం వాయిదా వేయడంతో పాటు, ఎడాపెడా చిరు తిండ్లు అంటే బిస్కెట్లు, స్నాక్స్, మిక్చర్, ఐస్ క్రీమ్స్, సమోసా వంటి వాటిని తీసుకుంటూ ఉండటం మూలాన మన శరీరం అదుపుతప్పి కొలెస్ట్రాల్, కొవ్వు శాతం మన శరీరంలో పెరిగిపోయి అధిక బరువు మనకు సంప్రాప్తించే ఆనారోగ్య పరిస్థితులు ప్రస్తుత సమాజంలో ఎక్కువగా పొడచూపుతుండటం ఎంతైనా కడు బాధాకరమైన, శోచనీయమైన విషయం. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఊబకాయం, స్థులకాయం అనేది మానవాళికి ఓ పెను శాపంగా పరిణమించింది అనే మాట సత్యదూరం కాదు. అందులో భాగంగా పరిస్థితులు అనేవి ఎంతటి దారుణ, దయనీయ పరిస్థితుల్లోకి నెట్టివేయబడిందో అనే విషయానికి వస్తే ప్రతి ముగ్గురు ఊబకాయుల్లో ఇద్దరి మరణాలకు గుండె జబ్బులే ప్రధాన కారణమని ఇటీవల ఓఅధ్యయనం తెలియజేసింది అంటే ఊబకాయం అనేది మానవాళి జీవితాలను ఏ స్థాయిలో ఆడుకుంటుందో, ఏ తరహాలో వారిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టివేస్తున్నదో తెలుసుకుంటుంటేనే మన గుండెలు, హృదయాలు ఒక్కసారిగా జలదరించడంతో పాటు, బరువెక్కుతాయి. అంతేకాదు మన శరీరానికి సైతం ఒక్కసారిగా తీవ్ర ఆందోళనతో ముచ్చెమటలు పట్టడం తథ్యం. ఇక ముఖ్యంగా స్థులకాయుల్లో పొడచూపే జబ్బుల విషయానికి వస్తే గుండె వైఫల్యం, కొవ్వు పేరుకుపోవడం, రక్తం గడ్డ కట్టడం, గుండె కొట్టుకోవడంలో అసమతుల్యత వంటి ప్రమాదాలు ఎల్లవేళలా మన వెన్నంటి వుంటాయని ఓ పేరు మోసిన సర్వే సంస్థ వారు తమ అభిప్రాయాన్ని కుండలు బద్దలు కొట్టినట్లు తెలియజేయడంతో ఖచ్చితంగా మనమంతా స్థులకాయాన్ని తక్కువ అంచనా వేయడానికి వీలులేదని, ఆ విషయంలో ఏమరుపాటు ఏ మాత్రం తగదనే చేదు వాస్తవాన్ని వీలయినంత త్వరగా ప్రతి ఊబకాయుడు గ్రహించి సత్వరమే తన హెవీ బాడీని, భారీ శరీర ఆకృతిని తగ్గించుకునే దిశగా చాలా తీవ్ర కసరత్తు చేయక తప్పదు కాక తప్పదు. ఏదిఏమైనా సాధారణ బరువు వున్న వారితో పోలిస్తే అధిక బరువు వున్న 29-49ఏళ్ల వయసు గల పురుషుల్లో 78 శాతం, మహిళల్లో 65 శాతం అధిక రక్తపోటును బాడీమాస్ ఇండెక్స్ (బిఎంఐ) ఎక్కువగా ఉండటమే కారణం. అదేమాదిరి స్థులకాయుల గుండెకు రక్తం సరాఫరాలో ఏర్పడే ఇబ్బందిని 'ఇస్కామిక్ హార్ట్ డిసీజ్' అంటారు. దీనికి ప్రధాన కారణం పొగ త్రాగడం, బీపీ, షుగర్, రక్తంలో కొలెస్ట్రాల్ వంటివి ప్రధాన భూమికను పోషిస్తాయి అన్న మాట. అంతిమంగా మానవాళి చేయాల్సిన తక్షణ కర్తవ్యం ఏమంటే తమ తమ శరీర బరువును అదుపులో పెట్టుకోవడం, ఎందుకంటే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే కన్నా ముందే మేల్కొని తమ శరీరాన్ని ఎలాంటి పరిస్థితుల్లో ఊబకాయం బారిన పడకుండా చూసుకుంటే మంచిది. ●

# పరిశుభ్రత చర్యలే అభివృద్ధికి తొలిమెట్టు

డి జయరాం

స్వచ్ఛ భారత్ వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా దేశం బహిరంగ మల విసర్జన రహితస్థితిని సాధించడంలో గణనీయమైన ప్రగతి సాధించింది. అయితే మరుగుదొడ్ల నిర్మాణం వలన కలిగే అపారమైన ప్రయోజనాలను పూర్తిగా అందుకోవాలంటే, నిర్మాణానంతరం ఎదురయ్యే నిర్వహణ, వినియోగ అలవాట్ల సవాళ్లను కూడా అదే స్థాయిలో అర్థం చేసుకోవాలి. పరిశుభ్రత అనేది కేవలం ఒక సౌకర్యం కాదు. ఇది దేశ పౌరుల ఆరోగ్యం, గౌరవం ఆర్థిక అభివృద్ధికి మూల స్తంభం. మరుగుదొడ్ల కల్పన అనేది కేవలం ఒక పౌర సదుపాయంగా కాకుండా బహుముఖ ప్రయోజనాలు అందించే సామాజిక పెట్టుబడిగా చూడాలి. మరుగుదొడ్ల కల్పన వలన కలిగిన అతి ముఖ్యమైన ప్రయోజనం మహిళల భద్రత, గౌరవం మెరుగుపడటం. బహిరంగ మల విసర్జనకు వెళ్లవలసి వచ్చినప్పుడు ముఖ్యంగా చీకటి పడిన తర్వాత, మహిళలు లైంగిక వేధింపులు, ప్రమాదాలు, మానసిక ఆందోళన వంటి సమస్యలను ఎదుర్కొనేవారు. వ్యక్తిగత మరుగుదొడ్ల లభ్యత వలన, మహిళలు ఈ రకమైన సామాజిక భయం నుండి విముక్తి పొందారు. ఇది మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది. సమాజంలో వారి భద్రతా స్థాయిని బలోపేతం చేసింది. యుక్త వయస్సు బాలికలు సరైన మరుగుదొడ్ల సదుపాయం కారణంగా పాఠశాలలకు హాజరు కావడం పెరిగింది. పరిశుభ్రమైన మరుగుదొడ్ల వినియోగం వలన అతి ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం మెరుగుపడుతుంది. బహిరంగ మల విసర్జన పద్ధతులు నీరు, ఆహారం, నేలను కలుషితం చేస్తాయి. దీని వలన పిల్లలు, వృద్ధులలో డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి తీవ్రమైన అంటువ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. మరుగుదొడ్ల వినియోగం, ఈ వ్యాధులకుకారణమయ్యే వ్యాధి కారకాలు పర్యావరణంలోకి చేరకుండా అడ్డుకుంటుంది. ఈ వ్యాధుల నియంత్రణ వలన అటు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై భారం తగ్గడంతో పాటు, ఇటు పేద కుటుంబాలు చికిత్స కోసం ఖర్చుపెట్టవలసిన ఆదాయ నష్టంతగ్గుతుంది. పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టిస్తుంది. ప్రజలు తరచుగా అనారోగ్యంబారిన పడకుండా ఉన్నప్పుడు, వారి ఉత్పాదకత పెరుగుతుంది. అనారోగ్యంతో సెలవులు తీసుకోవడం తగ్గుతుంది. తద్వారా ఉద్యోగులు, కూలీలు నిరంతరంగా పనిచేయగలుగుతారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, పారిశుద్ధం, పరిశుభ్రతలో పెట్టుబడి పెట్టడం వలన ఆరోగ్య ఖర్చులు తగ్గి, జాతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ విధంగా, మరుగుదొడ్ల కల్పన దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)కి పరోక్షంగా దోహదం చేస్తుంది. డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం 2014తో పోలిస్తే 2019లో దేశంలో మూడు లక్షల డయేరియా మరణాలు నివారించబడ్డాయి. ఆరోగ్య ఖర్చులు తగ్గినందున సగటున ఒక కుటుంబం సాలీనా 50,000 రూపాయలు ఆదా చేసింది. భూగర్భ జలాల కాలుష్యం 12.70 రెట్లు తగ్గాయి. ఆగస్టు 2017 లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ఒక స్వతంత్ర సర్వే, మొత్తం జాతీయ గ్రామీణ గృహ పారిశుధ్య కవరేజ్ 62.5 కి,



మరుగుదొడ్ల వినియోగం 91.3కు పెరిగిందని నివేదించింది. గ్రామీణ ప్రాంతాల్లో 99శాతం గృహాలు, 100శాతం మరుగుదొడ్ల వినియోగంతో హరియాణా అగ్రస్థానంలో నిలిచింది. మరుగుదొడ్డి లేని వారిసంఖ్య 55 కోట్ల నుంచి 50 కోట్లకు తగ్గిందని యునిసెఫ్ తెలిపింది. మరుగుదొడ్డిని 96 శాతం మంది ఉపయోగిస్తున్నారని ప్రపంచ బ్యాంకు నివేదించింది. మరుగుదొడ్ల నిర్మాణంలో విజయం సాధించినప్పటికీ ఆ ప్రయోజనాలను పూర్తిగా అందుకోవాలంటే అనేక వ్యవస్థాపరమైన, సామాజిక సవాళ్లను అధిగమించాలి. మరుగుదొడ్ల నిర్మాణానంతరం ఎదురయ్యే అతిపెద్ద సమస్య సరైన నిర్వహణ, నీటి లభ్యత లేకపోవడం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో లేదా నీటికొరత ఉన్న ప్రాంతాలలో, మరుగుదొడ్లు నిర్మించినా, వాటిని శుభ్రపరచడానికి తగినంత నీరు ఉండకపోవడం వలన అవి ఉపయోగించడానికి వీలు లేకుండా పోతున్నాయి. మరుగుదొడ్లు మురికిగా ఉంటే, ప్రజలుతిరిగి బహిరంగ మల విసర్జనకు మొగ్గు చూపుతారు. మురుగునీటి నిర్వహణ వ్యవస్థ సరిగా లేకపోవడం వలన, ఆ వ్యర్థాలు తిరిగి పర్యావరణంలోకి చేరి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. సాంకేతిక పరిష్కారం కంటే ప్రవర్తనా మార్పు తీసుకురావడం చాలా కష్టం. తరతరాలుగా బహిరంగ మల విసర్జనకు అలవాటు పడిన వర్గాలలో మరుగుదొడ్లను ఉపయోగించడం అనేది ఆమోదయోగ్యం కాని సామాజిక, సాంస్కృతిక అలవాటుగా మారింది. చాలా మంది బహిరంగ మల విసర్జనను 'స్వచ్ఛత'గా భావిస్తారు, ఎందుకంటే మరుగుదొడ్లు 'మురికిని' ఒకే చోట నిల్వ చేస్తాయి. ఈ మానసిక ప్రతిఘటనను అధిగమించడానికి నిరంతర సామాజిక చైతన్యం అవసరం. పట్టణ ప్రాంతాలలో, ముఖ్యంగా రద్దీగా ఉండే మురికివాడల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించడానికి స్థలం లభించకపోవడం ప్రధాన సమస్య. ఇక్కడ సామాజిక మరుగుదొడ్లు అవసరం. కానీ ఈ సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం నాణ్యత, నిర్వహణ లోపాలు కారణంగా అవి తరచుగా అపరిశుభ్రంగా, పనికిరాకుండా పోతున్నాయి. పట్టణ ప్రణాళికలో పారిశుధ్య వ్యవస్థకు తగిన ప్రాధాన్యత లభించకపోవడం వలన, సమస్య మరింత జటిలమవుతోంది. మరుగుదొడ్ల ఉపయోగాలు పూర్తిగా అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం, సమాజం ప్రజలు కలిసి పనిచేయాలి. ప్రభుత్వం నీటి సంరక్షణ మురుగునీటి శుద్ధిపై దృష్టి సారించాలి. ప్రతి ఇంటి మరుగుదొడ్డిని ఒక చిన్నవ్యర్థ శుద్ధి కేంద్రంతో అనుసంధానం చేసే స్థిరమైన టెక్నాలజీని ప్రోత్సహించాలి. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను పారదర్శకతతో కూడిన స్థానిక మహిళాస్వయం సహాయక బృందాలు లేదా సామాజికసంస్థలకు అప్పగించి, వారికి ఆర్థిక మద్దతు అందించాలి. విద్య, ఆరోగ్య కార్యకర్తల ద్వారా చైతన్యం కలిగించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు, ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాలలో మహిళలకు పరిశుభ్రత తాలూకా శాస్త్రీయ, ఆర్థిక ప్రయోజనాలపై చైతన్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలి. బహిరంగ మల విసర్జన వలన కలిగే ప్రమాదాలు, మరుగుదొడ్లు వాడటం వలన కలిగే సామాజిక, ఆరోగ్య ప్రయోజనాలను స్పష్టంగా వివరించాలి. ప్రవర్తనా మార్పు అనేది ఒక రాత్రిలో జరిగేది కాదు, దీనికి దీర్ఘకాలిక కృషి అవసరం. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా భారతదేశం మరుగుదొడ్ల నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ, వినియోగ అలవాట్లు, నిర్వహణ అనే రెండు ముఖ్యమైన సవాళ్లను అధిగమించవలసి ఉంది. పరిశుభ్రతను ఒక సామాజిక బాధ్యతగా భావించి, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు కలిసి పనిచేసినప్పుడే ఈ ప్రయోజనాలు పూర్తి స్థాయిలో సమాజానికి అందుతాయి. ఈ నిరంతర సంకల్పం ద్వారానే భారతదేశం ఆరోగ్యవంతమైన, సుస్థిరమైన, గౌరవప్రదమైన భవిష్యత్తు వైపు సాగగలదు. పరిశుభ్రతలో విజయం సాధించడంఅనేది దేశ సమగ్రాభివృద్ధికి అనివార్యమైన తొలి మెట్టు. ●

# ప్రజావాక్కు



## మనిషికి సాటిరాని కృత్రిమ మేధస్సు

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కృత్రిమమేధస్సు సమాజాన్ని కొత్తదిశల్లో నడుపుతోంది. భాష, గణితం, డేటావిశ్లేషణ ఇలాంటి అనేక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతవేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, అది మనిషి సహజమేధస్సును భర్తీ చేయగలదనే అపోహమరింత ప్రమాదకరం. ఎందుకంటే యంత్రాలువేగాన్ని, ఖచ్చితత్వాన్ని అందించగలిగినా, భావోద్వేగం, నైతికత, సానుభూతి, సృజనాత్మకత ఇలాంటి మానవ విలువలను అవి పునరుత్పత్తి చేయలేవు. కృత్రిమ మేధస్సు అతిపెద్ద శక్తి దాని విశ్లేషణ సామర్థ్యం. వైద్యం నుంచి రవాణా వరకు, పంటల ఆరోగ్యం నుంచి వాతావరణ అంచనాల వరకు అన్నిరంగాల్లో ఇది సమర్థతను పెంచుతోంది. వ్యాధులను ప్రారంభదశలో గుర్తించడం, ట్రాఫిక్‌నియంత్రణ, లాజిస్టిక్స్‌లో వృథా తగ్గించడం వంటి అభివృద్ధులుప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## టీజీ సీడ్స్ బిల్లుపై రైతుల ఆందోళనలు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన టీజీ సీడ్స్ బిల్లు, 1966,1983లో అమలులోకి వచ్చిన పాత విత్తన చట్టాలను భర్తీచేస్తూ, విత్తనాలనాణ్యత నియంత్రణను మరింత కఠినతరం చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తోంది. వ్యవసాయ రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో, జీవ సాంకేతికత ప్రాభవం పెరుగుతున్న నేపథ్యంలో, నూతన చట్టం అవసరం అనడం సందేహం లేదు. పాడు విత్తనాల కారణంగా సంవత్సరాలుగా నష్టపోతున్న రైతులకు ఇది కొంతవరకు రక్షణనిచ్చే ప్రయత్నమే. అయితే, ఈ బిల్లుకు సంబంధించి రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు గణనీయమైనవే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

చలికాలం వచ్చింది. చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది. మంచులోఎదుటివాహనాలు కనిపించక పోవటం వల్ల, డ్రైవర్లు సరైన జాగ్రత్తలు పాటించక పోవటం వల్ల, రోడ్డు ప్రమాదాలు జరిగి, పలువురి ప్రాణాలు గాలిలోకలిసేప్రమాదంవుంది. మంచు కురుస్తున్నప్పుడు ప్రయాణాలకివిరామమిచ్చి, సరైనప్రణాళికలుసిద్ధం చేసుకోవాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

## సుప్రీం ఆదేశాలను అమలు చేయాలి

గ్రామాలలో మున్సిపల్ కార్పొరేషన్ వీధిలలో కుక్కలే మనుషుల ప్రాణాలు తోడేస్తున్నాయి. రక్తంరుచి మరిగినట్టుగా మనుషులపైదాడిచేసి కరుస్తున్నాయి. ఈ మధ్యకాలంలోవీధి కుక్కలు సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. చిన్నపిల్లలపై అవి క్రూరంగా దాడిచేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. ఆ రాష్ట్రం, ఈ రాష్ట్రమన్న తేడాలేదు. దేశమంతా ఇదే పరిస్థితి. ఈనేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం జనసమ్మర్ధ ప్రాంతాల్లో అస్సలు వీధికుక్కలు కనబడకూడదంటూ తీర్పునిచ్చి సంచలనం సృష్టించింది. జనం తిరిగే ప్రాంతాల్లో వీధికుక్కలు ఉండకూడదు.. తక్షణమే వాటిని రక్షణ కేంద్రాలకు తరలించి సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని కీలక ఆదేశాలు జారీచేసింది.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

## ధర్మపురిలో సమస్యల తిష్ట

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో సమస్యలు తిష్ట వేశాయి ఎక్కడ చూసిన చెత్త చెదారంతో నిండి వుంది. నిత్యం వేలాది మంది భక్తులు ఈ ఆలయానికి వచ్చి గోదావరిలో పుణ్య స్నానం చేసి దర్శనం చేసుకుంటారు. కార్తీక మాసంలో ఎక్కువగా వస్తారు. ఆలయం లోపల కుక్కలు గుంపులుగా తిరుగుతూ ఉన్నాయి. ఎక్కడ దాడి చేస్తాయో అని భక్తులు భయం గుప్పిట్లో దర్శనం చేసుకుంటున్నారు. ధర్మపురి బస్టాండ్‌లో వున్న మరుగు దొడ్ల కంపు కొడుతూ ఉన్నాయి. నీటి సౌకర్యంలేదు. నగర పాలకసంస్థ అధికారులు ఆలయ అధికారులు స్పందించిధర్మపురి ఆలయ పవిత్రతను కాపాడాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## జూనియర్ కాలేజీల అడ్మిషన్ల దందా

తెలంగాణలో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు వచ్చే రానున్న విద్యాసంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు తీసుకోవడం అనేది ఒక దందాగా మారింది. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా, ముఖ్యంగా పదోతరగతి పరీక్షలు ముగియకముందే అడ్మిషన్లు మొదలుపెట్టి, అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈముందస్తు అడ్మిషన్ల ద్వారా విద్యార్థులను ఆకర్షించడానికి, ఫీజులు ఎక్కువ వసూలు చేయడానికి విద్యాశాఖ నిర్దేశించిన అడ్మిషన్ల షెడ్యూల్‌కు ముందే ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నారు. మరో మూడు నెలలకు కొత్త ఫీజు ఉంటుందని ఒత్తిడి చేస్తున్నాయి.

- పొద్దుటూరి జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# బంగ్లాలో రేగిన హింస

## పలు ప్రాంతాల్లో పేలుళ్లు, వాహనాల ధ్వంసం

## ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

## బంద్‌కు అవామీలీగ్ పిలుపు

**ఢాకా, నవంబరు 18:** బంగ్లాదేశ్ మరోమారు హింసాకాండతో రగిలిపోతోంది. మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణశిక్ష విధించడంతో బంగ్లాదేశ్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగింది. ఐసిటి తీర్పును నిరసిస్తూ బంగ్లాదేశ్ బంద్‌కు హసీనా పార్టీ అవామీ లీగ్ పిలుపునిచ్చింది. సోమవారం మొదలైన హింసాత్మక ఘర్షణలు మంగళవారం కూడా కొనసాగాయి. విద్యార్థి ఉద్యమాలతో సంబంధమున్న వ్యక్తులు కొందరు బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటికి నిప్పుపెట్టడానికి ప్రయత్నించగా, హసీనా మద్దతుదారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఘర్షణ చెలరేగింది. దాదాపు ఐదారు జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలకు నిప్పుపెట్టారు. కార్యాలయాల్లోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. రెండు విద్యాసంస్థల్లోకి ఆందోళనకారులు చొరబడి బీభత్సం సృష్టించారు. అనేక చోట్ల బాంబులు పేలాయి. కోట్లిపారాలో జరిగిన బాంబు పేలుడులో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. ఇద్దరు మృతి చెందారు. పలువురు ఆందోళనకారులు కూడా గాయపడినట్లు అధికారులు తెలిపారు. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. లాఠీచార్జ్ చేశారు. అనేక సౌండ్ గ్రనేడ్లను ఉపయోగించారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ మసూద్ ఆలం తెలిపారు. అవామీ లీగ్ బంద్ పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజారవాణ నిలిచిపోయింది. వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐసిటి తీర్పు పక్షపాతంతో కూడినది, రాజకీయంగా ప్రేరేపించబడిన ప్రతీకారం అని అవామీ లీగ్ పార్టీ అగ్రనేత జహంగీర్ కబీర్ నానక్ అభివర్ణించారు. బంగ్లాదేశ్ ప్రజలు ఈ నిర్ణయాన్ని ఎప్పటికీ అంగీకరించరని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. ఐసిటి తీర్పు నేపథ్యంలో యూనస్ అవామీ లీగ్‌ను నిషేధించడం గమనార్హం.

# షేక్ హసీనాను భారత్ అప్పగిస్తుందా?

## - బంగ్లా వినతిపై ఇంకా స్పందించని వైనం
## - ప్రస్తుతం భారత్ ఆశ్రయంలో ఉన్న హసీనా



**ఢాకా, నవంబరు 18:** బంగ్లాదేశ్‌లో మరణశిక్ష పడిన షేక్ హసీనాను ఆ దేశానికి అప్పగిస్తారా లేదా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. షేక్ హసీనాను దోషిగా తేల్చిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఆమెకు మరణశిక్ష విధించింది. దీంతో ఆమెను తక్షణమే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ భారత్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలోనే ఆమె మరణశిక్షపై స్పందించిన భారత్ ఆమెను అప్పగించాలన్ని విజ్ఞప్తిపై మాత్రం ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు ఆ దేశ కోర్టు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతుండగా షేక్ హసీనాకు ఆ దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ మరణశిక్ష విధించినందున ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌ను కోరింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు షేక్ హసీనా అప్పగింత అంశం భారత్‌బంగ్లాదేశ్ దౌత్య సంబంధాల్లో కీలక మలుపుగా మారింది. ప్రస్తుతం భారత్‌లో ఉంటున్న హసీనాను వెంటనే తమకు అప్పగించాలని ఢాకాలోని తాత్కాలిక ప్రభుత్వం న్యూఢిల్లీని కోరింది. 2024 జూలైలో బంగ్లాదేశ్‌లో చెలరేగిన విద్యార్థుల తిరుగుబాటును అణచివేసేందుకు అప్పటి ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందుకు గాను హెలికాప్టర్లు, డ్రోన్‌లు, మారణాయుధాలను ఉపయోగించి విద్యార్థి నిరసనకారులను చంపడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై షేక్ హసీనాకు ట్రిబ్యునల్ మరణశిక్ష విధించింది. భారత్‌బంగ్లాదేశ్ మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం శిక్ష పడిన షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను అప్పగించడం న్యూఢిల్లీకి తప్పనిసరి బాధ్యత అని పేర్కొంది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన వీరిద్దరికీ ఆశ్రయం కల్పించడం స్నేహపూర్వకం కాని చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. షేక్ హసీనాకు విధించిన మరణశిక్ష తీర్పుపై స్పందించిన భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తాము తీర్పును గమనించామని తెలిపింది. అయినప్పటికీ షేక్ హసీనాను అప్పగించాలనే ఢాకా డిమాండ్‌పై మాత్రం స్పందించలేదు. పొరుగు దేశంగా బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాల కోసం శాంతి, ప్రజాస్వామ్యం, స్థిరత్వం ఉండేలా చూస్తామని తెలిపింది. ఈ లక్ష్యాలను సాధించడానికి తామను నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేసింది. ఒప్పందం ప్రకారం అభ్యర్థనలను సాధారణంగా గౌరవించినప్పటికీ షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు భారత్ అప్పగించే అవకాశం చాలా తక్కువగా ఉందని తెలుస్తోంది. భారత చట్టాలు, ద్వైపాక్షిక ఒప్పందం రెండూ మన దేశానికి చాలా వెసులుబాటును కల్పిస్తున్నాయి. ఒప్పందంలోని ఆర్టికల్ 8 ప్రకారం నిందితుడిపై ఉన్న అభియోగాలు అన్యాయమైనవి లేదా అణచివేతకు గురిచేసేవి అని నిరూపించగలిగితే అప్పగింత అభ్యర్థనను తిరస్కరించే అవకాశం ఉంటుంది. షేక్ హసీనాపై ఉన్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవి కావచ్చనే కారణంతో భారత్ ఈ విజ్ఞప్తిని తిరస్కరించే అవకాశం ఉంది. ఆర్టికల్ 6 ప్రకారం హత్య, ఉగ్రవాదం వంటి తీవ్రమైన నేరాలు మినహా రాజకీయ స్వభావం ఉన్న నేరాలకు నిందితులను అప్పగించడాన్ని తిరస్కరించవచ్చు. షేక్ హసీనాపై ఉన్న కొన్ని ఆరోపణలు దీని పరిధిలోకి రాకపోవచ్చని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

పరస్పర అప్పగింత ఒప్పందం 1962లోని సెక్షన్ 29 భారత ప్రభుత్వానికి రాజకీయ ప్రేరేపిత అభ్యర్థనలను న్యాయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అభ్యర్థనలను తిరస్కరించే అధికారాన్ని ఇస్తుంది.

# ఇవిఎంలలో పోలింగ్‌కు ముందే 25 వేల ఓట్లు

**పాట్నా,నవంబరు 18:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించ లేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది.

**స్పందించిన ఇసి**

## డ్రగ్స్ మాఫియా కట్టడికి

# సైనిక చర్యలు చేపట్టాల్సిందే



**వెనిజులా, మెక్సికో, కరీబియన్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక**

**వాషింగ్టన్, నవంబరు 18:** వెనిజులాతోపాటు మెక్సికో ఇతర సమీపదేశాలు కేంద్రంగా పెచ్చుమీరిన డ్రగ్ దందాలను కట్టడిచేసేందుకు అవసరమైతే సైనిక చర్యలుసైతం ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరించారు. ఈ డ్రగ్స్ మాఫియాలవల్లనే నేరాలు, ఘోరాలు పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు. అలాగే వెనిజులా కేంద్రంగా కూడా డ్రగ్స్ మాఫియాలు రెచ్చిపోతున్నాయని, అవసరమైతే సైనిక చర్యను ఎంతమాత్రం సందేహించబోమని ఆయన అన్నారు. ఓవల్ ఆఫీసులో మాట్లాడిన ట్రంప్ వెనిజులా, మెక్సికో దేశాలతోపాటు ఇతర కరీబియన్ దేశాల్లో అమెరికా సైనికదళాలు మొహరింపు, వైమానిక విన్యాసాలకు కారణం కేవలం డ్రగ్ అక్రమ రవాణాయేనని ఆయన అన్నారు. డ్రగ్స్‌ను కట్టడిచేసేందుకు మెక్సికోపైనా సైనిక చర్యకు వెనుకాడేది లేదనానరు. అయితే వెనిజులా అధ్యక్షుడు నికొలాస్‌మదురోతో చర్చలు జరిపేందుకు తాను ఏక్షణం అయినా సిద్ధమేనని స్పష్టంచేసారు. అయితే అమెరికాతో సహా మరెవ్వరితోనూ కూడా తాను ముఖాముఖి చర్చలు జరిపేదిలేదని టివిషోలో స్పష్టం చేసారు. అమెరికాలో ఉన్న ఏ ఒక్కరితోనూ తాను చర్చలుజరిపేందుకు ఇష్టంలేదని అన్నారు. అమెరికా తమ ప్రాంతంలో మిలిటరీని మొహరిస్తోందని, ఇపుడు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు, అనేక యుద్ధనౌకలు, యుద్ధ విమానాలుఅనేకం వచ్చాయని ఆయన ఆరోపించారు. అయితే ట్రంప్ మాత్రం వెనిజులా అధ్యక్షుడు ఉగ్రవాద డ్రగ్ సిండికేట్‌ను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అయితే నికొలస్ కుటుంబం తీవ్రంగా వనయతిరేకించింది. సెప్టెంబరునుంచి అమెరికా దళాలు అంతర్జాతీయ జలాల్లో వైమానిక దాడులునిర్వహించింది. ఈదాడుల్లో 83 మంది చనిపోయారు. వీరంతా డ్రగ్ అక్రమరవాణా చేస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తోంది. అలాగే ట్రినిడాడ్‌లో కూడా అమెరికా నావికాదళాలు మిలిటరీ కవాతులు నిర్వహించాయి. ట్రినిడాడ్‌టొబాగోలో నెలలో రెండుసార్లు కవాతులు చేయడంపై ఆదేశం మండిపడుతోంది.

# ట్రంప్ గాజా శాంతి ప్రణాళికకు భద్రతా మండలి ఆమోదం



**న్యూయార్క్, నవంబరు 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. రెండేళ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 20 సూత్రాల ప్రణాళికను డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ బలగాల నియోగం, యుద్ధ విరామం, పునర్నిర్మాణం, పాలనకు మార్గదర్శకాలు ఇందులో ఉన్నాయి. ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్‌-పాలస్తీనా తీవ్రవాద గ్రూపు హమాస్ గత నెల 10న సంతకాలు చేశాయి. ఐక్యరాజ్య సమితిలో సోమవారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా, యుకె, ఫ్రాన్స్, సోమాలియా సహా మొత్తం 13 దేశాలు గాజా శాంతి ప్రణాళికకు మద్దతు పలికాయి. వీటో అధికారం ఉన్న రష్యా, చైనా ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత నెలలో యుద్ధ విరామం, బందీల విడుదల ఒప్పందంతో ప్రణాళిక మొదటి దశను అమలు చేసిన సంగతి తెలిసిందే. బోర్డ్ ఆఫ్ పీస్ అనే తాత్కాలిక సంస్థను ఏర్పాటు చేసి.. గాజా పునర్నిర్మాణాన్ని పర్యవేక్షించాలన్నది గాజా ప్లాన్ ఉద్దేశం. కాగా, ఈ తీర్మానాన్ని హమాస్ ఖండించింది. ఇది గాజా ప్రజల స్వతంత్రతను హరించడమేనని మండిపడింది. పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్యం, స్వయంపాలన హక్కులను ఈ తీర్మానం గౌరవించడం లేదని, ఇక్కడి ప్రజల రాజకీయ ఆకాంక్షలను పక్కనపెట్టి తాత్కాలిక పాలనా సంస్థ పేరుతో ఇతర దేశాల నిర్ణయాలను రుద్దే ప్రయత్నంగా కనిపిస్తున్నదని విమర్శించింది. గాజా భవిష్యత్తును గాజా ప్రజలే నిర్ణయించాలని, విదేశీ బలగాలు, పాలనా సంస్థలు తమ అభిప్రాయాలను రుద్దకూడదని పేర్కొంది. రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్‌పై హమాస్ అనూహ్య దాడితో యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడికి దిగింది. దాదాపు 1,200 మందిని హతమార్చి, 250 మందికిపైగా బందీలుగా చేసుకుంది. హమాస్ దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో 67,000 మందికిపైగా పాలస్తీనా పౌరులు మరణించారు. ఇజ్రాయెల్ దాడుల్లో వేలాది ఇళ్లు నేలమట్టం కాగా లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులై టెంట్లలో తలదాచుకుని జీవిస్తున్నారు.

## ఐదు కోర్టు కాంప్లెక్స్‌లు, విద్యాసంస్థలకు బాంబు బెదరింపులు!

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీలో ఐదు కోర్టు కాంప్లెక్స్‌లకు బాంబు బెదింపు ఇమెయిల్స్ వచ్చాయి. దీనితో అన్ని జిల్లాకోర్టుల్లోను బందోబస్తును పెంచారు. అదనపు దళాలను నియమించారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ప్రస్తుతం అన్ని కోర్టులను తనిఖీలుచేస్తోంది. ముందుగా సాకేత్‌కోర్టు ఆవరణలో తనిఖీలుచేపట్టింది. మధ్యాహ్నం వరకూ ఈ కోర్టులో విచారణలు నిలిపివేసారు. అంతేకాకుండా ఈ కోర్టు ఆవరణలన్నింటినీ హైరిస్క్ ప్రాంతాలుగా ప్రకటించారు. అదనపు బలగాలను తక్షణహే అక్కడకు పంపించారు. జైషే మహ్మద్ పేరిట ఐదు జిల్లా కోర్టులు, పాటియాలా కోర్టు, సాకేత్ కోర్టు, రోహిణి కోర్టు, ద్వారక కోర్టు వీటన్నింటిని బాంబులతో పేల్చివేస్తామని ఈమెయిల్ పంపించారని పోలీసులు చెప్పారు. ఉదయం 11 గంటలకు బాంబులతో పేల్చేస్తామని తమకు వార్నింగ్ వచ్చిందని ఒక న్యాయవాది చెప్పారు. అలాగే లాయర్స్ ఛాంబర్ బ్లాక్‌నుపేల్చివేస్తామని చెప్పడంతో వెంటనే ఖాళీచేయించామన్నారు. జైషే మహ్మద్‌పేరిట ఈ మెయిల్ వచ్చినట్లు నిర్ధారించారు. న్యాయాధికారులు, బార్ అసోసియేషన్‌లకు కూడా ఈ సమాచారం వచ్చింది. తక్షణమే ఆ ప్రాంతాలను ఖాళీ చేయించామని బార్ అసోసియేషన్ తెలిపింది. అలాగే సిఆర్‌పిఎఫ్ స్కూళ్లకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ద్వారకా, ప్రశాంత్ విహార్‌లలో ఉన్న స్కూళ్లను బాంబులతో పేల్చేస్తామన్నారు.

# నా తల్లిదండ్రుల పరిస్థితిపై దర్యాప్తు చేయండి

## కేంద్రాన్ని కోరిన లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు తేజప్రతాప్ యాదవ్



**పాట్నా, నవంబర్ 18:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంలో చీలికలు ఏర్పడిన విషయం తెలిసిందే ఈ నేపథ్యంలో లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తన కుటుంబ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. తేజస్వి యాదవ్ సహాయకులు తమ కుటుంబాన్ని, పార్టీని ముక్కలు చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి ద్రోహుల వల్ల తమ తల్లిదండ్రులు కూడా మానసిక వేధింపులకు గురవుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై దర్యాప్తుకు ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోడీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖస్తుతి చేసేవారి కుట్రపూరిత రాజకీయాల వల్ల ఆర్జేడీని బలమైన పార్టీగా మార్చడానికి ఎన్నోఏళ్లు కష్టపడిన వారిని విస్మరిస్తున్నారు. దురాశ, అహంకారంతో విర్రవీగుతున్న తేజస్వీ సహాయకులు నా తల్లిదండ్రులు లాలూప్రసాద్, రబ్రీదేవిలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. నా తండ్రి ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారు ఒత్తిడిని తట్టుకోలేరు. ఈ విషయంపై దర్యాప్తుకు ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర మంత్రి అమిత్ షా, బీహార్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను అని తేజ్‌ప్రతాప్ పేర్కొన్నారు. తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నానని, కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నానని లాలూప్రసాద్‌కుమార్తె రోహిణి ఆచార్య ప్రకటించిన విషయం తెలిసిందే. ఆర్జేడీ ఎంపి సంజయ్‌యాదవ్, తేజస్వి మిత్రుడు రమీజ్‌ఖాన్ కారణంగానే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. అనంతరం లాలూ మరో ముగ్గురు కుమార్తెలు కూడా పాట్నాలోని ఆయన ఇంటి నుంచి ఢిల్లీకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తన కుటుంబంలో జరుగుతున్న గొడవలకు తేజస్వీ సహాయకులే కారణమని తేజ్ ప్రతాప్ యాదవ్ ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయంపై లాలూప్రసాద్ స్పందిస్తూ తమ కుటుంబంలోని అంతర్గత విషయాలను తామే పరిష్కరించుకుంటామని వ్యాఖ్యానించారు.

## సంక్షిప్తంగా..

### ఎన్ఐఎ కస్టడీలో 'ఎర్రకోట' నిందితుడు

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీ లాల్‌ఖిలా బాంబు పేలుడులో పాల్గొన్న ఆత్మాహుతి బాంబు ఉమర్‌నబీ సన్నిహితుడు జసీర్ బిలాల్ వానికి ఢిల్లీకోర్టు పదిరోజులు ఎన్ఐఎ కస్టడీకి అనుమతించింది. 15 మంది మృతిచెందిన ఢిల్లీ పేలుడు కేసులో ఉమర్‌నబీకి అత్యంత సన్నిహితంగా బిలాల్‌వాని ఉన్నట్లు ఎన్ఐఎ గుర్తించి అదుపులోకి తీసుకుంది. ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి అంజుబజాజ్ చందనా ఎన్ఐఎ అభ్యర్థనను స్వీకరించింది. నిందితుడిని కస్టడీ విచారణచేసుకోవచ్చని ఆమోదించారు. ఈ విచారణ మొత్తం ఇన్‌కెమేరా వ్యవస్థలో జరిగింది. మీడియాను కూడా అనుమతించలేదు.



పోలీస్,ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను కోర్టు ఆవరణలో మొహరించారు. ఎలాంటి దాడులు జరిగినా ఎదుర్కొనేందుకు వీలుగా అదనపు దళాలు అక్కడ సిద్ధంగా ఉన్నాయి. జసీర్ ఉమర్‌నబీకి సాంకేతిక సహకారం అందించినట్లు విచారణలో తేలింది.

### బస్సుపై విరిగిపడిన కొండచరియలు, వియత్నాంలో ఆరుగురి మృతి

**హనోయ్, నవంబరు 18:** వియత్నాం ఆర్థిక రాజధాని హోచిమిన్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పర్వత మార్గంలో ప్రయాణిస్తున్న బస్సుపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు మృతి చెందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. మరో 19 మంది గాయపడ్డారు. హోచిమిన్ సిటీ నుంచి 32 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు తీరప్రాంత నగరమైన న్హాట్రంగాకు వెళ్తుండగా ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ హైల్యాండ్స్‌లోని ఖాహ్ లె పాస్ గుండా పర్వత మార్గంలో ప్రయాణిస్తుండగా కొండచరియలు విరిగిపడి



బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

### సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చిన 235 పాక్ డ్రోన్లు కూల్చివేత

**చండీఘర్, నవంబరు 18:** పాకిస్తాన్ భారత్ సరిహద్దుల్లోకి చొరబడిన 235 డ్రోన్లను ఈ ఏడాది కూల్చివేసామని సరిహద్దుభద్రతా దళం ఫ్రాంటియర్ అధికారులు వెల్లడించారు. డ్రగ్స్, ఆయుధాలను రవాణాచేస్తున్నట్లుగా గుర్తించిన ఈడ్రోన్లను ఎక్కడికక్కడ కూల్చివేసామన్నారు. సరిహద్దుల్లో స్మగ్లింగ్ కార్యకలాపాలను కట్టడిచేసే నిఘాలో భాగంగానే వీటిని కూల్చివేసామని చెప్పారు. అమృత్‌సర్‌లో మీడియాతో మాట్లాడుతూ బిఎస్ఎఫ్ ఐజి అతుల్ ఫుల్జేలే మంచుకకురిసే రోజుల్లో కొంతమేర దృశ్యవీక్షణం కష్టం అవుతున్నదని అయితే అయినప్పటికీ




స్మగ్లర్ల ఆటలు కట్టడిచేసినట్లు తప లిపారు. ఇందుకోసం ప్రత్యేక నిఘా సామగ్రిని రప్పించామని, మంచుకురిసే రోజుల్లోకూడా వీటిని వినియోగించవచ్చని ఆయన అన్నారు. అలాగేసరిహద్దుల్లోకి వస్తున్న వ్యక్తులపైనా నిఘా పెంచామన్నారు.

### మరోసారి మోడీని ప్రశంసించిన కాంగ్రెస్ నేత శశిథరూర్

**న్యూఢిల్లీ, నవంబర్ 18:** మోడీ సర్కార్ పట్ల అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మరోసారి ప్రధానిని ప్రశంసించారు. ఢిల్లీలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి తనను ఆహ్వానించారని ఆ కార్యక్రమంలో ప్రధాని మోడీ భారత్ నిర్మాణాత్మక అభివృద్ధి గురించి ప్రసంగించారని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని అందరూ అంటారని తన ప్రసంగంలో మోడీ వెల్లడించిన అంశాన్ని థరూర్ గుర్తు చేశారు. కానీ ప్రజల సమస్యల విషయంలో ప్రధాని ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారని కితాబిచ్చారు. దేశంలో విద్యపై వలసవాదం ప్రభావం ఏ విధంగా ఉందనే విషయం గురించి మోడీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. వలసవాద ఆలోచనా విధానం నుంచి బయట పడాలంటే భారతదేశ వారసత్వం, భాషలు, విజ్ఞాన వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరముందని ఆయన చెప్పారన్నారు.

# రేపు సిఎంగా నితీశ్ ప్రమాణం

## - ప్రధాని మోడీ, అమిత్‌షా, కేంద్ర మంత్రులురాక - ఎన్‌డిఎ పాలిత సిఎంలకు ఆహ్వానం
## - ప్రతిపక్ష నేతగా ఉండలేను: తేజస్వి - ఓటమికి నాదే బాధ్యత: ప్రశాంత్ కిశోర్



**పాట్నా, నవంబరు 18:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ నెల 20వ తేదీ గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. సిఎంగా నితీశ్ బాధ్యతలు చేపట్టడం ఇది పదోసారి. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి పాట్నాలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించారు. ఇటు మంత్రివర్గ కూర్పుపై ఎన్‌డిఏ నేతలతో సిఎం నితీశ్‌కుమార్ సమాలోచనలు జరుపుతున్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి చొప్పున బిజెపికి 15 లేదా 16, జెడియుకు 14, ఎల్‌జెపికి 3, హెచ్‌ఏఎం 1, ఆర్‌ఎల్‌ఎంకు 1 మంత్రి పదవి దక్కనున్నట్లు సమాచారం. జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝూ మీడియాతో మాట్లాడుతూ.. "నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని బీహార్ ప్రజలు ఇటీవల ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఆశీర్వదించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి కృషి చేస్తాం. గురువారం నితీశ్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం కొలువుదీరనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రధాని మోడీ, బిజెపి సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రులు హాజరవుతున్నారు" అని తెలిపారు. నితీశ్‌తోపాటు ఎంత మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయబోతున్నారని మాత్రం ఖచ్చితంగా చెప్పలేనని సంజయ్ కుమార్ ఝూ తెలిపారు. ఎన్‌డిఏ కూటమిలోని అన్ని పార్టీలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు నేడు జరగనున్న బిజెపి లెజిస్లేటివ్ పార్టీ నాయకుడి ఎన్నిక కోసం కాషాయ పార్టీ పార్లమెంటరీ బోర్డు కేంద్ర పరిశీలకులను నియమించింది. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అర్జున్ సఇంగ్, ఉత్తర్‌ప్రదేశ్ డిప్యూటీ సిఎం కేశవ్ ప్రసాద్ మౌర్యలను నియమించింది. అటు కాంగ్రెస్ పార్టీ 43 మంది నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని, అలాగే పార్టీ నిబంధనలు అతిక్రమించారని తాఖీదులిచ్చింది. ఆర్‌జెడి శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన తేజస్వి యాదవ్, ప్రతిపక్ష నేతగా కొనసాగలేనని పార్టీ అధిష్టానానికి తెలియ జేశారు. విపక్ష నేతగా మరో సీనియర్ నాయకుడిని ఎన్నుకోవాలి, ఏకాభిప్రాయంతో నియమించాలని లాలూప్రసాద్‌కు స్పష్టంగా చేసారు.

## ఒడిశా ప్రముఖ గాయకుడు హుమేన్‌సాగర్

# కన్నుమూత



**భువనేశ్వర్, నవంబరు 18:** ఒడియాలో ప్రముఖ గాయకుడు హుమేన్‌సాగర్ 35వ ఏట అస్వస్థతతో కన్నుమూసారు. స్థానిక ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న సాగర్ బహుళ అవయవాలు విఫలం చెందడంతో అత్యవసర వార్డులోనే చికిత్స పొందుతూ చనిపోయినట్లు ఎయిమ్స్ వైద్యులు శ్రీకాంత్ బెహెరా వెల్లడించారు. ఈనెల 14వ తేదీ ఎయిమ్స్‌లో చేరారని బైలేటరల్ న్యుమోనియా, అక్యూట్ క్రానిక్ లివర్ ఫైయిల్యూర్, డైలేటెడ్ కార్డియోమైయోపతి, తీవ్రస్థాయి ఎల్వీ సిస్టోలిక్‌డిస్‌ఫంక్షన్, మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్ మోడ్స్, రిఫ్రాక్టరీషాక్, తీవ్రస్థాయిలో శ్వాసకోస ఇబ్బందులు, అనూరిక్ అక్యూట్ కిడ్నీ గాయాలు, ఎన్‌సెఫలోపతి, హెపటోపథీ, థ్రంబోసైటోపేనియా, కోగ్యులోపతి వంటి రుగ్మతలు ఆయన్ను చుట్టుముట్టాయి. చికిత్సకు కూడా స్పందించడం లేదని, వ్యాధులు తీవ్రస్థాయికి చేరుకున్నాయని ఆయన వివరించారు. ఆయన్ను అత్యవసర ఐసియులోనే ఉంచి నిపుణులైన వైద్యబృందం ఆయన్ను 24 గంటలపాటు పర్యవేక్షించిందని సోమవారం రాత్రి కన్నుమూసినట్లు తెలిపారు.



# రైతులకు శాపంగా మారిన ప్రజాపాలన

## కర్షకులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిరక్ష్యం

## అవగాహనలేని కొత్త యాప్‌తో రైతులకు తిప్పలు

## పత్తి కొనుగోలు నిలిపివేయడం దురదృష్టకరం

## బిఆర్ఎస్ మాజీమంత్రి హరీశ్‌రావు

**వరంగల్ సిటీ, నవంబరు 18, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలోరైతులకు కన్నీళ్లే తప్ప, రైతులకు మేలు చేసే పనులు ఒక్కటి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. జీన్నింగ్ మిల్లులు రెండు రోజులుగా మూతపడడంతో మంగళవారం వరంగల్ గ్రేన్ మార్కెట్ ను స్థానిక జిల్లా నాయకులతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలన రైతులకు శాపంగా మారిందని అన్నారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలుగు రైతుల నడ్డి విరిసే విధంగానే ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని కరెంటు నుంచి కాంటా వరకూఅన్నీ సమస్యలేనని విమర్శించారు. రైతంగానికి సమయానికి ఎరువులు అందవు, కరెంట్ సరిగ్గా రాదు, రైతుబంధు లేదు, రుణమాఫీ చేయరు, బోనస్ పంటల బీమా ఊసు మొత్తానికే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగొళ్ళు నిలిచిపోవడం రైతులు ఆందోళనకు గురి అవుతున్నారని అన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్నారని కపాస్ యాప్ ద్వారా రైతులు అయెమాయంకు గురై దానిని ఎలా వాడుకోవాలో తెలువని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కపాస్ యాప్ లో 8 నుండి 12 శాతం తేమ ఉండాలనేతుగ్లక్ నిర్ణయాలతో రైతులు రోడ్ల మీద పడే పరిస్థితి వచ్చిందని రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్‌మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడడంతో పత్తి రైతులు అయోమయంలో ఉన్నారని అన్నారు. ఇప్పటికైన కపాస్ యాప్ రద్దు చేసి గతంలో కొనుగొలు చేసిన విధానంలో పత్తి కొనుగొల్లు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కలెక్షల పై మాత్రమే కాకుండా రైతులను పట్టించుకోవాలని తక్షనమే రైతులకు చెల్లించాల్సిన ధాన్యంకు బోనస్ వెంటనే మంజూరు చేయాలని అన్నారు. లేకుంటే రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ అండగా ఉండి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతి పక్ష నేత సిరికొండ మధుసుదన్ చారి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవిందర్ రావు, మాజి ఎంపి బానోతు కవిత, మాజీ ఎమ్మెల్యే లు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి తదితర నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలి

## బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ పరంగా ఇచ్చే బీసీ రిజ ర్వేషన్ల భిక్షను బీసీ సమాజం అంగీకరించబోదని, బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేసిన తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలను ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాదులో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, బీసీ జేఏసీ చీఫ్ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, కోఆర్డినేటర్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బిసి విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కేబినెట్ సమావేశంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని, బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా కాకుండా పార్టీ పరంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనను రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ప్రభుత్వం తన నిర్ణ యాన్ని మార్చుకొని అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడాకపోతే రాష్ట్రంలో అగ్గిపుట్టిస్తామని తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ గుర్తులు లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలలో 42 శాతం మేరకు పార్టీ పరంగా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం చాలా విడ్డూరంగా ఉందని, పార్టీ పరంగా ఒకవేళ ఇవ్వాలనుకుంటే తెలంగాణలో జరిగిన కులగనన ఆధారంగా 60 శాతం అయినా ఇస్తామని ప్రకటించాలన్నారు.

# బిఆర్ఎస్‌తో నాకెలాంటి సంబంధం లేదు

## కుట్ర చేసి పార్టీ నుంచి బయటకు పంపారు

## మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత

**ఖమ్మం నవంబరు 18, ప్రభాతవార్త:** కుట్ర చేసి తనను పార్టీ నుంచి బయటకు పంపారని,ప్రస్తుతానికి కొత్త పార్టీ ఆలోచన లేదని,తుమ్మల వంటి నేతను వదులుకోవడం వల్లే బీఆర్ఎస్ అధికారానికి దూరమైందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఖమ్మంలోని శ్రీ శ్రీ హోటల్లో



ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, భవిష్యత్తులో తామే బాధ్యతాయుత పాత్ర పోషిస్తామని అన్నారు అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై, తన రాజకీయ భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌తో తనకు ఇప్పుడు ఎలాంటి సంబంధం లేదని, కుట్రపూరితంగా తనను, తన కుటుంబాన్ని పార్టీకి దూరం చేశారని ఆరోపించారు. ప్రస్తుతానికి కొత్త రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యం అన్నారు.బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేశారని, ఆ పార్టీతో తన బంధం తెగిపోయిందని కవిత స్పష్టం చేశారు.

ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరరావును పార్టీ వదులుకోవడమే బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమని అన్నారు. తుమ్మల లాంటి నేతను దూరం చేసుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పని అన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తనకు, జాగృతి కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీస గుర్తింపు కూడా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాగృతి కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు.

# రాష్ట్రాన్ని మత్తు రహితం చేద్దాం

## వైద్య విద్యార్థులకు, యువతకు పిలుపునిచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్ (సికింద్రాబాద్), నవంబరు 18, ప్రభాతవార్త:** రాష్టాన్ని మత్తు పదార్థాల బారినుండి పూర్తిగా బయటపడే రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభు త్వం కఠినచర్యలు చేపట్టిందని, రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 'డ్రగ్స్‌కు దూరంగా, జీవితలక్ష్యాలకు దగ్గరగా' అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి, యువకుడి వద్దకు చేరేలా సమగ్రమైన అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మంగళవారం గాంధీ మెడికల్ కళాశాల స్వామి వివేకానంద ఆడిటో రియంలో రాష్ట్ర దివ్యాం గులు వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధకారిత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత చదువు, ఉద్యోగ అవకాశాలు, వ్యక్తిత్వ వికాసంలో నిలబెట్టడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా ఉందని మంత్రి అన్నారు. మత్తు పదార్థాల పెరుగుతున్న దుష్ప్రభావాల నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్ సరఫరా మార్గాలను పూర్తిగా నిర్మిలించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈగల్ స్పెషల్ యూనిట్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. నగరాల్లో, విద్యా సంస్థల పరిస రాల్లో, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార మ్‌ల్లో, డార్క్ నెట్ ద్వారా జరిగే లావాదేవీలపై ఈగల్ టీమ్ నిరంతరం నిఘా పెట్టిందని చెప్పారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో సేవలం దిస్తున్న వాలంటీర్లను మంత్రి సన్మానించారు. ఈ కార్య క్రమంలో భాగంగా కళాకారులు ప్రదర్శించిన నాటక ప్రదర్శన, ఆటలు, పాటలు యువతలో మత్తు వ్యసనంపై అవగాహన కార్యక్రమాలు వీక్షకు లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్య క్రమంలో ఉమెన్, చైల్డ్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి అనితా రామచంద్రన్, టిజి ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, సీనియర్ సిటిజన్ ట్రాన్స్‌జెండర్ విభాగం డైరెక్టర్ శైలజ, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్, గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సీతారాం, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీపరమైన రిజర్వేషన్ల వల్ల బిసిలకు నష్టం

## చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

## రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం డిమాండ్

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు పార్టీ పరమైన రిజర్వేషన్ల వల్ల నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అభిప్రాయ పడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్ట బద్ధంగా కల్పించాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.

చట్ట బద్ధంగా కాకుండా పార్టీపరంగా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం సమంజసం కాదన్నారు. బీసీ లకు కాంగ్రెస్ అధిష్టానంపై నమ్మకం పోతుందని హెచ్చరించారు, కామారెడ్డి డిక్లరేషన్ మేని ఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలన్నారు. ఒకవైపు రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లు పెంచుతామని చెబు తుంటే రాష్ట్రంలో మాత్రం రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాజకీయాలు చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నా మన్నారు. ప్రభుత్వం ఇదేవిదంగా వ్యవహారిస్తే బీసీలు రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని నరేందర్ గౌడ్ హెచ్చరించారు

# సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాలి

## ప్రజాభవన్‌లో సిఎం ప్రజావాణి లీగల్ క్లినిక్ ప్రత్యేక కార్యక్రమం.. 55 బాధిత కుటుంబాల హాజరు




ప్రజాభవన్‌లో సిఎం ప్రజావాణి లీగల్ క్లినిక్ ప్రత్యేక కార్యక్రమం

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 18, ప్రభాతవార్త:** శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకుని వెళ్తున్న ప్రస్తుత ఆధునిక కాలంలోనూ దళితులు, గిరిజనులు, మహిళల పట్ల వివక్షత కొనసాగడం బాధాకరమని, సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సిఎం ప్రజవాణి ఇన్‌చార్జ్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణీ,దళిత స్త్రీశక్తి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన లీగల్ క్లినిక్ ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలు మహిళల పట్ల జరుగుతున్న వివక్షత,అత్యాచారాలకు గురైన మహిళల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసికెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం ప్రజావాణీ స్టేట్ నోడల్ అధికారి సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లా డుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలు మహిళల పట్ల జరిగిన దాడులు, అన్యా యాలను మానవతా దృక్పథంతో పరిష్కరించి బాద్యులపై చట్ట ప్రకారం చర్యలు చేపడతామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 55 మంది బాధితులు వచ్చి తమ సమస్యలు చెప్పి పునరావాసం కల్పించాలని,పరిహారం ఇప్పించాలని, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు.దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి,ఎన్ఆర్ఐ అడ్వైజర్ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ వినోద్‌కుమార్, సాం ఘిక సంక్షేమ శాఖ కమీషనర్ క్షితిజ, గిరిజన సంక్షేమ శాఖ అడిషినల్ కమీషనర్ సర్వేశ్వరరరెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, విజయేందర్‌రెడ్డి, డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ, మూడు పోలీసు కమిషనరేట్ల నుంచి సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# తొలిసారి బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థ

## నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం

## మహేశ్వరం, చౌటుప్పల్‌లో 1,500 మెగావాట్ల యూనిట్లు

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణలో తొలిసారిగా బాటరీ ఇంధన నిల్వ వ్యవస్థ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. తొలి దశలో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌కు నిరంతర విద్యుత్ సరఫరా, గరిష్ట డిమాండ్‌ను ఎదుర్కోవడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యుత్ శాఖ వీటిని ఏర్పాటు చేస్తోంది. ఈ నిర్ణయం రాష్ట్ర విద్యుత్ రంగంలో గ్రిడ్ ఆధునీకరణ దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగుగా పరిగణించవచ్చునని చెబుతోంది. రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు జెన్‌కోకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ప్రాంతాల్లో రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) కు ఇప్పటికే ఉన్న 400 కేవీ సబ్‌స్టేషన్లలోని ఖాళీ స్థలాల్లోనే ఈ వ్యవస్థలను నెలకొల్పనున్నారు. ఈ ప్రాజెక్టు కింద ఒక్కోచోట 750 మెగావాట్ల చొప్పున మొత్తంగా 1500 మెగావాట్ల సామర్థంతో ఈ బెస్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. సాంకేతికంగా, ఒక్కో కేంద్రంలో 187.50 మెగావాట్ల సామర్థం గల నాలుగు యూనిట్ల చొప్పున పనిచేస్తాయి. తక్కువ డిమాండ్ సమయంలో విద్యుత్‌ను నిల్వ చేసి, అధిక డిమాండ్ సమయంలో సరఫరా చేయనుంది. ఇది విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గిస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ భావిస్తోంది. ఈ విధానంలో తక్కువ డిమాండ్ ఉన్న సమయాల్లో ఉత్పత్తి అయిన అదనపు విద్యుత్‌ను బ్యాటరీలలో నిల్వ చేస్తారు. రోజు డిమాండు గరిష్ఠ స్థాయికి చేరే సమయాల్లో నిల్వ ఉన్న ఈ కరెంటును చౌటుప్పల్ నుంచి మహేశ్వరం నుంచి నేరుగా గ్రేటర్ హైదరాబాద్‌కు సరఫరా చేస్తారు. దీనివల్ల అధిక ధరలకు భారత ఇంధన ఎక్స్ఛేంజిలో విద్యుత్ కొనాల్సిన అవసరం తప్పి డిస్కంపై ఆర్థిక భారం తగ్గుతుందని అంచనా వేస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండు గరిష్ట స్థాయికి చేరే సమయంలో ముఖ్యంగా సాయంత్రం వేళల్లో, డిస్కంలు అధిక ధరలకు భారత ఇంధన ఎక్స్ఛేంజిలో కరెంటు కొనాల్సి వస్తుంది. కాగా ఈ ప్రాజెక్టును బిల్డ్, ఓన్, ఆపరేట్ విధానంలో నిర్మించనుంది. ఈ విధానంలో ప్రైవేట్ సంస్థలే నిర్మాణాన్ని చేపట్టి నిర్వహించి నిర్ణీత కాలం పాటు తమ అధీనంలో ఉంచుకుంటాయి.

# ఉద్యోగుల వివరాల సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి

## బిసి కమిషన్ సమీక్ష

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మరికొన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు రావాల్సి ఉందని బీసీ కమిషన్ వెల్లడించింది. హైదరాబాద్ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ సమావేశం జరిగింది. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు డేటా సేకరణ పురోగతిని సమీక్షించారు. వివరాలు సమర్పించని విభాగాలపై దృష్టి సారిస్తూ, వచ్చే 10 రోజుల్లో ఆ శాఖల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కమిషన్ తెలిపింది.ఈ సమా వేశంలో ఉద్యోగుల వివరాల సేకరణపై ప్రధాన చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుల వివరాల సేకరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. మొత్తం 390 ప్రభుత్వ విభాగాల్లో 345 విభాగాలు ఇప్పటికే వివరాలను సమర్పించగా, మరో 45 విభాగాలు ఇంకా డేటాను అందించాల్సి ఉందని బీసీ కమిషన్ స్పష్టం చేసింది. అదేవిధంగా, విద్యార్థుల కుల వివరాల సేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని నిర్ణయించారు.

# 3వేల కోట్లు ముఖ్యం కాదు, 42 శాతం రిజర్వేషన్లు శాశ్వతం

## 21న జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శనలు

## రాష్ట్ర బిసి జాక్ చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్, అజయ్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 18, ప్రభాత వార్త:** బిసిలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వే షన్‌లు కల్పిస్తామని, ముఖ్యమంత్రి, మంత్రు లు పదేపదే ప్రకటనలు చేసి, యేడాదిపాటు నమ్మించారని ప్రస్తుతం కేబినెట్ నిర్ణయం ప్రకారం పార్టీ పరంగా మాత్రమే రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రకటించడం నమ్మించి మోసం, దగా చేయడ మేనని రాష్ట్ర బిసి జాక్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ధ్వజమెత్తారు. ఇందుకు నిరసనగా ఈ నెల 21న రాష్ట్రవ్యాప_ంగా జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓ కార్యాలయాల లక్షలాది మంది బిసిలు నిరసనలు చేపడతారని ఆయన హెచ్చరించారు. మంగళ వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో పంచాయతీ ఎన్నికలు పార్టీ పరంగా ఉండవని, కాని పార్టీపరంగా 42 శాతం రిజర్వే షన్‌లు కల్పిస్తామని చెప్పడం దారుణమన్నారు. మార్చిలోగా ఎన్నికలు పూర్తి చేయకపోతే కేంద్రం నుంచి వచ్చే మూడువేల కోట్లు పోతాయని సిఎం ప్రకటించారని, మూడు వేల కోట్లు ముఖ్యం కాదని, బిసిలకు రిజర్వేషన్ మాత్రమే ముఖ్యమని స్పష్టం చేశారు. సమావేశానికి జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బాణాల అజయ్ కుమార్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్, నాయకులు సి.రాజేందర్, అనంత య్య, పగిళ్ల సతీష్, జిల్లపల్లి అంజీ, రాజ్ కుమార్, రాందేవ్‌మోడీ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతి, పేదల అభ్యున్నతికి ప్రాణాలు అర్పించిన మహనీయురాలు ఇందిర

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, నవంబరు 18:** దేశ ప్రగతి, పేదల అభ్యున్నతి కోసం తన ప్రాణాలు అర్పించిన మహనీయురాలు ఇందిరా గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమెను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకొని ఆమె ముందుకు సాగారని ముఖ్యమంత్రి తెలిపారు. రాజభరణాల రద్దు... బ్యాంకుల జాతీయీకరణ, 20 సూత్రాల కార్యక్రమం, అణు శక్తి అభివృద్ధి, గ్రీన్ రివల్యూషన్, మహిళా సాధికారత, భూ సంస్కరణలు వంటి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి, పేదల అభ్యున్నతికి ఇందిరా గాంధీ ఎంతగానో కృషి చేశారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ పాలనను ఆదర్శంగా తీసుకుని.. ఆ మహనీయురాలి స్ఫూర్తితోనే పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ పేరిట అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం చెప్పారు.

# గుడిసెలో గిరిజన విద్య

## అమలుకాని మధ్యాహ్నభోజన పథకం

## స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్‌రమేష్



పూరిగుడిసెలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు

**లింగాపూర్, నవంబరు 18, ప్రభాతవార్త :** కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలోని హీరాపూర్ గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల పూరిగుడిసెలో కొనసాగుతున్న వింత ఘటన వెలుగులలోకి వచ్చింది. ఇట్టి విషయమై గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా కూలి పని చేస్తామని ఉదయమే లేచి పంట పొలాలకు వెళ్తామని, తమ పిల్లలకు మధ్యాహ్న భోజన పథకము లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాము ఇంటికి వచ్చేసరికి సాయంత్రం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి, తమ పిల్లలకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని, పాఠశాలకు పక్క భవనం నిర్మించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల జిల్లా కమిటీ చైర్మన్ రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నేటి బాలలే రేపటి పౌరులని, పసి పిల్లలని తెలిసికూడా నిర్లక్ష్యం వహించడం శోచనీయమని,ఇట్టి విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలియజేశారు.

# విజయ డెయిరీ ఉత్పత్తుల విస్తరణ

## రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** విజయ డెయిరీ ఉత్పత్తులను మరిన్ని ప్రాంతాలకు విస్తరింప చేయాలని తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య నిర్ణయించింది. ఇందులో భాగంగా విజయ డెయిరీకి సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం విజయ ఉత్పత్తులు కేవలం హైదరాబాద్‌లోనే లభ్యమవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉత్పత్తులను రాష్ట్రం మొత్తం మీద అందుబాటులోకి తీసుకురానుంది. విజయ పాల ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు జిల్లా, ప్రాంతీయ పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది.. అంతేకాకుండా శీతల గిడ్డంగులను కూడా నిర్మించి పాల ఉత్పత్తును నిల్వ ఉంచాలని భావిస్తోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను మన విజయ, మన తెలంగాణ పేరిట ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకు గాను విజయ డెయిరీ పాల ఉత్పత్తుల సరఫా నిమిత్తం ప్రత్యేకంగా రూపొందించిన ఐదు కొత్త వాహనాలను విజయ డెయిరీ ఛైర్మన్ అమిత్‌రెడ్డి, ఎండి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో ముందుగా వరంగల్, సిద్దిపేట్, ఆదిలాబాద్ జిల్లాల్లో విజయ డెయిరీ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకున్నట్లు ఈ సందర్భంగా వారు వెల్లడించారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 298

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 18, ప్రభాతవార్త:** మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 298 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 90 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 54, ఇందిరమ్మ ఇండ్ల కోసం 90, మున్సిపల్ శాఖకు 17, ప్రవాసీ ప్రజావాణికి 2, దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 45 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.

# ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు : జాన్‌వెస్లీ

**హైదరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి మరణించడం బాధాకరమని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సురేందర్ రెడ్డి మరణం వామపక్ష శ్రేణులకు, కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఏఐఎఫ్‌బి జాతీయ కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని అన్నారు. వామపక్షాలు చేపట్టిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. సురేందర్‌రెడ్డి మృతికి సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తుందని.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నట్టు జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రతి మహిళా సంఘానికి ఒక్కో బస్సు: సర్కార్

## కోటి మహిళలను కోటీశ్వరులుగా చేసే ప్రభుత్వ సంకల్పానికి మరో ముందడుగు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 18:** రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ కొలువు తీరిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలకు శ్రీకారం చుట్టింది. అందులో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సహాయం పరిమితి పెంపు ఒకటి కాగా రెండవది మహిళలకు మేలు చేసే మహాలక్ష్మి పథకం. మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి మహిళా సాధికారత దిశగా తొలి అడుగు వేసింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో మహిళలభాగస్వామ్యం పెంచడానికి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా పలు పథకాలను అమలు చేస్తున్నది. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరురాలను చేయాలనే సంకల్పంతో స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలను అందిస్తోంది. ఈ మేరకు సమాచార శాఖ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. క్రమశిక్షణకు, నమ్మకానికి ప్రతీకలుగా నిలిచిన మహిళా సంఘాలకు ఒకపక్క రుణాలను అందిస్తూ వారి ఆర్థిక స్వావలంబన కోసం పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుతోపాటు మండల మహిళా సమాఖ్యల ఆదాయం పెంపు కోసం సెర్ప్ ద్వారా దేశంలోనే మొదటి సారిగా 600 బస్సులు కొనుగోలు చేసి టిజిఆర్టీసికి అద్దెకి ఇచ్చేలా పథకాన్ని రూపొందించింది. మహిళా సంఘాలు తీసుకునే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీని అందిస్తుంది. ఈ పథకం అమలుకు టిజిఆర్టీసి, సెర్ప్‌ల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజా రవాణాలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర పోషించడంలో ముందడుగు పడింది. మొదటి దశలో సెర్ప్ ఐడెంటిపై చేసిన 17 జిల్లాలలోని 151 మండల మహిళా సమాఖ్యలను ఒక్కొక్కటి చొప్పున 151 బస్సులు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించింది. రెండవ దశలో 449 బస్సులను కొనుగోలు చేస్తారు. ఒక్కొక్క బస్సుకు 36 లక్షల వ్యయం కాగా అందులో 6లక్షలను మండల మహిళా సమాఖ్య తన సొంత నిధులను ఖర్చు చేస్తుంది. మిగతా 30 లక్షలను కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్‌గా అందించారు. టిజిఆర్టీసి ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 అద్దెను చెల్లిస్తుంది. ఇందులో రూ.19,648ఆపరేషన్ ఎక్స్పెండీచర్ గా ఖర్చు చేసుకొంటున్నారు. మిగతా 50 వేలను రుణ వాయిదాగా చెల్లిస్తుంది. ఇప్పటివరకు టిజిఆర్టీసి అయిదు వాయిదాలు విడుదల చేసింది. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభమైన ఈ పథకంతో మహిళా సంఘాలు లాభాలు గడిస్తున్నాయి. టిజిఆర్టీసి ఇప్పటివరకు 151 మహిళా సమాఖ్యలకు అయిదు కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. టిజిఆర్టీసికి మహిళా సంఘాలు బస్సులను అద్దెకిచ్చే పథకంతో గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ప్రైవేటు వ్యక్తుల బస్సులను ఆర్టీసీ అద్దెకు తీసుకొని నిర్వహించేది. నేడు మహిళా సంఘాలు ఆర్టీసికి అద్దె బస్సులను అందజేస్తున్నాయి. ఈ పథకం మహిళా సాధికారతకు, సామాజిక భద్రతకు అండగా నిలుస్తుంది. వారికి స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుంది. ప్రజా ప్రభుత్వ అమలు చేస్తున్న వినూత్న పథకాలతో రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతున్నారు. వివిధ రంగాలలో రాణించి తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ప్రభుత్వం అందించిన సహకారంతో ముందడుగు వేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యమే కాక ఆ బస్సులకు ఓనర్లను చేయడం చాలా సంతోషకరమైన విషయం బస్సుల పైన ఇందిరా మహిళా శక్తి మండల సమైక్య పేరు చూసినప్పుడల్లా అది మా బస్సు అనే భావం ఆ బస్సుకు మేము ఓనర్లము అనే భావం మాకు చాలా గౌరవంగా అనిపిస్తుంది. మా మంత్రి సీతక్కకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మా మండల సమైక్య మహిళలందరి తరఫున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు ములుగు జిల్లా, ఏటూరునాగారం మండల సమాఖ్య అధ్యక్షురాలు పి. పద్మ పేర్కొన్నారు.



మంగళవారం పుట్టపర్తిలో సత్యసాయి రథాన్ని లాగుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఆర్‌జె.రత్నాకర్, ఏపి మంత్రి సత్యప్రసాద్

# వైభవంగా సత్యసాయి రథోత్సవం

## హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు మంత్రులు, ప్రముఖులు

### సత్యసాయి శతజయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధి:** సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాలలో భాగంగా పుట్టపర్తి పుర వీధులు సర్వం సాయి మయంగా మారాయి. ఆశేష జనవాహిని మధ్య 'సత్యసాయిరథోత్సవ్ఞం వైభవంగా జరిగింది. భక్తుల హృదయాల ను హత్తుకొనే స్వామి వారి కీర్తనలతో గతంలో కంటే భిన్నంగా వేణుగోపాల స్వామి రథోత్సవం స్థానంలో సత్యసాయి రథోత్సవాన్ని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వర్గాలు నిర్వహించాయి. వేద పండితుల వేద పఠనంతో మంగళవారం ఉదయం నుండే సాయినామ స్మరణలు, వివిధ కళారూపాల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత శోభతో పుట్టపర్తి పుర వీధులు పులకించాయి. భానుడి ఉదయపు కిరణాలు తాకగానే పెద్దవెంకమరాజు కళ్యాణ మండపం వద్ద రథోత్సవం వైభవోపేతంగా ముందుకు కదిలింది. సత్యసాయి రథోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా తయారు చేసిన వెండి రథం కళాకృతులు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా రథం పైభాగంలో గోపురాకార శిరస్సు, చుట్టూ స్వామివారి జీవన సందేశాలను స్మరింపజేసే శిల్పాలు, గంటల అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీసత్యసాయి రథం యొక్క పసిడి కాంతుల తేజస్సు చూస్తూ భక్తులు తమను తాము మైమరచి పోయారు. తొలుత జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సత్యసాయి నూతన రథాన్ని రిమోట్ సహాయంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, ట్రస్ట్ సభ్యులు నాగనంద, స్థానిక శాసనసభ్యులు సింధూరరెడ్డి, పరిటాల సునీతమ్మ, మాజీమంత్రిపల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితర ప్రముకులు పాల్గొన్ని బాబా పసిడి విగ్రహం, వెండి రథం, ఆధ్యాత్మిక కళాప్రదర్శనలను ప్రత్యక్షంగా వీక్షించి మధురానుభూతి చెందారు. ప్రత్యేక డ్రోన్‌ల ద్వారా సత్యసాయి రథోత్సవం సందర్భంగా పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో 1,100 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో శ్రీ సాయి సత్యనారాయణ వ్రతంను ఆచరించారు. నూతనరథం ప్రశాంతి నిలయం ఉత్తర గోపుర ద్వారం వద్దకు చేరుకోగానే ప్రత్యేకంగా తయారుచేయించిన భగవాన్ సత్యసాయి పసిడిఉత్సవవిగ్రహాన్ని రథంపై ఉంచుతున్నవేళ భక్తులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షించాలన్న ఆకాంక్షతో భారీసంఖ్యలో ఎగబడ్డారు.

# ఇది మా కుటుంబ సమస్య.. నేనే పరిష్కరిస్తా

## కుటుంబంలో లుకలుకలపై అధినేత లాలూప్రసాద్ యాదవ్





**పాట్నా, నవంబరు 18:** బీహార్ ఎన్నికల ఫలితాల అనంతరం ఆర్జేడీ అధినేత లాలూ యాదవ కుటుంబంలో విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్న విషయం తెలిసిందే. ఫలితాలు వెలువడిన తర్వాత లాలూ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పేశారు. అంతేకాదు, తన కుటుంబంతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు సోషల్ మీడియా ద్వారా సంచలన ప్రకటన చేశారు. 'తేజస్వీ సన్నిహితులు సంజయ్, రమీజ్ నాతో బలవంతంగా ఇలా చేయిస్తున్నారు. అన్ని తప్పులకు నన్ను బాధ్యులను చేయిస్తున్నా'రని ఆరోపించారు. రోహిణి ఆరోపణలు ఆర్జేడీలో ప్రకంపనలు సృష్టించాయి. ఈ నేపథ్యంలో కుటుంబంలో చీలికలపై లాలూ యాదవ్ తొలిసారి స్పందించారు. ఇది కుటుంబ అంతర్గత విషయమని.. తాను పరిష్కరిస్తానంటూ వ్యా ఖ్యా నించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో లాలూ యాదవ్ సమావేశం నిర్వహిం చారు. పాట్నాలో జరిగిన సమావేశానికి లాలూ యాదవ్ భార్య రబ్రీ దేవి, పెద్ద కుమార్తె మిసా భారతి, జగదానంద్ సింగ్ సహా సీనియర్ ఆర్జేడీ నాయకులు హాజరయ్యారు. ఇక ఈ సమావేశంలో ఆర్జేడీ ఎల్పీ లీడర్‌గా తేజస్వీ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ మీటింగ్ సందర్భంగా ఫ్యామిలీలో విభేదాల గురించి లాలూ ప్రస్తావించారు. 'ఇది కుటుంబ అంతర్గత విషయం. కుటుంబంలోనే పరిష్కరించాలి. ఈ సమస్యను నేను పరిష్కరిస్తా' అని వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ కూటమి ఘోర పరాభవం పాలైన విషయం తెలిసిందే. 243 అసెంబ్లీ స్థానాలకు గానూ ఆర్జేడీ కేవలం 25 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది.

అలాగే ఎన్నికలకు ముందు లాలూ పెద్దకుమారుడు తేజ్‌ప్రతాప్ యాదవ్ పార్టీనుంచి, కుటుంబంనుంచి కూడా ఉద్వాసనకు గురికావడంతో కొత్తపార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీచేసారు. దీనితో ఈ వ్యవహారం ఆర్జేడికి షాక్ ఇచ్చింది. ఓట్లను చీల్చినట్లయింది. ఈక్రమంలో లాలూ కుటుంబంలో లుకలుకలు మరింత బయటికి వచ్చాయి. తనను తేజస్వియాదవ్ ఆయన సహాయకులే బలవంతంగా బయటకు పంపించారంటూ ఆమె ఆరోపణలుచేయడంతో ఇపుడు ఆర్జేడి వార్తల్లోకి వచ్చింది. ఇదిలా ఉంటే శాసనసభా పక్ష నేతగా తేజస్వియాదవ్‌ను ఎన్నుకోగా ఆయన విపక్ష నేతగా కొనసాగేందుకు తిరస్కరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అయితే తండ్రి లాలూయాదవ్ సర్దిచెప్పడంతో విపక్షనేతగా కొనసాగేందుకు అంగీకరించారు. ఓటమికి పూర్తిగా తానే బాధ్యత వహిస్తానని తేజస్వి పార్టీ సమావేశంలో వెల్లడించినట్లు సమాచారం. లాలూ కుటుంబంలో లుకలుకలకు సంజయ్‌యాదవ్‌కారణమన్న ఆరోపణలను తేజస్వి ఖండించారు. తన విశ్వసనీయ అనుయాయుల్లో సంజయ్ ఒకరని, పార్టీప్రచార వ్యూహాలను రూపొందించి అభ్యర్థుల ఖరారులో కూడా కీలక భూమిక పోషిస్తారన్నారు. ఎంపి సంజయ్ యాదవ్, మిత్రుడు రమీజ్‌ఖాన్‌లే తనను బయటికి పంపించేందుకు వొత్తిడిపెంచారన్న ఆరోపణలను తేజస్వి ఖండించారు.

# 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో గుస్సాడి నృత్యం

## 20 నుంచి 28 వరకు గోవాలో చిత్రోత్సవం

**హైదరాబాద్, నవంబరు 18,ప్రభాతవార్త:** గోవాలో శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న భారత అంతర్జాతీయ 56వ చలన చిత్రోత్సవం లో తెలంగాణ గిరిజన నృత్యం గుస్సాడిని ప్రదర్శించనున్నారు. నవంబర్ 20 నుంచి 28గోవాలో ప్రతిష్ఠాత్మక ఐఎఫ్‌ఎఫ్‌ఐలో దేశంలోని అత్యుత్తమ సినిమాలతో పాటు వైవిధ్యమైన కథనాలు, వినూత్నమైన కళలకు వేదికగా నిలుస్తుంది. ఈ చిత్రోత్సవం సాంస్కృతిక వైవిధ్యం ప్రదర్శనకోసం వేదికగా ఉపయోగించుకొని వేడుకగా జరుపుకుంటుంది. చలన చిత్రోత్సవంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సాంస్కృతిక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సంగీత, నాటక విభాగం) వివిధ గిరిజన, జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇవ్వనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకలో ప్రదర్శనలు ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా 10 సంప్రదాయ నృత్య బృందాలను ఎంపిక చేయటం, భారత సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా నవంబర్ 20వ తేదీన ప్రారంభ వేడుకలో తెలంగాణ గోండు గిరిజన కళాకారులు సంప్రదాయ గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ కళాకారులు గోవాలోని తాజ్ సిద్ధాడే హోటల్, కళా అకాడమీ, శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియం, ఐనాక్స్, ఇతర ప్రదేశాలతోపాటు ఐఎఫ్‌ఎఫ్‌ఐ వేదికపైన కూడా ప్రదర్శన ఇవ్వనున్నారు.

# చిన్నారుల అదృశ్యం కేసులు పెరుగుదల ఆందోళనకరం : సుప్రీం

**న్యూఢిల్లీ, నవంబరు 18:** దేశంలో చిన్నారుల మిస్సింగ్ కేసులు రోజురోజుకు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి 8 నిమిషాలకు ఒక చిన్నారి తప్పిపోతున్నట్లు వచ్చిన మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ.. మిస్సింగ్ కేసులు దేశంలో తీవ్రమైన సమస్యగా మారుతున్నాయని పేర్కొంది. దత్తత ప్రక్రియ కఠినంగా ఉన్నందువల్ల .. పిల్లలు లేనివారు చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటున్నారని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సంక్లిష్టంగా ఉన్న దత్తత ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, అక్రమ దత్తతను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో పిల్లలను దత్తత తీసుకునే విధానం ఎక్కువయ్యిందని.. దత్తత ముసుగులో చిన్నారుల అక్రమ రవాణా, అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఓ స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తప్పిపోయిన పిల్లల కేసులపై విచారణ చేపట్టడానికి నోడల్ అధికారిని నియమించడానికి ఆరు వారాల సమయం ఇవ్వాలని కేంద్రం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అందుకు నిరాకరించి ధర్మాసనం డిసెంబరు 9 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. మిస్సింగ్ కేసులను నిర్మూలించడానికి ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని పేర్కొంది. కాగా తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సుప్రీంకోర్టు గత నెల 14న కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి.. దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్ అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి.. తగిన చర్యలు తీసుకోవచ్చని తెలిపింది.

# అల్‌ఫలా వర్సిటీ ఛైర్మన్ జవాద్‌అహ్మాద్ సిద్ధీకి అరెస్ట్

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీపేలుడు కేసులో హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన అల్‌ఫలా యూనివర్సిటీ పేరు ప్రముఖంగా రావడంతోకేంద్ర దర్యాప్తుసంస్థలు యూనివర్సిటీ మూలాలపై నిఘా పెంచిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే మంగళవారం ఏకకాలంలో వర్సిటీ అన్నివిభాగాల్లోను సోదాలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మనీలాండరింగ్‌కేసుకు సంబంధించి గ్రూప్ ఛైర్మన్ జవాద్ అహ్మాద్ సిద్ధిఖీని అరెస్టుచేసారు. మొత్తం 24 ప్రాంతాల్లో వర్సిటీకి సంబంధించిన కేంద్రకార్యాలయంతోపాటు ఇతర విభాగాల్లోను సోదాలునిర్వహించారు. ఉగ్రఫైనాన్సింగ్‌కు సంబంధించి మనీలాండరింగ్‌ఝరిగిందన్న ఆరోపణలపై సిద్ధిఖీని అరెస్టుచేసినట్లుతప్రకటించింది. సిద్ధికీ ఇంట్లోఉ, వరిసటీ ప్రధాన కార్యాలయం, ట్రస్టీలు,ప్రమోటర్ల ఇళ్లు కార్యాలయాల్లోను ఏకకాలంలో సోదాలునిర్వహించారు. నగదు అక్రమ చెలామణి నిరోధక చట్టం కింద అరెస్టుచేస్తున్నట్లు ఈడీ అధికారులు ప్రకటించారు. తనిఖీల్లో ఈడీ అధికారులు మొత్తం రూ.48 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

# తిరుమల 'వైకుంఠద్వారం' ఆన్‌లైన్



మంగళవారం సమావేశమైన టిటిడి బోర్డు

## తొలి మూడురోజులు ఇ-డిప్ సర్వదర్శన టోకెన్లు

## ఆ వారంరోజులు నేరుగా వస్తే సాధారణ సర్వదర్శనమే

## టిటిడి బోర్డు కీలక నిర్ణయం

**తిరుమల,నవంబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమంప్రకారం పూజ లందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుం ఠద్వారదర్శనాలను పూర్తిగా ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనే విడుదలచేసేలాతిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. గతంకంటే భిన్నంగా డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి ,2026 నూతన ఆంగ్ల సంవత్సరం జనవరి 1న దర్శనాలకు సంబంధించి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఈ డిప్ ద్వారా సర్వ దర్శనం టోకెన్లు విడుదల చేస్తారు. ఈ టోకెన్లు పొందిన వారిని మాత్రమే వైకుం ఠద్వార దర్శనానికి అనుమతిస్తారు. జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు వారం రోజులు ఎటువంటి దర్శన టిక్కెట్లు, టోకెన్‌లు లేకుండానేరుగా తిరుమలకు వచ్చినా సామాన్యభక్తులను యధావిధిగా సర్వదర్శనంలో అనుమతిస్తారు. డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో మూడురోజులు ఆన్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్లు తప్ప మిగిలిన అన్ని దర్శనాలు రద్దుచేశారు. వివిఐపిలు, విఐపిలు స్వయంగా వస్తేనే వారికి వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు. జనవరి 2వతేదీ నుండి 8వరకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శనాల టిక్కెట్లురోజుకు 15వేలు, శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు రోజుకు వెయ్యిలెక్కన ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గత ఏడాది వరకు సామాన్యభక్తుల కోసం ఆఫ్‌లైన్‌లో అమలైన టోకెన్ల విధానం పూర్తిగా రద్దుచేశారు. ఈ ఏడాది డిసెంబర్ 30,31తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దర్శనాలతోబాటు అదనంగా మరో ఎనిమిదిరోజులవైకుంఠ ద్వార దర్శనాల విధానంపై మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ధర్మకర్తలమండలి అత్యవసర సమావేశమైంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం, వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నర్సిరెడ్డి, పనబాకలక్ష్మి, శాంతారామ్, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

**గతంకంటే భిన్నంగా:** 2020వ సంవత్సరం వరకు తిరుమల ఆలయంలో వైకుంఠద్వార దర్శనం ఏకాదశి, ద్వాదశి ఘడియల్లోమాత్రమే 48గంటలు పాటు ద్వారాలు తెరచి భక్తులను అనుమతించేవారు. ఆ తరువాత సామాన్యభక్తుల నుండి వచ్చిన వినతులు, వైష్ణవాలయం శ్రీరంగంలో అమలవుతున్న పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలను అప్పటి వైసిపి బోర్డు అమలుచేసింది. అయితే ఆన్‌లైన్‌తోబాటు ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో పదికౌంటర్లలో ఉచిత సర్వదర్శన టోకెన్లు జారీచేసి అనుమ తించేవారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన విషాద ఘటనలతో టోకెన్లకోసం వచ్చి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, యాభైమందివరకు క్షతగాత్రులయ్యారు. ఈ ఘట నతో టిటిడి ప్రస్తుత బోర్డు కొన్ని మార్పులు చేపట్టింది. గత ఏడాది వరకు పదిరో జుల వైకుంఠద్వార దర్శనాల్లో అమలైన ఆఫ్‌లైన్‌ను పూర్తిగా రద్దుచేశారు.




మృతుల నివాసం వద్ద చేరుకున్న బంధువులు

# శోకసముద్రంలో మునిగిపోయిన సౌదీ ప్రమాద మృతుల కుటుంబసభ్యులు, బంధువులు

**మలక్‌పేట, నవంబరు 18, ప్రభాతవార్త:** మక్కా నుండి మదీనాకు బస్సులో వెళ్తుండగా జరిగిన బస్సు ప్రమాదంలో ముసారాంబాగ్‌లో నివసిస్తున్న తల్లి, కుమార్తెలు మరణించడంతో వారి కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. మక్కా నుండి మదీనాకు బస్సులో వెళుతుండగా జరిగిన బస్సు అగ్ని ప్రమాదంలో ముసారాంబాగ్ లో నివసిస్తున్న వ్యాపారవేత్త సైయ్యద్ అబ్దుల్ రషీద్ భార్య అమీనా బేగం, పెద్ద కుమార్తె అనీస్ ఫాతిమాలు మృతి చెందిన విషయం విధితమే. మదీనా సమీపంలో జరిగిన బస్సు అగ్ని ప్రమాదంలో అమీనా బేగం, అనీస్ ఫాతిమాలు మరణించారని తెలియడంతో బంధువులు ముసారాంబాగ్ లోని వారి నివాసానికి చేరుకుని విలపించారు. కాగా సైయ్యద్ అబ్దుల్ రషీద్, కుమారుడు సైయ్యద్ ఈర్షద్ లు మదీనాకు ఇంకా వెళ్ళలేదని, నగరంలోని హజ్ హౌస్ కి వెళ్లడం జరిగిందని వారి బంధువులు వివరించారు. మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మాద్ బలాల తన స్వంత ఖర్చులతో మృతుల కుటుంబ సభ్యులను మదీనాకు పంపించడానికి ఏర్పాటు చేయగా వారిలో సయ్యద్ ముక్తార్ మంగళవారం సాయంత్రం మదీనాకు బయలుదేరి వెళ్లడం జరిగిందని, మరొకరు ఫైసలుద్దీన్ బుధవారం వెళ్లన్నట్లు బంధువులు తెలియజేశారు.



# చిత్ర పరిశ్రమకు అండగా నిలవాలి

## నిర్మాత సి. కళ్యాణ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 18, ప్రభాతవార్త:** చిత్రపరిశ్రమకు రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాలు అండగా నిలవాలని సినీనిర్మాత సి. కళ్యాణ్ అన్నారు. ఫిలించాంబర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కళ్యాణ్‌తోపాటు నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడుతూ.. చిత్రపరిశ్రమకు పట్టిన పైరసీ బూతాన్ని ఆటకట్టించడంలో పోలీసులు, ప్రభుత్వం మొదటి అడుగు వేశారని, ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేశారన్నారు. సోషల్ మీడియా ద్వారా పైరసీ వల్ల జరిగే నష్టాన్ని వివరించాలన్నారు. త్వరలోనే తమకు అండగా నిలిచిన వారిని చిత్రపరిశ్రమ తరుపున సత్కరించుకుంటామని తెలిపారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ పైరసీ వల్ల చిన్న సినిమాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పైరసీ వల్ల ఎంతో మంది నష్టపోతున్నారని, వీరికి మరింతగా అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సినీ కార్మిక సంఘాలకు చెందిన వల్లభనేని అనీల్‌కుమార్, అమ్మిరాజు, వీరశంకర్, ముత్యాల రాంప్రసాద్, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్‌లో మృతుల కుటుంబసభ్యుల నివాసం వద్ద నెలకొన్న విషాదం

**హైదరాబాద్ (చిక్కడపల్లి) నవంబరు 18, ప్రభాతవార్త:** సౌదీ అరేబియా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యానగర్ ప్రాంతానికి చెందిన వారి ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. నిత్యం సందడిగా ఉండే ఆ ఇల్లు ప్రస్తుతం బోసిపోయింది. విద్యానగర్ కు చెందిన నసీరుద్దీన్ తన 18 మంది కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లిన సంగతి తెలిసిందే. కాగా ఈ మొక్క యాత్ర కాస్త విషాదంగా మారి తనతోపాటు తన కుటుంబ సభ్యులు కూడా ఈ ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ప్రతి ఒక్కరూ అటుగా వెళ్లే వారంతా ఆ ఇంటి వద్దకు చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించడం, జైన సంఘటన గురించి వాకాపు చేయడం, వారికి ధైర్యం చెప్తున్నారు. ఈ సంఘటన ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా తెలియడంతో ముఖ్యంగా ఇందులో చిన్న పిల్లలు కూడా మరణించడం మరింత విషాదాన్ని కలిగించింది. విద్యానగర్ ప్రాంతంలోని పొరుగువారు, కుటుంబానికి దగ్గరగా ఉన్నవారు, స్నేహితులు ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సందర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన 18 మంది యాత్రలో దుర్మరణం కావడం పట్ల పలువురు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

### బండారు దత్తాత్రేయ పరామర్శ

హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ విద్యానగర్ లోని సౌదీ బస్సు యాత్రలో మృతి చెందిన కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని ఎటువంటి ఆందోళన చెందవద్దని అన్నారు.

### మాజీ మంత్రి మహ్మాద్ అలీ పరామర్శ

సౌది అరేబియా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నజీరుద్దీన్ కుటుంబసభ్యులను ప్రమాదానికి గల కారణాలను మాజీ మంత్రి మహ్మాద్ అలీ అడిగి తెలుసుకున్న వారు బాదితకుంటుబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బిఆర్‌ఎస్ పార్టీ తరపున అండగా ఉంటామని, మృతదేహాలు ఇండియాకు పంపించడానికి బిఆర్‌ఎస్ సౌది విభాగం తోడ్పాటునవస్తుందిని. తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు ముఠా జయసింహా, సయ్యద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

సౌదీ బస్సు ప్రమాదంలో మరణించిన విద్యానగర్ కు చెందిన కుటుంబ సభ్యులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ దుర్ఘటన జరగడం అత్యంత బాధాకరం అని మైనార్టీ నాయకుడు, స్థానికుడు ఖదీర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి మా కుటుంబాల్లో కూడా విషాదఛాయలు అలముకున్నాయని అందరితో కలిసి మెలిసి ఉండే ఈ కుటుంబం పట్ల ఆ దేవుడు ఎందుకు ఇంత పెద్ద శిక్ష వేషాలో తెలియని పరిస్థితి నెలకొని ఉందని అన్నారు. సౌదీ అరేబియా రోడ్డు ప్రమాద ఘటనలో రాంనగర్ సెయింట్ పాయిస్ హైస్కూల్కు చెందిన ముగ్గురు విద్యార్థినులు మృత్యువాత పడ్డారు. 5వ తరగతి చదువుతున్న మొహరిష్ పాతిమా(10), రైదా తాజీన్, (10), యూకేజీ చదువుతున్న ఉమైజా పాతిమా(5) మృతిచెందారు. ఈ ఘటనతో రాంనగర్ సెయింట్ పాయిస్ హైస్కూల్లో విశాద ఛాయలు అలుముకున్నాయి. వీరి మృతికి సంతాపంగా మంగళవారం పాఠశాలకు నెలవు దినంగా పాటించారు.



### ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు
# సాత్విక్, చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 సాత్విక్‌చిరాగ్ జోడీ రెండో రౌండ్‌కు చేరుకుంది. ఇదే సమయంలో ట్రీసా, గాయత్రి జోడీ నిష్క్రమించింది. మంగళవారం సిడ్నీలో జరిగిన బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 ఈవెంట్ అయిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి దూసుకెళ్లారు. టాప్ సీడ్ భారత ద్వయం చైనీస్ తైపీకి చెందిన చాంగ్ కోచి-పో లివీలను 48 నిమిషాల్లో 25-23, 21-16 తేడాతో ఓడించి, చైనీస్ తైపీకి చెందిన మరో జంట సు చింగ్ హెంగ్ మరియు వు గువాన్ జున్‌తో రౌండ్ ఆఫ్ 16 పోరుకు సిద్ధమైంది.అయితే, మహిళల డబుల్స్‌లో, నాల్గవ సీడ్ భారత జంట ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ ఇండోనేషియాకు చెందిన ఫెబ్రియానా ద్విపుజి కుసుమ-మెలిసా ట్రయాస్ పుష్పితసరి చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోయారు. ఇండోనేషియాకు చెందిన ఈ మ్యాచ్ 40 నిమిషాల్లో 21-10, 21-14 తేడాతో గెలిచింది. మూడున్నర నెలల తర్వాత భారతీయులకు ఇది మొదటి ఈవెంట్. హాంకాంగ్ సూపర్ 500 మరియు చైనా మాస్టర్స్ సూపర్ 750 లలో వరుసగా ఫైనల్స్ కు చేరుకున్న ప్రపంచ 3వ ర్యాంకర్ సాత్విక్-చిరాగ్, ప్రారంభ గేమ్ ప్రారంభంలో 2-6 తేడాతో వెనుకబడ్డారు, తైవాన్ జంట 16-14 వరకు స్వల్ప ఆధిక్యాన్ని కొనసాగించింది. భారత జోడీ 19-17తో ఆధిక్యంలోకి వెళ్లేందుకు ఆట చివరి వరకు కొనసాగింది.

### మహిళల కబడ్డీ ప్రపంచ కప్‌లో
# విజయంతో భారత్ ఆరంభం



**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్ 2025లో థాయిలాండ్‌పై అద్భుతమైన విజయంతో భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించింది. బంగ్లాదేశ్‌లోని మీర్‌పూర్‌లో మంగళవారం థాయిలాండ్‌ను 65-20 తేడాతో భారత్ జట్టు ఓడించింది. 2025 మహిళల కబడ్డీ ప్రపంచ కప్ టోర్నమెంట్‌ను ముందుగా బీహార్‌లోని రాజ్‌గిర్‌లో నిర్వహించాలని నిర్ణయించి, తరువాత అక్కడ నుండి హైదరాబాద్‌కు తరలించారు. మళ్లీ భారత్‌లో పలుమార్లు వాయిదా పడిన తర్వాత టోర్నమెంట్‌ను మీర్‌పూర్‌కు తరలించారు. మీర్పూర్‌కు తరలింపుతో 2025 మహిళల కబడ్డీ ప్రపంచ కప్ భారతదేశం వెలుపల జరిగిన మొట్టమొదటి క్రీడగా నిలిచింది. 13 సంవత్సరాల తర్వాత మహిళల కోసం కబడ్డీ ప్రపంచ కప్ నిర్వహించడం ఇదే మొదటిసారి. 2012లో బీహార్‌లోని పాట్నాలో జరిగిన ఫైనల్‌లో ఇరాన్‌ను ఓడించి, భారత్ మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. థాయిలాండ్‌ను ఓడించిన తర్వాత, భారత్ ఇప్పుడు రాబోయే రెండు రోజుల్లో తమ గ్రూప్ ఎ మ్యాచ్‌లలో బంగ్లాదేశ్ (నవంబర్ 19), జర్మనీ (నవంబర్ 20), మరియు ఉగాండా (నవంబర్ 21)తో తలపడనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 దేశాలు పోటీపడుతున్నాయి. ఆతిథ్య బంగ్లాదేశ్, చైనీస్ తైపీ, ఇరాన్, కెన్యా, నేపాల్, పోలాండ్ మరియు జాంజిబార్ ఇతర దేశాలు పోటీపడుతున్నాయి.

# వరల్డ్ కప్‌లో జర్మనీకి అర్హత
### 6-0తో స్లోవేకియా ఓటమి

**న్యూఢిల్లీ:** స్లోవేకియాను 6-0 తేడాతో ఓడించి జర్మనీ ఫిఫా ప్రపంచ కప్ 2026 కి అర్హత సాధించింది. చివరి క్వాలిఫైయర్‌లో స్లోవేకియాను ప్లేఆఫ లోకి పంపడం ద్వారా జర్మనీ వచ్చే ఏడాది ప్రపంచ కప్‌కు చోటు సంపాదించుకుంది. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు గత రెండు ప్రపంచ కప్‌లలో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించి, 15 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది, స్లోవాక్‌లు 12 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచాయి. అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడానికి జర్మన్లు, ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా ప్రారంభంలోనే నియంత్రణ సాధించే ప్రయత్నం చేశారు. 18వ నిమిషంలో అన్‌మార్క్డ్ నిక్ వోల్టెమేడ్ జర్మనీ తరపున గత మూడు మ్యాచ్‌లలో వరుసగా నాలుగో గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లాడు. సెర్జ్ గ్నాబ్రీ బాక్స్‌లోకి దూసుకెళ్లే సమయంలో స్లోవేకియా కీపర్ మార్టిన్



డుబ్రావ్కా 25వ స్థానంలో అడ్డుకున్నాడు. నాలుగు నిమిషాల తర్వాత గ్నాబ్రీ లియోన్ గోరెట్జ్కా పాస్‌ను పరిపూర్ణంగా అందుకొని గోల్ చేసి 2-0తో స్కోరునుసాధించాడు. ఫ్లోరియన్ విర్ట్జ్36వ ఆటగాడితో లెరాయ్‌సేన్‌ను డుబ్రావ్కాను దాటించి ఆటనుముగించాడు. ఐదు నిమిషాల తర్వాత విర్ట్జ్ వింగర్‌కు మరో అసిస్ట్ అందించి తన రెండవ గోల్‌ను సాధించాడు. విరామం తర్వాత రిడిల్ బాకు మరియు టీనేజర్ అస్సాన్ ఔెడ్రాగో ఒక్కొక్కరు గోల్ చేశారు.



# ఉమెన్ క్రికెట్ ఫైర్
### ఆక్షన్‌కు కసరత్తు పూర్తి
### స్మృతి రికార్డు ధర రూ.3.50 కోట్లు

**న్యూఢిల్లీ:** మహిళల క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) నాలుగో సీజన్‌కు సిద్ధమవుతోంది. ఈ మెగా టోర్నమెంట్ నాలుగో ఎడిషన్ జనవరి 7 నుంచే ప్రారంభం కానుంది. ఈసారి ఐదు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను సమర్పించగా, టోర్నమెంట్ తేదీలు, వేదికలపై నిర్వాహకులు కసరత్తు పూర్తి చేశారు. దీనికి సంబంధించి వేలంలో ఫ్రాంచైజీలు మొత్తం రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్లాబ్స్ ప్రకారంఒక క్రికెటర్‌కు గరిష్టంగా రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశం ఉంది. ప్రపంచ కప్‌లో అద్భుతంగా ఆడిన టీమిండియా సభ్యురాలు స్మృతి మంధానను ఆర్‌సీబీ రికార్డు ధర రూ.3.50 కోట్లకు రిటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మను యూపీ వారియర్స్ విడుదల చేయడం ఆశ్చర్యపరిచింది. ఇక ఒక ఫ్రాంచైజీ ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంటే,వారి పర్స్‌నుంచి రూ.9.75 కోట్లు తీసివేస్తారు. నలుగురిని చేస్తే రూ.8.75 కోట్లు, ముగ్గురిని చేస్తే రూ.7.75 కోట్లు, ఇద్దరిని రిటైన్ చేస్తే రూ.6 కోట్లు కట్ అవుతుంది. ఈసారి వేలంలో ఎక్కువ డబ్బుతో బరిలోకి దిగుతున్న జట్టు యూపీ వారియర్స్. ఈ జట్టు కేవలం శ్వేత షెరావత్‌ను (రూ.50 లక్షలు) మాత్రమే రిటైన్ చేసుకుంది. అందుకే వారి పర్స్‌లో అత్యధికంగా రూ.14.5 కోట్లు మిగిలి ఉన్నాయి. వేలంలో కీలక ఆటగాళ్లను కొనుగోలు చేసే అవకాశం యూపీ వారియర్స్‌కు ఎక్కువగా ఉంది. రెండో స్థానంలో గుజరాత్ జెయింట్స్ నిలిచింది. బెత్ మూనీ (రూ.3.5 కోట్లు), యాష్ గార్డ్‌నర్ (రూ.2.5 కోట్లు)ను రిటైన్ చేసుకొని, తమ పర్స్‌లో రూ.9 కోట్లు మిగుల్చుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. జెమీమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, మెరైన్ కాప్, అన్నబెల్ సదర్లాండ్‌ను చెరో రూ.2.2 కోట్లకు, అలాగే నిక్కీ ప్రసాద్‌ను రూ.50 లక్షలకు రిటైన్ చేసుకుంది. ఈ రిటెన్షన్ తర్వాత ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు మిగిలి ఉన్నాయి. మరోవైపు ఆర్‌సీబీ జట్టు స్మృతితో సహా, రిచా ఘోష్ (రూ.2.75 కోట్లు), ఎలిస్సా పెర్రీ (రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్‌ను (రూ.60 లక్షలు) రిటైన్ చేసుకుంది. ఆర్‌సీబీ పర్స్‌లో రూ.6.15 కోట్లు మిగిలాయి. ఇక, అన్ని జట్ల కంటే తక్కువ డబ్బుతో వేలంలోకి దిగుతున్న జట్టు ముంబై ఇండియన్స్. ఈ జట్టు నాట్ సీవర్ బ్రంట్, హర్మన్‌ప్రీత్ కౌర్, హేలీ మ్యాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి. కమలినితో సహా మొత్తం 5 ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. దీంతో వారి పర్స్‌లో కేవలం రూ.5.75 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

# వరల్డ్ బాక్సింగ్ కప్‌లో హితేష్, పవన్ సంచలన విక్టరీ



**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత్ బాక్సర్ హితేష్ గులియా సంచలన విజయం సాధించాడు. మాజీ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించాడు. ఫైనల్స్‌లో తొమ్మిది మంది భారతీయుల్లో తొమ్మిది మంది సెమీఫైనల్‌కు చేరుకున్నారు. పవన్ బార్త్వాల్ (55 కిలోలు) మరియు హితేష్ గులియా (70 కిలోలు) టోర్నమెంట్‌లో రెండు అతిపెద్ద ఫలితాలను అందించారు. ప్రపంచ బాక్సింగ్ కప్ బ్రెజిల్ బంగారు పతక విజేత అల్టిన్‌బెక్ నూర్సుల్తాన్‌ను పవన్ ఓడించాడు. వెయిట్ కేటగిరీలో రెండవ సీడ్ అయిన నూర్సుల్తాన్‌ను నెట్టి క్లీన్ ఓపెనింగ్‌లను ఎంచుకున్నాడు. అలాగే హితేష్ రెండుసార్లు ఒలింపియన్, మాజీ ప్రపంచ ఛాంపియన్ సెవాన్ ఒకజావాను ఓడించి, స్ప్లిట్‌డెసిషన్ బౌట్‌లో విజయం సాధించాడు. వీరిద్దరితో పాటు సుమిత్ (75 కిలోలు), నవీన్ (90 కిలోలు), మరియు జదుమణి సింగ్ (50 కిలోలు) సాధించిన విజయాలు భారతదేశం రెండు సెషన్లలో పతక స్వీప్‌ను పూర్తి చేశాయి. హితేష్, ఒకజావా మధ్య రాత్రి జరిగిన మార్క్యూ బౌట్‌లో అత్యంత నాటకీయ ఫలితాలలో ఒకటిగా 3:2 తేడాతో విజయం సాధించింది. ఇద్దరు బాక్సర్లు ప్రారంభంలోనే జాగ్రత్తగా వ్యవహరించి ఓపెనింగ్‌లను అడ్డుకున్నారు, కానీ 2వ రౌండ్ చివరిలో హితేష్ నుండి వచ్చిన శక్తివంతమైన హుక్ అతనికి ప్రారంభంలోనే ఆధిక్యాన్ని ఇచ్చింది. 3వ రౌండ్‌లో ఒకజావా దూకుడుగా ఎదురుదెబ్బ తగిలింది, కానీ మొదటి రెండు రౌండ్లలో హోమ్ ఫేవరెట్ క్లీన్ వర్క్ అతనికి పతకాన్ని ఖాయం చేసింది. అంతకుముందు 75 కిలోల క్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ దక్షిణ కొరియాకు చెందిన కిమ్ హ్యెయోన్‌టేపై 5:0 తేడాతో విజయం సాధించి పవన్ ఆధిక్యాన్ని తెచ్చుకున్నాడు.

# ఆరు రోజుల లాభాలకు బ్రేక్
### నష్టాల్లో ముగిసిన స్టాక్ సూచీలు




**ముంబయి, నవంబరు 18:** వరుసగా ఆరు రోజులు లాభాల్లో ర్యాలీ తీసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు మంగళవారం బ్రేకులు పడ్డాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 277.93 పాయింట్లు నష్టపోయి 84,673.02 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 వద్ద ముగిసింది. ఉదయం సెషన్ ఫ్లాట్‌గా ప్రారంభమైనప్పటికీ, కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్లు నెగెటివ్ జోన్‌లోకి జారుకున్నాయి. ఇటీవల మార్కెట్లు పుంజుకోవడంతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించారని, దీనికి బలహీన అంతర్జాతీయ సంకేతాలు తోడయ్యాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను డిసెంబర్‌లో తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు నష్టపోయాయి. అయితే, ప్రైవేట్ బ్యాంకులు కొంతమేర మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూసారు. ఫెడ్ పాలసీ నిర్ణయాలపై ఈ డేటా ప్రభావం చూపనుంది. భవిష్యత్తులో ఇండోయూఎస్ వాణిజ్య ఒప్పందంలో పురోగతి, దేశీయ కంపెనీల ఆర్థిక ఫలితాలు మార్కెట్లకు మద్దతునిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీ అత్యధికంగా 1.10 శాతం పతనం కాగా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా నష్టాలను చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోగా, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతం మేర నష్టపోయాయి.

# తగ్గిన బంగారం, వెండి ధరలు
### అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం 4033 డాలర్లు

**ముంబయి, నవంబరు 18:**అమెరికా ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల తగ్గింపు సమీప కాలంలో ఉండక పోవచ్చని చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా బులియన్ మార్కెట్‌లో ధరలు తగ్గాయి. ఐదు రోజుల్లోనే తులం బంగారంలో ఐదువేలు తగ్గాయి. అంతర్జాతీయంగా కూడా ఔన్స్ బంగారం విలువలు 4033 డాలర్లు పెరగకుండా కట్టడి అయ్యాయి. డాలర్ రూపాయి మారకం విలువల్లో డాలర్ పటిష్టం కావడం, ఫెడ్ రిజర్వు రేట్‌కట్‌పై ఆశలు సన్నగిల్లడమే ఇందుకు కారణమని బులియన్ వర్తకులు చెపుతున్నారు. 24 కేరట్ల బంగారందరలు గ్రాముకు 12,366గా నడిచింది. 22 క్యారెట్లు 18 క్యారట్ల ధరలు కూడా అలాగే క్షీణించాయి. ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, చెన్నైలలో ఇదేవిధంగా ప్రతిబింబించాయి. చెన్నైలో 24 కేరట్లు 12,437 రూపాయలు, ఇతర మెట్రో నగరాలలో కూడా ఇదే తరహా అటూ ఇటూగా నమోదయ్యాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పదిగ్రాముల బంగారంధర రూ.1.25 లక్షలు పలుకుతుంటే 22 కేరట్లు 1.14 లక్షలువద్ద ఉంది. ఇటు వెండి కూడా కిలో ఒక్కింటికి 1.56 లక్షలరూపాయలు పలుకు




తోంది. ఈనెల 13న పదిగ్రాముల పసిడిధరలు 1.30 లక్షలవద్ద ఉంది. ఐదురోజుల్లోనే ఐదువేల మేర తగ్గింది. వెండి కిలో కూడా రూ.1.70 లక్షలవరకూ ఉండేది అప్పటితోపోలిస్తే ఇపుడు రూ.15 వేలు తగ్గింది. ఔన్స్ బంగారం 4200 డాలర్లుంటే ఇపుడు 4033గా నడుస్తోంది. వెండి ప్రస్తుతధర ఔన్స్ ఒక్కింటికి 49 డాలర్లుగా ఉంది.



# దేశాభివృద్ధికి 9,9,6 విధానమే శ్రేష్ఠం
### ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కొత్త లెక్కలు

**బెంగళూరు, నవంబరు 18:** ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తి మరోసారి పని సంస్కృతిపై వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్త చర్చకు నాందిపలికారు. గతంలో భారత యువత వారానికి 70 గంటలు పనిచేయాలని చెప్పి సంచలనం సృష్టించిన ఆయన, ఈసారి చైనాలో ఒకప్పుడు అమల్లో ఉన్న 996 పని విధానాన్ని ఉదహరించారు. దేశాభివృద్ధి వేగవంతం కావాలంటే యువత ఎక్కువ గంటలు పనిచేయడం తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన 79 ఏళ్ల మూర్తి చైనా అనుసరించిన కఠోర పనివిధానం వల్లే ఆ దేశం ఆర్థికంగా వేగంగా పురోగమించిందని గుర్తు చేశారు. చైనా టెక్ కంపెనీలలో ఒకప్పుడు ప్రాచుర్యంలో ఉన్న 996 విధానం అంటే ఉద్యోగులు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు, వారానికి ఆరు రోజుల పాటు పనిచేయడం. అంటే, వారానికి మొత్తం 72 గంటల పని అన్నమాట. తయారీ రంగంలో భారత్ చైనాను అధిగమించగలదా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ అది సాధ్యమే కానీ, అందుకు అసాధారణమైన నిబద్ధత అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ మనకంటే ఆరు రెట్లు పెద్దది. మనం 6.57 శాతం వృద్ధి రేటుతో పర్వాలేదనిపించినా, వారితో పోటీ పడాలంటే ప్రతి ఒక్కరూ అసాధారణంగా కృషి చేయాలని ఆయన వివరించారు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ గురించి ఆలోచించే ముందు యువత తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని మూర్తి పునరుద్ఘాటించారు. ప్రతి పౌరుడు, అధికారి, రాజకీయ నాయకుడు, పారిశ్రామికవేత్త ఇలా ప్రతి ఒక్కరూ తమకు తాము ఉన్నత ప్రమాణాలు నిర్దేశించుకున్నప్పుడే భారత్ చైనాను అందుకోగలదని ఆయన అన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.